6-9Pg1exHNWMJQE:6-9Pg1exHNWMJQE.qxd 9/5/2026 11:59 PM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-9-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 218 పేజీలు: 10+4 వెల: 8.00

ఆఫ్రికా పెద్దది.. గ్రీన్‌లాండ్ చిన్నది!
5లో

లారీని ఢీకొన్న కారు.. 8 మంది యువకుల మృతి



జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం న్యూఢిల్లీలో టీచర్ అవార్డులు గెలిచిన వారితో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

## డ్రగ్స్, మొబైల్స్ నుంచి విద్యార్థులను కాపాడండి

### వారిలో స్క్రీన్ బానిసత్వం తగ్గించండి: టీచర్లకు దిశానిర్దేశం చేసిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** డ్రగ్స్, మొబైల్‌ఫోన్లకు బానిసలు కాకుండా చిన్నారులను నియంత్రించాల్సిన ప్రధాన బాధ్యత ఉపాధ్యాయులదేనని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. శనివారం జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవంసందర్భంగా జాతీయ టీచర్ అవార్డులు గెలిచిన వారితో ప్రధాని మోడీ మాట్లాడారు. ఢిల్లీలోని 7, లోక్‌కల్యాణ్ మార్గ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గెలిచినవారితో మాట్లాడుతూ పిల్లలు ఎక్కువగా స్క్రీన్‌కు బానిసఅవుతున్నట్లు చెప్పారు. >>2

# ప్రతి స్కూలుకు ఓ బ్రాండ్

### దేశానికి ఆదర్శంగా రాష్ట్ర విద్యావిధానం
### ఎఐ వచ్చినా టీచర్ల స్థానం భర్తీ కాదు..
### కోర్సులను రీస్ట్రక్చరింగ్ చేయాలి
### ఉపాధ్యాయ దినోత్సవంలో సిఎం చంద్రబాబు



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం విజయవాడలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి లోకేష్ ఉన్నారు

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యార్థులను భవిష్యత్ ప్రపంచానికి సిద్ధం చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రావాలని ఆకాంక్షించారు. పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు కోర్సులను రీస్ట్రక్చరింగ్ చేయాల్సిన అవసరం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఎఐ, క్వాంటం, రోబోటిక్స్, డేటా అనలటిక్స్‌వంటి ఆధునిక రంగాల్లో విద్యా ర్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపా ధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. దేశ భవిత అయిన విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం వేదిక వద్ద ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించి, విద్యాశాఖ చేపడుతున్న కార్యక్రమాలపై వివరాలుఅడిగి తెలుసుకు >>2

## త్వరలో 12వ పిఆర్‌సి

### 2 పెండింగ్ డిఎలు ఇస్తాం: సిఎం

**విజయవాడ, సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగుల సమన్వయంచేసుకుంటూ ప్రభుత్వం ప్రగతిని సాధిస్తుందని సిఎం చంద్రబాబు అన్నారు. వారు ప్రభుత్వంలో అంతర్భాగంగా అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. వారిసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అత్యంత బాధ్యతగా ఆలోచిస్తుందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 12వ పేరివిజన్ కమిషన్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. అలాగే పెండింగులో ఉన్న 4 డీఏల్లో 2 డిఎల విడుదలకు ముఖ్యమంత్రి అంగీకరించారు. వీటితో పాటు మరికొన్ని ముఖ్యమైన >>2



మహిళల ఆసియా కప్

## భారత్ హ్యాట్రిక్ విక్టరీ

### పాక్‌పై 8.4 ఓవర్లలోనే భారత్ జట్టు విజయం
### సెమీస్‌కు దూసుకెళ్లిన హర్మన్‌ప్రీత్ జట్టు

2లో

## అమెరికా ఉద్యోగం ఆశలు ఆవిరి!

### హెచ్1 బి వీసా ఫీజులు ఇక రెండు లక్షల డాలర్లు పైనే

5లో

## జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణ

### 28 కొత్త జడ్పీల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ

**విజయవాడ,సెప్టెంబరు 5, ప్రభాతవార్తప్రతినిధి:** కొత్త జిల్లాల సంఖ్యకు అనుగుణంగా జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణ చేయనుంది. ప్రస్తుతం ఉన్న 13 జడ్పీల స్థానంలో 28 కొత్త జడ్పీలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం జిల్లాలకు సైతం జడ్పీల మంజూరు చేసింది. కొత్త జిల్లా పరిషత్‌ల నిర్వహణ కోసం 30 కీలక పోస్టులపై దృష్టి సారిస్తుంది. అదనంగా 15 జడ్పీ సిఇఒ, 15 డిప్యూటీ సిఇఒ పోస్టుల ఏర్పాటుకు ఆమోదించింది. ఈ నెల 24తో ప్రస్తుత జడ్పీ పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. గడువు ముగిసిన వెంటనే 28 కొత్త జడ్పీల వ్యవస్థ అమల్లోకి రానుంది. 660 మండలాలను కొత్త జడ్పీల పరిధిలోకి మ్యాపింగ్ చేయాలని ఆదేశించింది. పనిభారం ఆధారంగా ప్రస్తుత సిబ్బందినే కొత్త జడ్పీలకు ప్రభుత్వం సర్దుబాటు చేయనుంది.

## సోమశిల హైలెవెల్ కాలువ పూర్తిచేస్తాం

### రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం



**మర్రిపాడు (నెల్లూరు), సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** సోమశిల హైలెవల్ కెనాల్‌ను పూర్తిచేసి మర్రిపాడు మండలానికి ఆ సాగునీరు అందించడమే తమ లక్ష్యమని మర్రిపాడు ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం మర్రిపాడు మండలం డిసిపల్లిలో శ్రీకోదండరామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి కోటి రూపాయలు దేవాదాయ శాఖ నిధులతో మంత్రి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పురాతన, గ్రామీణ దేవాలయాలను పునర్నిర్మించి ఆధ్యాత్మిక అభివృద్ధికి బాటలు వేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.

**మర్రిపాడుకు సాగునీరు అందిండచమే లక్ష్యం**

సోమశిల హైలెవల్ కెనాల్ ద్వారా మర్రిపాడు మండలానికి నీరు అందించే విషయంలో ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. కెనాల్‌కు సంబంధించిన పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని ఒప్పించి సోమశిల హైలెవల్ కెనాల్ ప్రాజెక్టును ప్రారంభించి శంఖుస్థాపన చేసి టెండర్లు పిలిచామన్నారు. మొదటి విడతలో కాల్వల పనులు దాదాపు 68శాతం పూర్తయ్యాయన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో మిగిలిన 32శాతం పనులను పూర్తిచేయకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఈ పెండింగ్ పనులనుపూర్తి చేయడం ద్వారా ప్రాజెక్టు ప్రయోజనాలను రైతులకు, గ్రామీణ ప్రజలకు అందించేందుకు >>2



## 2029లోగా 3 డిఎస్సీలు

### పిల్లల జీవితాలను మార్చే శక్తి టీచర్లకే ఉంది: మంత్రి లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యాశాఖలో ఎపి మోడల్ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా తీర్చిదిద్దుతామని విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు. డిఎస్సీకి, ఎపిపిఎస్సీకి తేడా తెలియనివారు తమపై విమర్శలు చేస్తున్నారని మంత్రి నారా లోకేష్ విమర్శించారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో సిఎం చంద్రబాబు నాయుడితో కలిసి మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. తొలుత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి లోకేష్ మాట్లాడారు. 2029లోగా మరో 3 డిఎస్సీలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. విద్యాశాఖలో ఎపి మోడల్ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. రాష్ట్ర విద్యా వ్యవస్థలో సంస్కరణలు తెచ్చేందుకు కట్టుబడి ఉన్నామని లోకేష్ చెప్పారు. కాయలున్న చెట్టుకే రాళ్లదెబ్బలు తగులుతాయి.

14 డిఎస్సీలు వేసిన వ్యక్తి సిఎం చంద్రబాబు. మా ప్రభుత్వాల హయాంలో 2 లక్షల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. మా ప్రభుత్వంలో ఏటా డిఎస్సీ నిర్వహిస్తాం. 2029లోగా మరో మూడు డిఎస్సీలువస్తాయి. పిల్లలనుగొప్పవాళ్లుగా తయారు చేసే అద్భుతమైన అవకాశం టీచర్లకేఉంది. టీచర్లను విదేశాలకు పంపిస్తున్నాం స్టడీ చేసి రావాలని కోరుతున్నాం. ప్రాక్టికల్ విద్య అందిస్తేనే పిల్లలు అద్భుతాలుచేస్తారు. రాష్ట్ర విద్యా వ్యవస్థలో సంస్కరణలు తెచ్చేందుకు కట్టుబడి ఉన్నాం. పిల్లల జీవితాలను మార్చే శక్తి టీచర్లకే ఉందని మంత్రి లోకేష్ కొనియాడారు. పిల్లల మానసిక ఎదుగుదలపై టీచర్లు దృష్టిసారించాలన్నారు. వారి ప్రవర్తనలో మార్పులను జాగ్రత్తగా గమనించాలని సూచించారు.

ప్రభుత్వ బడులకు హౌస్‌ఫుల్, నో అడ్మిషన్ బోర్డులు ఉండాలని మంత్రి లోకేష్ అన్నారు. ఆధునికసాంకేతికత వైపు విద్యా >>2



## కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

### లష్కరే టాప్ కమాండర్ యాసిర్ హతం


**శ్రీనగర్,సెప్టెంబరు 5:** జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత ప్రక్రియ కొనసాగుతోంది. శనివారం మధ్య కశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా (ఎల్‌ఇటి) కమాండర్ యాసిర్ హతమయ్యాడు. యూస్‌మార్గ్ అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. యూస్‌మార్గ్ >>2

# గ్రామాలకు నీటి భద్రత

### ప్రజలకు నాణ్యమైన మంచినీరు అందించడమే లక్ష్యం
### యుద్ధ ప్రాతిపదికన ఫిల్టర్‌బెడ్‌ల పునరుద్ధరణ
### రూ. 26వేల కోట్లతో అమరజీవి జలధార పనులు

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన మంచి నీరు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మంత్రి పవన్ కల్యాణ్ విస్తృత స్థాయి కార్యచరణకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ తాగునీటి పథకాల పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూ. 35 కోట్ల నిధులు కేటాయించి, దాదాపు 370 గ్రామాల పరిధిలోని సమగ్ర రక్షిత మంచినీటి పథకాల్లో పాడైన 340 ఫిల్టర్ బెడ్లు పునరుద్ధరించారు. తద్వారా సుమారు 25 లక్షల మందికి నాణ్యమైన తాగునీటి సరఫరా చేస్తున్నారు. జల్ జీవన్ మిషన్ 2.0 మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో గ్రామీణ తాగునీటి వ్యవస్థల నిర్వహణ, సంరక్షణ చర్యలు చేపడుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మంచి నీటి వ్యవస్థలను బలోపేతం చేయడానికి అవసరమైన అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ పవన్ కల్యాణ్ ప్రణాళికలు ముందుకు తీసుకువెళ్తున్నారు. జల్ జీవన్ మిషన్ అమరజీవి జలధారల ద్వారా దాదాపు రూ. 26,000 కోట్ల విలువైన పనులు ముందుకు తీసుకువెళ్తున్నారు. చిత్తూరు, ప్రకాశం, పల్నాడు, ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో రూ. 7,910 కోట్లతో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకాల ద్వారా వచ్చే 30 యేళ్లలో 1.21 కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలు తీర్చనున్నారు. మరో పది మల్టీవిలేజ్ స్కీం పథకాలకు రూ. 9,355 కోట్లు మంజూరు



చేశారు. అత్యంత తీవ్ర నీటి ఎద్దడి కలిగిన 3 వేల గ్రామాలను గుర్తించి, రూ. 1,814 కోట్లతో సింగిల్ విలేజ్ వాటర్ స్కీంల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వీటితోపాటు గత ప్రభుత్వం అరకొర పనులు చేసి వదిలివెళ్లిన పులివెందుల, డోన్, ఉద్దానం తదితర మంచినీటి పథకాల పనులు పూర్తి చేస్తున్నారు. వీటితోపాటు పవన్ కల్యాణ్ చొరవతో 7,439 గ్రామీణ తాగునీటి పనుల క్రమబద్ధీకరణ, విస్తరణ నిమిత్తం >>2

ఒంగోలు రోడ్డుపై ఘోరం

## లారీని ఢీకొన్న మినీ లారీ

### ఇద్దరు దుర్మరణం



ప్రమాదంలో తుక్కుతుక్కయిన మినీ లారీ

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త:** ప్రకాశం జిల్లా ఒంగోలులోని 16వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సంఘమిత్ర ఫ్లైఓవర్ సమీపంలో మరమ్మతులకు గురైన లారీని రోడ్డు పక్కన నిలిపి ఉంచారు. విజయవాడ నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న మినీ లారీ అదే మార్గంలో వేగంగా వచ్చి ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద సమయంలో నిలిపి ఉంచిన లారీలో ఉన్న ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మినీ లారీ డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఒంగోలు తాలూకా పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. తాలూకా సిఐ విజయకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వివరాలు సేకరించారు. మృతులను పల్నాడు జిల్లా అమరావతి మండలం జీలుగు గ్రామానికి చెందిన చలంచర్ల తిరుపతమ్మ (27), బాపట్ల వెంకటేశ్వరమ్మ (24)గా గుర్తించారు. మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకుని ఒంగోలు జిజిహెచ్‌లోని మార్చురీకి తరలించారు. గాయపడిన మినీ లారీ డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంతో జాతీయ రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాలను క్రమబద్ధీకరించారు. ప్రమాద స్థలంలో ఉన్న వాహనాలను పక్కకు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ప్రమాద ఘటనను పరిశీలించిన >>2

6-9pg2exHMNWJQE:6-9pg2exHMNWJQE.qxd 9/6/2026 12:03 AM Page 1





శనివారం ఉద్యోగ సంఘాల నేతలతో సమీక్ష జరుపుతున్న సిఎం చంద్రబాబు

# త్వరలో 12వ పిఆర్‌సి

>> పెండింగ్ అంశాలకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో శనివారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రం ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. రాష్ట్ర ఆదాయవ్యయాల లెక్కలను ఉద్యోగుల ముందు ఉంచారు. రాష్ట్రం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా.... ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలతతో ఉన్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ మేరకు కొన్ని కీలక నిర్ణయాలను సీఎం ప్రకటించారు. 12వ పీఆర్సీ నియామకానికి అంగీకరించారు. అలాగే 172024, 112025లకు చెందిన రెండు డీఏల విడుదలకు ఆమోదం తెలిపారు. ఈ రెండు డీఏలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించనున్నారు. ఇక 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవులను వచ్చే సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాలో వేయడానికి అంగీకరించారు. ఇక పోలీసులకు 1 అడిషనల్ సరెండర్ లీవ్‌ను ఈ దసరాకు చెల్లించేందుకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేశారు. ఇక గత ప్రభుత్వం రద్దు చేసిన పెన్షనర్ల అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను వచ్చే ఏడాది జనవరి నుంచి ఇచ్చేందుకు నిర్ణయించారు. దీంట్లో భాగంగా 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిని వారికి 15 శాతం మేర అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ వర్తింప చేయనున్నారు. ఇక ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను స్ట్రీమ్ లైన్ చేస్తూ వచ్చే నెల నుంచే ఏ నెలకు ఆ నెల ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు చెల్లింపులు జరపాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల కోసం తీసుకున్న ఈ నిర్ణయాలతో ఏటా రూ.2,880 కోట్లు ప్రభుత్వానికి ఖర్చు కానుంది.

**రూ.30 వేల కోట్లకు పైగా పెండింగ్ బకాయిలు చెల్లించాం.**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా... గత రెండేళ్ల కాలంలో ఒకటో తేదీన క్రమం తప్పకుండా జీతాలు ఇస్తున్నాం.. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు ఇస్తున్నాం. 11 వేల మంది సిపిఎస్ ఉద్యోగులకు ఒపిఎస్ వర్తింపచేశాం. ఉద్యోగులకు సంబంధించి ఉన్న పెండింగ్ బిల్లుల్లో ఇప్పటి వరకు రూ.30,849 కోట్లు క్లియర్ చేశాం. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా వడ్డీలకు అప్పులు తెచ్చింది. ఆర్థిక సంస్థలతో చర్చించి రూ.1.50 లక్షల కోట్ల మేర అప్పులపై భారీగా ఉన్న వడ్డీలను రీ షెడ్యూల్ చేసి తగ్గించుకోగలిగాం. ప్రస్తుతం సరాసరి 9.1 శాతం వడ్డీని ప్రభుత్వం అప్పులపై చెల్లిస్తోంది. ఈ భారాన్ని ఇంకా తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. విధ్వంసమైన వ్యవస్థలను నెమ్మదిగా గాడిన పెడుతున్నాం. గత పాలకులు ఉద్యోగులను దగ్గరకే రానీయలేదు. రివర్స్ పిఆర్సీ ఇచ్చారు... అలాంటి పరిస్థితులు ఉద్యోగులు మరిచిపోవద్దు. గత ప్రభుత్వం రిటైరైన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌ను కూడా పెండింగులో పెట్టింది. ఉద్యోగులను అవమానించేలా వాలంటరీలతో కరపత్రాలు పంపిణీ చేయించారు.. హోర్డింగులు పెట్టించారు. పేపర్లో ప్రకటనలు ఇచ్చారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మధ్యవర్తులతోనే మాట్లాడే పరిస్థితి నాడు ఉండేది. సమస్యల పరిష్కారం కోసం నాటి సిఎం కాళ్లు పట్టుకోవాలని అప్పుడు మంత్రులుగా ఉన్న వారు కామెంట్లు చేశారు... అవమానించారు. మంచికి చెడుకు ఉన్న వ్యత్యాసాన్ని ఉద్యోగులందరూ గుర్తించాలి. మేం ఉద్యోగులను గౌరవిస్తున్నాం... సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో ఉన్నాం. రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు పడకూడదని వారి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చాం. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ సానుకూలంగా ఉంటాం. ఆర్థిక వెసులుబాటు ఉంటే ఉద్యోగులకు సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. 2014లో నాడు విభజన తర్వాత ఉద్యోగుల సంక్షేమానికి పెద్ద పీట వేశాం. విభజనకు వ్యతిరేకంగా పోరాడింది ఉద్యోగులే. వారిని గౌరవించాలని.. ఇబ్బందులు వస్తాయని తెలిసినా... 43 శాతం ఫిట్మెంట్ ఇచ్చాం. ఉద్యోగులు వారి సమస్యల గురించి.. యూనియన్ల కోసం పని చేస్తారు. నేను రాష్ట్రం కోసం... ప్రజల కోసం ఆలోచించాలి. ఇందులో ఉద్యోగులూ భాగమే."అని ముఖ్యమంత్రి చెప్పారు.

# లారీని ఢీకొన్న మినీ లారీ

>> పోలీసులు లారీలు నిలిపిన ప్రదేశం, రహదారి పరిస్థితులపై వివరాలు నమోదు చేసుకున్నారు. మినీ లారీ డ్రైవర్ వేగంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ పరిస్థితిపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఘటనకు సంబంధించిన ప్రత్యక్ష సాక్షుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో రహదారిపై ఉన్న ఇతర వాహనాల వివరాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## కాంగ్రెస్ ఎపి వ్యవహారాల ఇంచార్జిగా పివి మోహన్

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** కాంగ్రెస్ ఎపి వ్యవహారాల ఇంచార్జిగా పి.వి మోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఆదేశాలు జారీ చేశారు. కాంగ్రెస్ ఎపి వ్యవహారాల ఇన్‌చార్జిగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వర్తిస్తున్న మాణిక్యం ఠాగూర్ స్థానంలో పి.వి. మోహన్‌ను నియమిస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఎపి ఇన్‌చార్జిగా పనిచేసిన మాణిక్యం సేవలను అధిష్ఠానం కొనియాడింది. అంతేకాకుండా, కాంగ్రెస్ హై కమాండ్ ఎపితో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ నూతన ఇన్‌చార్జ్‌లను, ఎఐసిసి ప్రధాన కార్యదర్శులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## రాష్ట్రంలో కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు!

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు చేసే దిశలో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాజమండ్రి, గుంటూరు, తిరుపతి, కర్నూలు నగరాల్లో పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుకు పోలీస్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఇవి ఆమోదం పొందితే విజయవాడ, విశాఖతో కలిపి 6 కమిషనరేట్లు అవుతాయి. దీనివల్ల సైబర్ క్రైమ్ కట్టడి, సిసి కెమెరాల నెట్వర్క్, ట్రాఫిక్ శాంతిభద్రతల విభాగాల మధ్య సమన్వయం మెరుగుపడుతుందని, ప్రజలకు మెరుగైన భద్రత అందుతుందని అధికారులు భావిస్తున్నారు.

## గ్రీస్‌లో ఎయిర్‌షోలో కూలిన యుద్ధ విమానం

**ఏథెన్స్, సెప్టెంబర్ 5:** గ్రీస్ రాజధాని ఏథెన్స్‌కు ఉత్తరంగా శనివారం నిర్వహించిన వైమానిక ప్రదర్శనలో గ్రీక్ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానం కుప్పకూలింది. ప్రమాదం జరిగిన వెంటనే ఆకాశంలోకి భారీగా నల్లటి పొగలు ఎగసిపడ్డాయి. ఈ ఘటనను చూసిన వేలాది మంది ప్రేక్షకులు భయాందోళనకు గురయ్యారు.రెండు సీట్లున్న ఫాంటమ్ ఎఫ్4 యుద్ధ విమానం ప్రదర్శనలో భాగంగా ఎగురుతుండగా కూలిపోయింది. ప్రమాదంలో ప్రేక్షకుల్లో ఎవరైనా గాయపడినట్లు తక్షణ సమాచారం అందలేదు. అయితే విమానంలో ఉన్న పైలట్లు ప్రమాదానికి ముందే సురక్షితంగా బయటకు దూకారా అన్న విషయం వెంటనే స్పష్టం కాలేదని వైమానిక దళ అధికారులు తెలిపారు.

# ప్రతి స్కూలుకు ఓ బ్రాండ్

>> రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలను ముఖ్యమంత్రికి వివరించారు. ఎఐ వంటి వ్యవస్థలు వచ్చినా ఉపాధ్యాయుల స్థానాన్ని ఏదీ భర్తీ చేయలేదని. టీచర్ల వద్ద లేని సమాధానం ఎఐ కూడా చెప్పలేదని చంద్రబాబు అన్నారు. సాంకేతికతతో పాటు విద్యార్థుల్లో విలువలు, సంస్కృతి, దేశభక్తి, ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందించాలని సూచించారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై మరింత పెరిగిందన్నారు. విద్య కేవలం థియరీకి పరిమితంకాకూడదని, విద్యార్థులు బయటకు వెళ్లి అనుభవపూర్వకంగా నేర్చుకునేలా అవకాశాలు కల్పించాలని సూచించారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానం ఉండాలన్నదే తన ఆలోచనగా వెల్లడించారు. భవిష్యత్తును ముందుగానే ఊహించి నిర్ణయాలు తీసుకోవడం వల్లే ఐటీ విప్లవాన్ని అందిపుచ్చుకున్నామని సీఎం చెప్పారు. పాలనా సంస్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలు తెలుగు వారిని అగ్రస్థానంలో నిలిపాయని పేర్కొన్నారు. వచ్చే 1015 ఏళ్లలో విభిన్నమైన భారతదేశాన్ని చూడబోతున్నామని అన్నారు.

**2027 నాటికి సంపూర్ణ అక్షరాస్యత.**

ఉపాధ్యాయులు తమ తమ పాఠశాలలను ప్రత్యేక బ్రాండ్‌గా తీర్చిదిద్దాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. చదువుకునే వయసులో ప్రతి విద్యార్థి బడిలో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివేలా ప్రోత్సహించాలని, ఆవిష్కరణలు, సృజనాత్మకత, కష్టాలను ఎదుర్కొనే తత్వాన్ని వారిలో పెంచాలని సూచించారు. ఏడో తరగతి చదివే విద్యార్థులు సైతం ఎఐలో ప్రావీణ్యం సాధించేలా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రతి పాఠశాలా మోడల్ స్కూల్‌గా మారితే కుటుంబాలు, గ్రామాలు, చివరకు దేశం మారుతుందని చెప్పారు. విద్యార్థులను నాయకత్వ లక్షణాలతో తీర్చిదిద్దాలని కోరారు. క్రీడలు, ప్రకృతితో విద్యార్థులను అనుసంధానం చేయాలని, ప్రతి శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. 2027 నాటికి రాష్ట్రంలో వంద శాతం అక్షరాస్యత సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం తెలిపారు. క్లిక్కర్, ఎఐ ట్యూటర్ వంటి సాంకేతికతలను ఉపయోగించి బోధనలో మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంటే.. ఆంధ్రప్రదేశ్ దేశంలో నంబర్ వన్‌గా ఉండాలని ఆకాంక్షించారు. ఆ లక్ష్యానికి పునాది పాఠశాలల్లోనే పడాలని, దాన్ని సాధించేది ఉపాధ్యాయులేనని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఉపాధ్యాయుల నియామకాలు అవసరమనే ఆలోచనతో తమ హయాంలోనే డీఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చామని చంద్రబాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకం మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకంపైనే చేశామని చెప్పారు. నియామకాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు 350కి పైగా పిటిషన్లు వేసినా వాటన్నింటినీ అధిగమించి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఉపాధ్యాయుల ప్రతిభే వారికి కొలమానంగా ఉండేలా కౌన్సెలింగ్ ప్రక్రియను తీసుకొచ్చామని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చామని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో మహిళల భాగస్వామ్యం పెంచేందుకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని చెప్పారు.

**సవాళ్లను సమర్థంగా ఎదుర్కొందాం**

టెక్నాలజీతో ఉపాధ్యాయులకు కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. టీచింగ్ ప్రొఫెషన్ పూర్తిగా మారిపోయిందని ఆయన అన్నారు. గతంలో దండనతో అయినా పాఠాలు నేర్పించేవారని ఇప్పుడు కనీసం తిట్టినా ఇబ్బందులు ఎదురవుతున్నాయని సిఎం వ్యాఖ్యానించారు. సున్నితమైన పరిస్థితుల మధ్య ఉపాధ్యాయులు వివేకంతో ఆలోచన చేసి వ్యవహారాన్ని చక్కబెట్టాలని అన్నారు. మానసిక బలహీనతతో తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని.. సామాజిక మాధ్యమాల ప్రభావంతో చెడు అలవాట్లకు బానిస అవుతున్నారని ఈ పరిస్థితులు ఆవేదన కలిగిస్తున్నాయని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు ఈ తీరుకు అద్దం పడుతున్నాయన్నారు. పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ప్రిన్సిపల్‌ను చంపేశారని, విజయనగరంలో ఓ పిల్లాడు తల్లినే హత్యచేశాడని అన్నారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో విద్యాబోధన సవాళ్లతో కూడిన అంశంగా మారిపోయిందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. దీనికి పరిష్కారంగా ఆధ్యాత్మికతను, యోగా, ధ్యానంలాంటి ఉత్తమ పద్ధతుల్ని అలవాటు చేయాలని సిఎం పిలుపునిచ్చారు.

**ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వరాలు**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సిఎం పలు వరాలు ప్రకటించారు. 12వ పిఆర్సీ నియామకానికి అంగీకారం తెలిపామని చెప్పారు. రెండు డిఎలను అక్టోబరు నుంచి ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. 2022 సరెండర్ లీవ్ మొత్తాన్ని సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. పోలీసులకు ఈ దసరాకు అదనపు సరెండర్ లీవ్ ఇస్తామన్నారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను 10-15 శాతం పెంచుతున్నట్లు ప్రకటించారు. ఎంప్లాయీస్ హెల్త్ ఇన్సూరెన్స్ మొత్తాన్ని ప్రతి నెలా జమ చేసేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఎప్పుడూ గౌరవం ఇస్తుందని స్పష్టం చేశారు. భారతీయ సంస్కృతి ప్రపంచంలోనే అత్యుత్తమం అని సిఎం అన్నారు. విలువలను, సంస్కృతి, సంప్రదాయాలు, దేశభక్తి, ప్రకృతి పట్ల ప్రేమను విద్యలో భాగం చేయాలని సూచించారు. జీవితాంతం నేర్చుకునే విధానాన్ని అలవాటు చేసుకోవాలని చెప్పారు. భారత్ మళ్లీ విశ్వగురు స్థానానికి రావాలంటే అది ఉపాధ్యాయుల వల్లే సాధ్యమని... విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దాలని సిఎం ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

**ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం**

రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 175 మంది ఉపాధ్యాయులను ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సత్కరించారు. వారికి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. అవార్డు సాధించిన దివ్యాంగ ఉపాధ్యాయుడు ఎం.పద్మనాభంను సత్కరించేందుకు ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి స్వయంగా వేదిక దిగివెళ్లారు. ఆయనను సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, ఎమ్మెల్సీ వర్లరామయ్య,ఎంపీ కేశినేని శివనాథ్ సహా విద్యాశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

### 10 నుండి
### తిరుపతి -విజయవాడల మధ్య
## కొత్త విమానసర్వీసు

**విజయవాడ, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** విజయవాడ ప్రాంతం నుండి తిరుపతి వెళ్లే భక్తులకు కొత్త విమానసర్వీసు అందుబాటులోకి రానుంది. ఈనెల 10 వతేదీ నుండి ఫ్లై 91 విమానసంస్థ వారంలో నాలుగురోజులపాటు ఈరెండు పట్టణాల మధ్య విమాన సర్వీసును నడిపేందుకు షెడ్యూల్ ప్రకటించింది. ప్రతి గురువారం, మంగళవారం, శనివారం, ఆదివారం ఉదయం 8.05గంటలకు తిరుపతిలో బయలుదేరిన విమానం 9.15 గంటలకు గన్నవరం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఉదయం 9.45గంటలకు విజయవాడలో బయలుదేరి 10.50 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. కాగా విజయవాడ తిరుపతి మధ్య ఇప్పటికే ఇండిగో సంస్థ విమానసర్వీసును నడుపుతుంది. ఇండిగో సంస్థ సోమవారం, బుధవారం, శుక్రవారం మూడురోజులపాటు డైరెక్ట్ విమాన సర్వీసును నడుపుతుంది. తిరుపతిలో మధ్యాహ్నం 12.25గం.కు బయలుదేరినవిమానం మధ్యాహ్నం 13.35 గంటలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని 2.15గంటలకు విజయవాడ నుండి బయలుదేరి మధ్యాహ్నం 3.20గంటలకు తిరుపతి చేరుకుంటుంది. విజయవాడ తిరుపతి మధ్య ప్రతిరోజూ విమానసర్వీసు అందుబాటులోకి రావటంతోపాటు టిక్కెట్‌ధరలు సైతం అందుబాటులో ఉండటంతో వెంకన్న భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### వారం - వర్జ్యం

06-09-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె,
తి.దశమి రా.7.29, న.ఆరుద్ర రా.7.52
వ. లేదు
దు.సా.4.33 - సా.5.22
రాహు. సా.4.30-సా.6.00
శుభ ఉ.6.00-ఉ.7.00.

### వార్తాఫలం

**మేషం :** ఉద్యోగయత్నాలకు అనుకూలమైన కాలం. కుటుంబ సభ్యులతో ఏర్పడిన మాటపట్టింపులు తొలగుతాయి.

**వృషభం :** ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. భూవివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**మిథునం :** కాంట్రాక్టులు పొందుతారు. వివాహ యత్నాలు ఫలిస్తాయి. వస్తు, లాభాలు పొందుతారు.

**కర్కాటకం :** నూతన వ్యాపారాలు ప్రారంభించి విజయవంతంగా పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో హోదాలు పొందుతారు.

**సింహం :** కొత్త వ్యాపారాలలో తొందరపాటు వద్దు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. కొత్త పరికరాలు కొనుగోలు .

**కన్య :** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆశ్చర్య పరుస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు.

**తుల :** ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి సంతృప్తి కరంగా వుండును. నూతన వస్తు, వస్త్ర కొనుగోలు.

**వృశ్చికం :** పాత మిత్రులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. సోదరుల నుండి కీలక సమాచారం అందుతుంది.

**ధనుస్సు :** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. పనుల్లో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు.

**మకరం :** పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. జీవిత భాగస్వామి సలహాతో ముందుకు సాగుతారు.

**కుంభం :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**మీనం :** పనులు సకాలంలో పూర్తిచేస్తారు. దూరప్రాంతాలనుండి విలువైన సమాచారం అందుతుంది. ప్రోత్సాహం లభిస్తుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శనివారం న్యూఢిల్లీలో మెట్రో రైలులో ప్రయాణిస్తూ పిల్లలతో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

# మెట్రోలో ప్రయాణించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది వేడుకలకు హాజరయ్యేందుకు ఢిల్లీ మెట్రోలో ప్రయాణిస్తూ కళాశాలకు చేరుకున్నారు. ఎస్‌ఆర్‌సిసి శతాబ్ది వేడుకల్లో ప్రసంగించేందుకు వెళ్లే ముందు మోడీ మెట్రో కార్డుతో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా మెట్రోలో ఉన్న ప్రయాణికులు, విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. సాధారణ ప్రయాణంగా ఉండే మెట్రో ప్రయాణం ప్రధాని తమతో కలిసి ప్రయాణించడంతో అక్కడి వారికి ప్రత్యేక అనుభవంగా మారింది.మెట్రోలో ప్రయాణిస్తున్న సమయంలో మోడీ పలువురు ప్రయాణికులు, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఎస్‌ఆర్‌సిసికి చేరుకున్నారు. ఎస్‌ఆర్‌సిసి స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శతాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించటం విశేషం.

# విద్యార్థులను కాపాడండి

>> మొబైల్ ఫోన్లకు పిల్లలు హత్తుకుపోతున్నారన్న ఉద్దేశాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఒకవేళ క్రీడల పట్ల పిల్లల్లో ఆసక్తి పెరిగితే, అప్పుడు ఆ స్క్రీన్ బానిసత్వం నుంచి వాళ్లు బయటపడే అవకాశాలు ఉంటాయని ప్రధాని మోడీ అన్నారు. క్రీడలు అంటే వీడియో గేమ్స్ కాదు అని ఆయన స్పష్టం చేశారు. పిల్లల్లో సృజనాత్మక పెంచాలని, వారిలో ఆటల పట్ల ఆసక్తి పెంచేలా చేయాలన్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి ప్రోగ్రామ్‌లను డిజైన్ చేయాలని టీచర్లకు ప్రధాని సలహా ఇచ్చారు. డ్రగ్స్ అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. కొన్ని ప్రధాన నగరాలు, యూనివర్సిటీల్లో ఈ సమస్య ఉందని, కానీ దీని పట్ల సరైన అవగాహన లేదని, ఎటువంటి వివరణ లేకుండానే కొన్ని సార్లు ఆంక్షలు అమలు చేస్తున్నారని అన్నారు. పిల్లల ప్రవర్తన పట్ల టీచర్లు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, వారిలో జరుగుతున్న బిహేవియర్ మార్పులను పరిశీలించాలన్నారు. యావత్ విద్యా వ్యవస్థకు తాను ఒక్క విషయాన్ని చెప్పాలనుకుంటు న్నానని, కేవలం పాఠ్య పుస్తకాల బోధనలతో మాత్రమే కాదు, పిల్లలతో మమేకంగా కలిస్తేనే వారిలో మార్పు వస్తుందన్నారు. బాల్యాన్ని అంతం చేయవద్దు అని, ఆ బాల్యాన్ని రక్షించే సామర్థం టీచర్లకు ఉందని, పిల్లలు సజీవంగా ఉండేందుకు కావాల్సిన చర్యలన్నీ చేపట్టడమే టీచర్ల బాధ్యత అని ప్రధాని మోడీ తెలిపారు. టీచర్స్ డే సందర్భంగా ఆయన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎస్ రాధాకృష్ణన్‌కు నివాళి అర్పించారు.

# 2029లోగా 3 డిఎస్సీలు

>> వ్యవస్థను నడిపించాలన్నారు. విద్యాశాఖలో ఎపి మోడల్ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం 117 జీవో తెచ్చి పిల్లలను పాఠశాలలకు దూరం చేసిందని ఆరోపించారు. కుటమి ప్రభుత్వం నేటి కాలానికి అనుగుణంగా పాఠశాల సిలబస్ మారుస్తున్నామన్నారు. నిడమర్రులో లీప్ స్కూల్ మోడల్ ఏర్పాటు చేశామని, తాము తీసుకున్న చర్యల వల్ల వేలమంది పిల్లలు ప్రభుత్వ బడుల్లో చేరారని మంత్రి లోకేష్ వివరించారు. ప్రభుత్వ బడుల్లో వసతుల గురించి పలువురు టీచర్లు ప్రచారం చేస్తున్నారని అభినందించారు. ఇంప్రూవ్‌మెంట్, పర్‌ఫెక్షన్ అనేవి జర్నీ మాత్రమే లక్ష్యం కాదన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివిన పిల్లలను పోటీపరీక్షలకు సిద్ధం చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతిభావంతులైన పిల్లలను పరిశోధన వైపు ప్రోత్సహిస్తున్నామన్నారు. గంగాధర్, అరుణ్‌కుమార్ లాంటి టీచర్లు ఎంతో కష్టపడుతున్నారని ఉపాధ్యాయులను మెచ్చుకున్నారు.కార్యక్రమం ప్రారంభానికి ముందు మంత్రి లోకేష్ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవ ప్రాంగణంలో పాఠశాలలకు సంబంధించిన వివిధ ప్రదర్శనలు తిలకించారు. ఉత్తమ ఉపాధ్యాయులు, వారి కుటుంబసభ్యులతో మాట్లాడారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన 175 మంది టీచర్లకు అభినందనలు తెలిపారు.

## కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

>> ప్రాంతంలో ఉగ్రవాదుల సంచారంపై నిఘా వర్గాల నుంచి అందిన కచ్చితమైన సమాచారంతో స్పెషల్ ఫోర్సెస్, 53 రాష్ట్రీయ రైఫిల్స్ దళాలు సంయుక్తంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. భద్రతా బలగాల రాకను గమనించిన ఉగ్రవాదులు కాల్పులకు తెగబడటంతో దళాలు ప్రతిదాడి చేశాయి. ఈ కాల్పుల్లో యాసిర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. యాసిర్ గతంలో లష్కరే తోయిబాలోని సులేమాన్ మూసా గ్రూప్‌లో సభ్యుడిగా ఉండేవాడని, అయితే సుమారు యేడాది క్రితం ఆ విభాగం నుంచి విడిపోయి సొంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. గత కొంతకాలంగా యూస్‌మార్గ్ పరిసర ప్రాంతాల్లో అతడి కదలికలపై నిఘా ఉంచినట్లు అధికారులు తెలిపారు. యాసిర్ మృతి నేపథ్యంలో అతడి నెట్‌వర్క్, లష్కరే సభ్యులతో ఉన్న సంబంధాలు, అలాగే ఇటీవల జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడుల్లో అతడి ప్రమేయంపై దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయి. కాగా, 2025 పహల్గాం ఉగ్రదాడికి సూత్రధారి అయిన సులేమాన్ మూసాను గతంలోనే భద్రతా బలగాలు హతమార్చిన సంగతి తెలిసిందే. కశ్మీర్‌లో ఉగ్రవాద నిర్మూలనకు చేపట్టిన ఆపరేషన్లలో యాసిర్ ఎన్‌కౌంటర్ కీలక విజయమని అధికారులు పేర్కొన్నారు.

## మహిళల ఆసియా కప్
# భారత్ హ్యాట్రిక్ విక్టరీ

**దుబాయి, సెప్టెంబరు 5:** మహిళల ఆసియా కప్‌లో భారత జట్టు హ్యాట్రిక్ విజయం సాధించింది. తక్కువ స్కోరింగ్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను టీమిండియా చిత్తుగా ఓడించింది. శ్రీ చరణి37, ప్రేమా రావత్39ల విజృంభణతో 55పరుగులకే పాక్ కుప్పకూలగా భారత మహిళ జట్టు స్వల్ప లక్ష్యాన్ని 8.4 ఓవర్లలోనే ఛేదించింది. టాపార్డర్‌ను ఫాతిమా సనా(3-17) త్వరగా వెనక్కి పంపినా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(18 నాటౌట్), దీప్తి శర్మ(12 నాటౌట్)లు ఒత్తిడికి లోనవ్వకుండా ఆడారు. దాంతో ఈ మెగా టోర్నీలో దాయాదిపై ఏడో విజయంతో సెమీస్‌కు దూసుకెళ్లింది భారత్. ఆసియా కప్‌లో భారత మహిళల జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. వరసగా రెండు విజయాలతో జోరుమీదున్న టీమిండియా ఎప్పటిలానే పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఏకపక్ష పోరులో పాక్‌ను వికెట్ల తేడాతో ఓడించింది. తొలుత స్పిన్నర్లు పంజా విసరడంతో దాయాదిని 55కే కట్టడి చేసిన భారత్ చిన్న లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. అ టీమిండియా స్పిన్నర్లు చెలరేగిన చోట పేసర్ ఫాతిమా సనా(3-17) చకచకా మూడు వికెట్లు తీసింది.తన మొదటి ఓవర్లోనే డేంజరస్ ఓపెనర్ షఫాలీ వర్మ(12)ను ప్రతీకా రావల్(4)ను ఔట్ చేసింది. ఆ తర్వాతి బౌండరీతో ఆత్మవిశ్వాసంగా కనిపించిన స్మృతి మంధాన(9)ను సైతం ఎల్బీగా వెనక్కి పంపింది పాక్ కెప్టెన్. దాంతో 29 పరుగులకే మూడు వికెట్లు పడ్డాయి. ఆ తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(18 నాటౌట్), దీప్తి శర్మ(12 నాటౌట్) నింపాదిగా ఆడి పవర్ ప్లేలో వికెట్ ఇవ్వలేదు. నష్ర వేసిన 9వ ఓవర్లో వరసగా 4, 6 బాదిన కౌర్ జట్టుకు 7 వికెట్ల విజయాన్ని అందించింది. అనిశ్చితికి కేరాఫ్ అయిన పాకిస్థాన్ ఆసియా కప్‌లో టీమిండియా స్పిన్నర్లకు తలొగ్గింది. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న పాక్‌కు షఫాలీ షాకిచ్చింది. ఓపెనర్ మునీబా అలీ(13)ని బౌల్డ్ చేసి తను బ్రేకివ్వగా అక్కడి నుంచి చరణి, రావత్ చుట్టేశారు. మరో ఓపెనర్ జుల్ఫికర్(14)ను చరణి ఎల్బీగా వెనక్కి పంపింది. వీరిద్దరూ స్పిన్ మ్యాజిక్ చూపించగా పాక్ బ్యాటర్ల తడబాటు మొదలైంది.భారత బౌలర్ల ధాటికి నలుగురు డకౌటవ్వగా మునీబ చేసిన 13 రన్స్ మినహా ఎవరూ రెండంకెల స్కోర్ దాటలేదు. దాంతో.. 18.1 ఓవర్‌లో 55 పరుగులకే దాయాది జట్టు ఆలౌటైంది.

## హైలెవెల్ కాలువ పూర్తిచేస్తాం

>> ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. 32శాతం పనులు పూర్తయితే పొంగూరు, ఇస్కపల్లి, పెగళ్ళపాడు ప్రాంతాల్లోని చెరువులు, వాగులు నీటితో నిండుతాయన్నారు. తద్వారా చుట్టుప్రక్కల అనేక గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందిప అవకాశం ఉంటుందన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్ పనులను ఖచ్చితంగా పూర్తి చేసి తీరుతామని మంత్రి పునరుద్ఘాటించారు. కోనసముద్రం రైతులు తన దృష్టికి తెచ్చిన సమస్యపై కూడా మంత్రి స్పందించారు. సోమశిల నార్త్ కెనాల్‌లోని స్లూయిజ్‌ను పూర్తిస్థాయిలో పునర్నిర్మించడంతోపాటు సుమారు 300మీటర్ల మేర కాలువ పనులు చేపట్టి నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే పలు ప్రాంతాలకు నీరు చేరుతోందని, భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. మర్రిపాడు, ఉదయగిరి ప్రాంతాలకు నీరు అందించే విషయంలో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతోందన్నారు.

# గ్రామాలకు నీటి భద్రత

>> రూ. 4,054 కోట్ల కేటాయింపులకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది పవన్ కల్యాణ్ గ్రామీణ మంచి నీటి సరఫరా విభాగం బాధ్యతలు చేపట్టిన క్షణం నుంచి ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీరు చేరాలన్న లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారు. గ్రామాల్లో ఫిల్టర్ బెడ్ల సమస్యలు ఉన్న విషయం ఆయన దృష్టికి వచ్చింది. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో గ్రామీణ తాగునీటి పథకాలను పూర్తిగా నిరక్ష్యం చేయడంతో ఫిల్టర్ బెడ్లు దెబ్బతిని, నీటి నాణ్యత తగ్గిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనేక ప్రాంతాల్లో రంగు మారిన నీరు సరఫరా కావడం, శుద్ధి వ్యవస్థలు సక్రమంగా పని చేయకపోవడం వంటి సమస్యలు తీవ్రంగా ప్రభావం చూపాయి. గ్రామాల్లో సైతం ప్రజలు తాగునీటి అవసరాలు తీర్చుకునేందుకు డబ్బు వెచ్చించాల్సి వచ్చేది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పవన్ కళ్యాణ్ గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థల సమగ్ర పరిశీలనకు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రత, స్థానిక అవసరాలు మరియు ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**గుడివాడ గ్రామీణ తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం**

కృష్ణా జిల్లా, కంకిపాడు వేదికగా పల్లెపండుగ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు పవన్ కల్యాణ్ వెళ్లిన సందర్భంలో ఆ వేదికపైన గుడివాడ శాసనసభ్యులు తమ నియోజకవర్గ గ్రామీణ ప్రాంతంలో ప్రజలు తాగునీటి సరఫరాలో నాణ్యతా లోపాల కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులు వివరించారు. ఈఅంశంపై తక్షణం స్పందించిన ఉపముఖ్యమంత్రి ఆనియోజకవర్గంలో తాగునీటి నాణ్యతపై క్షేత్రస్థాయి సర్వేకు ఆదేశాలు ఇచ్చారు. 44 గ్రామాల తాగునీటి అవసరాలు తీర్చే 40 ఫిల్టర్ బెడ్లు దెబ్బతిన్నట్లు గుర్తించి, రూ. 3.80 కోట్లతో వాటి పునరుద్ధరణ ప్రక్రియ తక్షణం పూర్తి చేశారు. అంతేకాదు వలివర్తిపాడు, మల్లాయపాలెం గ్రామాల్లో జరుగుతున్న నీటి శుద్ధి పనులను స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. విజయనగరం గొర్ల గ్రామంలో అతిసారం ప్రబలినప్పుడు ఆ ప్రాంత పర్యటనలో భాగంగా తాగునీటి సరఫరాలో లోపాలను గుర్తించి, తక్షణ మరమ్మతులకు ఆదేశాలు ఇచ్చారు. దేశంలో ఉన్న ప్రతి ఒక్కరికీ రోజుకు 55 లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలన్న గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జల్ జీవన్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా, ప్రతి గ్రామానికీ సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో సిఎం నారా చంద్రబాబు నాయుడు సహకారంతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తున్నట్టు పవన్ కల్యాణ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు

6-9Pg3exHMNWJQE:6-9Pg3exHMNWJQE.qxd 9/6/2026 12:06 AM Page 1



# తిరుమల సమాచారం

## వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు

**తిరుమల,సెప్టెంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఆరంభానికి ముందే తిరుమల భక్తజనసంద్రంగా మారింది. శనివారం సాయంత్రానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్ లలోని 32 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల క్యూలైన్లలో శిలాతోరణం వరకు బారులుతీరారు. దీంతో స్వామి వారి సర్వదర్శనానికి మధ్యాహ్నానికి 24గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఆరుగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. సాయంత్రం వరకు 42వేలమందికి మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 20 వేలమంది అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి.



## కోలాహలంగా ఉట్లోత్సవం: వీక్షించిన మలయప్పస్వామి

**తిరుమల,సెప్టెంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణజన్మాష్టమి వేడుకల్లో భాగంగా తిరుమలలో శనివారం సాయంత్రం ఉట్లోత్సవం కోలాహలంగా జరిగింది. వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించిన మరుసటి రోజు ఉట్లోత్సవాన్ని (శిక్యోత్సవం) నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై, కృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరువీధులలో ఊరేగుతూ పలుప్రాంతాల్లో ఉట్లోత్సవాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, శ్రీవారి ఆలయ ఇన్ ఛార్జ్ డిప్యూటీ ఇఒ భయ్యాల భాస్కర్, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఎఇఒ అశోక్ పాల్గొన్నారు.

## సంస్థ ప్రతిష్టను కాపాడుకోవడం ముఖ్యం

### ఉద్యోగులు అంకితభావంతో సేవలందించాలి: అదనపు ఇఒ



**తిరుమల,సెప్టెంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానంలో దేవుని చెంత పనిచేసే అవకాశం కలగడం గొప్ప అదృష్టమని, ఉద్యోగులు అంకితభావంతో సేవలందించడమే ప్రధానమని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి అభిప్రాయం వెలిబుచ్చారు. వ్యక్తిగతంగా ఎవరూ కూడా సంస్థకు నష్టం కలిగించేలా వ్యవహరించరాదనేది ఆయన మనసులో మాట వెలిబుచ్చారు. ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో సహకారంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. సానకూల దృక్ఫథంతో ఆలోచనచేసి దేవుని చెంత టిటిడిలో పనిచేస్తూ,తప్పుచేయకూడదని అనే భావనతో విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఇటీవల టిటిడిలో చోటుచేసుకున్న కొన్ని ఘటనల నేపథ్యంలో శనివారం ఉదయం తిరుమలలో మీడియాప్రతినిధులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఇష్టాగోష్టిగా మాట్లాడారు. అందులో లక్షలాదిమంది భక్తులకు ఉద్యోగుల సేవలు, అధికారుల పనితీరు చాలావరకు బావుందని కితాబిచ్చారు. ఇటీవల 'వార్త'దినపత్రికలో వెలువడిన 'ఏసిబి నిఘాలో అక్రమార్కులు ఇంకా ఉన్నారట!టిటిడిలో అవినీతి తిమింగలాల్లో గుబులు!' అంశంపై కూడా ఆయన స్పందించారు. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు కూడా ఆయా శాఖల్లో పనిచేస్తున్నారని, ఇక్కడ సంస్థ ముఖ్యమని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఉద్యోగులు సంయమనంతో పనిచేయాల్సి ఉంటుందనే అభిప్రాయాన్ని వెల్లడించారు. అనంతరం వెంకయ్య చౌదరి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలపై వివరించారు.



## శ్రీవారి పేరుతో నడిచే సంస్థలకు భారీ విరాళం

### ఎస్‌బిఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

**తిరుమల,సెప్టెంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి పేరుతో నడిచే సంస్థలకు ఎస్‌బిఐ భారీ విరాళాలందించింది. తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో పీడియాట్రిక్స్ క్రిటికల్ కేర్ యూ నిట్ ఏర్పాటుకు 57 లక్షల రూపాయలు ఆర్థిక సాయాన్ని ఎస్‌బిఐ అధికారులు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్‌కు విరాళం చెక్‌ను అందజేశారు. తిరుపతి ఐఐటికి 15 లక్షలు రూపా యలు, తిరుపతిలోని రాస్ పరిధిలో మహిళలకు కుట్టు మిషన్ల కోసం 15 లక్షలు చెక్కును ఇచ్చారు. భారతీయ స్టేట్ బ్యాంక్ సిఎస్ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత) కింద సమాజ శ్రేయస్సు, ప్రజావైద్యం, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా దాదాపు 87.26 లక్షల విరాళాలను అందజేయడం జరిగిందని ఆ బ్యాంక్ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి, ఉన్నతాధికారులు తెలిపారు.





## శ్రీవారి ఆశీస్సులతో శుభాలు కలగాలి: పలువురు ప్రముఖులు

**తిరుమల,సెప్టెంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు ప్రజలు సుఖసంతోషాలతో వుండాలని, రాష్ట్రప్రజలకు అంతామంచి జరగాలని తిరుమల శ్రీవేంకటేశ్వం స్వామివారిని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. శనివారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని భారత్ బయోటెక్ ఛైర్మన్ కృష్ణ ఎల్ల,టిడిపి నాయకులు గంటా శ్రీనివాసరావు, దేవినేని ఉమామహేశ్వర్ రావు, బుచ్చయ్య చౌదరి ,సినీ నిర్మాత డి వి వి దానయ్య కుటుంబ సభ్యులతో కలసి వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత: టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ

**తిరుమల,సెప్టెంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారిని దర్శించుకుని, వాహన సేవలను ఆనం దంగా తిలకించేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ తెలిపారు. తిరుమల ఆలయ నాలుగు మాడ వీధులతోబాటు ఇతర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై శనివారం తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఇతర అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సివిఎస్ఒ మాట్లాడుతూ గత బ్రహ్మోత్సవాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి టిటిడి విజిలెన్స్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పకడ్బందీ భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల ధ్వజారోహణం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు, బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు ఐ.రామకృష్ణ, రవి మనోహరాచారి,విఎస్ఒ సురేంద్ర, తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# మన దృష్టి అంతా పిల్లల సంక్షేమంపైనే

## జువెనైల్ జస్టిస్ చట్టం అమలుపై కార్యక్రమంలో హైకోర్టు సిజె జస్టిస్ లీసాగిల్

**విజయవాడ, సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** చట్టంతో వైరుధ్యం ఉన్న పిల్లవాడైనా, రక్షణ, సంరక్షణ అవసరమైన పిల్లవాడైనా.. మన దృష్టి ఎల్లప్పుడూ ఆ పిల్లల సంక్షేమం పైనే ఉండాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ అన్నారు. జువైనల్ జస్టిస్ చట్టం అమలులోకి వచ్చి పదేళ్ల అవుతున్న సందర్భంగా విజయవాడలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసాగిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు సామాజిక నిర్లక్ష్యానికి, పేదరికానికి బాధితులుగా మారుతుంటారని, పిల్లలలో సహజంగానే ఒక ప్రత్యేకమైన సున్నితత్వం ఉంటుందని ఆమె అన్నారు. వివిధ జువైనల్ జస్టిస్ బోర్డులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, చైల్డ్ ప్రొటెక్షన్ సొసైటీలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు, స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్లు అన్ని జిల్లాల్లోని ప్రత్యేక చైల్డ్ కేర్ హోమ్‌ల ఏర్పాటు, పనితీరు గురించి మాట్లాడుకుంటాం. చట్టం లక్ష్యాలు, ఉద్దేశాలకు అనుగుణంగా పిల్లలకు అనుకూలమైన విధానాలను అవలంబించడం గురించి మాట్లాడుతాం. ఇది పునరావాస న్యాయం, సంస్థాగత జవాబుదారీతనంపై ఆధారపడి ఉం టుందన్నారు. మన దత్తత ప్రక్రియలను సరళీకృతం చేశామని కూడా గర్వంగా చెప్పుకుంటాం, నిజానికి ఇక్కడ చేరిన మన మందరం మనల్ని మనం ప్రశ్నించుకోవాలన్నారు. మన ప్రయత్నాలలో మనం ఎంతవరకు విజయం సాధించామో తెలుసుకోవాలన్నారు. నిజానికి ఈ పిల్లలే మన దేశపు భవిష్యత్. మన భవిష్యత్ ఈ పిల్లల భద్రతపైనే ఆధారపడి ఉంది. మనం చాలా దూరం వచ్చాం. కానీ, ఇక్కడ కూర్చున్న మనలో ప్రతి ఒక్కరికీ మన వ్యవస్థలో ఉన్న స్పష్టమైన, నిలకడలేని లోపాల గురించి బాగా తెలుసు. ఆ లోపాలు మన కళ్లముందే స్పష్టంగా కనిపిస్తున్నాయి. నా దగ్గర పూర్తి గణాంకాలు, వివరాలు ఉన్నప్పటికీ, ఈ సమయంలో నేను ఆ వివరాల్లోకి వెళ్లడం లేదు. నైపుణ్యం కలిగిన సిబ్బంది కొరతతో మనం ఇబ్బంది పడుతున్నామన్నారు. మనం ఎదుర్కొంటున్న మరొక పెద్ద సవాలు డిజిటల్ ప్రపంచం నుంచి వస్తోంది. సైబర్ బుల్లీయింగ్, ఆన్‌లైన్ బాల లైంగిక వేధింపులు, పిల్లలకు అందుబాటులో ఉన్న అపరిమితమైన డిజిటల్ ఎక్స్‌పోజర్ ఇవన్నీ మనం తక్షణమే పరిష్కరించాల్సిన సమస్యలన్నారు. జస్టిస్ భట్టు దేవానంద్ మాట్లాడుతూ భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించేందుకే సమావేశం ఏర్పాటు చేశాం. పిల్లల సమస్యలకు సమగ్ర పరిష్కారం చూపడానికి రూపొందించారు. పిల్లలు పలు రకాల ఇబ్బందులకు గురై, బాధితులుగా మారుతున్నారు. నిరుపేద పిల్లల సంరక్షణ గృహాలు రక్షణలో ముఖ్యమైన భాగాలు. శిక్ష, నిర్బంధమే కాకుండా పునరావాసం, మానసిక పరివర్తనపై దృష్టి పెట్టాలన్నారు. అంచనాలపై కాకుండా కచ్చిత డేటా ఆధారంగా విధానాలను రూపొందించాలని జస్టిస్ భట్టు దేవానంద్ తెలిపారు.



# వశిష్టలో దూకి నలుగురు ఆత్మహత్యాయత్నం

### సూసైడ్ నోట్లో 'అమ్మా నన్ను క్షమించు'

### మృత్యువుతో పోరాడుతున్న పద్మిని

### నదిలో కొట్టుకుపోయిన భర్త, ఇద్దరు పిల్లలు

### ఆర్థిక సమస్యలే బలవన్మరణానికి కారణం

**నరసాపురం(చించినాడ) తణుకు సెప్టెంబరు 5 ప్రభాతవార్త:** పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం డివిజన్ ఎలమంచిలి మండలం చించినాడ వంతెన పైనుండి దూకి శనివారం నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో కుటుంబ యజమాని నంబూరి శ్రీనివాస్ అతని ఇద్దరి పసిబిడ్డలు నదిలో కొట్టుకుపోయారు. శ్రీనివాస్ భార్య పద్మినిని మత్స్యకారులు రక్షి ంచడంతో ఆమెను పాలకొల్లు ఆసుపత్రికి తరలించి ఆ తరువాత మెరుగైన వైద్యం కోసం తణుకు తీసుకువెళ్లారు. రెండు స్కూటీల పై వచ్చి వారు ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఆ రెండు వాహనాలు వంతెన పైనే ఉన్నాయి. ఆర్థిక కారణాలతో వారు బలవన్మరణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ వారంలోనే వేల్పూర్‌కి చెందిన దంపతులు కేవలం అరకాసు ఉంగరం సమస్యతో తమ బిడ్డ ను స్కూటీ వద్ద వదిలి నదిలోకి దూకి చని పోయారు. ఆ మృతదేహాలు ఇంత వరకు దొర కలేదు. ఈ లోగానే మరో ముగ్గురు నది కెరటా లకు అంకితమయ్యారు. గత పదిహేను రోజులుగా వశిష్ట నది వరద నీటితో నిండి ఉంది. దీంతో మృతదేహాలు కూడా దొరకడం లేదు. నరసాపురం ప్రాంతంలో పేరుపాలెం బీచ్ చించినాడ వంతెన మృత్యుకుహారాలుగా మారాయి. పేరుపాలెం బీచ్ లో ప్రతి పది రోజులకి ఎవరో ఒకరు కెరటాలకు అంకితం అవుతూనే ఉన్నారు. ఇప్పుడు చించినాడ వంతెన డెత్ స్పాట్‌గా మారింది. తణుకు చెందిన శ్రీనివాస్ కిళ్ళీ కొట్టు నడుపుతారు. ముక్కు పచ్చలా రని పిల్లలను సైతం వారి ఆర్థిక సమస్యలకు బలి చేశారు. పద్మిని చివరిగా రాసిన నోట్లో రెండు లక్షల 60వేలు చెల్లించి ఇంటి దస్తావేజులు తీసుకో మని ఒకరికి రాస్తూ చివరిగా అమ్మ నన్ను క్షమిం చు అని కూడా పెట్టారు. పద్మిని మృత్యువుతో పోరాడుతోంది. ఆమె ఆత్మహత్యాయత్నం నుండి బయటపడింది కాబట్టి ఆత్మహత్య కారణాలు బయటకు రావచ్చు. చించినాడ వంతెన వద్ద జరిగిన రెండు ఆత్మహత్యలు కూడా తణుకు ప్రాంతం వారివే కావడం మరో విశేషం.



నంబూరి శ్రీనివాస్, ఇద్దరు చిన్నారులు(ఫైల్)

# వెలిగొండ ఫీడర్ కాలువలో ఇద్దరు యువకుల గల్లంతు

### ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు

**పెద్ద దోర్నాల సెప్టెంబరు 5 ప్రభాతవార్త:** శ్రీ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలవలో ఇద్దరు యువకులు గల్లం తైన ఘటన కలకలం రేపుతోంది. పెద్ద దోర్నాల మండలం కటకానిపల్లెకు చెందిన యువకులు ఫీడర్ కాలువ చూసేందుకు వెళ్లారు. ముగ్గురు కాలువలోకి దిగారు. ఒకరు నీటి ప్రవాహం లో తప్పించుకోగా వారిలో రాజు(23) వినయ్(22)లు గల్లం తయ్యారు.



గల్లంతయిన యువకులు(ఫైల్)

ఆగస్టు 31వ తేదీ వెలుగొండ ప్రాజెక్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభోత్సవం చేశారు. కృష్ణా జలాలను చూసేందుకు ప్రజలు ఫీడర్ కాలువకు తరలివస్తున్నారు. ఇద్దరు యువకులు గల్లంతయిన సమాచారం అందుకున్న ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గూడూరి ఎలక్షన్ బాబు కటకానపల్లెకు చేరుకొని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

అధికారులను అప్ర మత్తం చేసి సహాయక చర్యలు మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు.

ఈ సహా యక చర్యలలో మార్కాపురం ఆర్డీవో శివరా మిరెడ్డి, దోర్నాల మండల తాసిల్దార్ సిహెచ్ అశోక్ కుమార్ రెడ్డి, ఎర్రగొండపాలెం సిఐ కె అజయ్ కుమార్, పోలీసులు పాల్గొన్నారు.


# కోటలో మహిళ దారుణ హత్య

**కోట (నెల్లూరు), సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** కోటలోని కోటమ్మగుడి కాలనీలో శుక్రవారం రాత్రి ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. కాలనీలో నివాసం ఉంటున్న యశోదమ్మ భర్త నాగరాజుతో సమీప బంధువైన నాగభూషణమ్మ గత కొంత కాలంగా చిల్లకూరు మండలం రామారెడ్డిపాళెంలో సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో యశోదమ్మ శుక్రవారం తన ఇంటికి రమ్మని నాగభూషణమ్మను పిలిపించుకుంది. శుక్రవారం రాత్రి యశోదమ్మ భర్త నాగరాజు ఓజిలికి వివిధ పనులపై వెళ్లాడు. దీంతో పక్కాపథకంతో యశోదమ్మ ఇనుప రాడ్డుతో నాగభూషణమ్మ తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. నాగభూషణమ్మకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. తన భర్త చనిపోవడంతో కొంతకాలంగా నాగరాజుతో రామారెడ్డిపాళెంలో సహజీవనం చేస్తుంది. ఈ విషయం యశోదమ్మకు కూడా తెలుసు. అయితే తన బంధువు కావడంతోనే ఆమె చూసీచూడనట్లు వ్యవహరిస్తూ వచ్చింది. మనసులో కక్ష పెట్టుకుని ఈ ఘాతుకానికి పాల్పడిందని మృతురాలు నాగభూషణమ్మ తల్లి రోశమ్మ శనివారం కోట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు గూడూరు వన్‌టౌన్ సీఐ మాలకొండయ్య, కోట ఎస్ఐ పవన్ కుమార్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీమ్ నిపుణులు యశోదమ్మ ఇంటికి వెళ్లి వేలిముద్రలు సేకరించారు. హత్యకు ఉపయోగించిన ఇనుపరాడ్డును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలు యశోదమ్మ పరారీలో ఉంది. యశోదమ్మ హత్య చేసి ఉండవచ్చనని ఆకోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. అయితే మహిళను సహతోటి మహిళే హత్య చేసిందా? లేక ఇతర వ్యక్తులు ఎవరైనా ఈ హత్యలో పాల్గొన్నారో అనేది కూడా ప్రస్తుతం కాలనీలో చర్చనీమైంది. పోలీసులు టెక్నికల్‌గా అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తే ఈ హత్యలో ఎవరో ఎవరో పాల్గొనది తెలుస్తుంది. యశోదమ్మ గత రెండు రోజులగా వాడిన ఫోన్ కాల్స్ డేటాను పరిశీలిస్తే కొంత మేర సమాచారం తెలస్తుంది.



# అమెరికాలో రోడ్డు ప్రమాదం: అనంత జిల్లా వాసి దుర్మరణం

**అనంతపురం క్రైమ్, సెప్టెంబరు5 ప్రభాతవార్త:** ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన అనంతపురం జిల్లాకు చెందిన ఓ యువకుడికి రోడ్డు ప్రమాదం కబళించింది. తాజాగా అమెరికాలోని అర్కాన్సాస్ రాష్ట్రంలో సంభవించిన ఘోర రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లాకు చెందిన నిస్సార్ అనే యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. విదేశాల్లో ఉన్నత చదువులు, ఉద్యోగం కోసం వెళ్లిన కుమారుడు అకాల మరణం చెందాడనే వార్త తెలియడంతో అనంతపురం జిల్లాలోని లోని ఆయన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రమాదం జరి గిన తీరు, దానికి దారి తీసిన కచ్చితమైన పరిస్థితులపై స్థానిక అమెరికా పోలీసులు కేసునమోదు చేసి సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. కారువేగం వల్ల అదుపుతప్పి ప్రమాదానికి గురైందా లేక ఎదురుగా వచ్చిన మరొక వాహనం ఢీకొట్టడం వల్ల ఈ దుర్ఘటన జరిగిందా అనే కోణంలో అధికారులు ఘటనా స్థలి నుంచి సాక్ష్యాధారాలు, సీసీటీవీ ఫుటేజీలను సేకరిస్తున్నారు. నిస్సార్ భౌతికకాయాన్ని స్వదేశానికి వేగంగా తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని స్థానిక తెలుగు సంఘాల ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



నిస్సార్(ఫైల్)


# వరుస దొంగతనాల కేసుల్లో ఇద్దరి అరెస్టు

### రూ.13 లక్షల విలువైన నగదు, బంగారం, వెండి స్వాధీనం

**పులిచెర్ల (తిరుపతి జిల్లా), సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** కల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రూ.13 లక్షల విలువైన దొంగసొత్తును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు 106 రామిరెడ్డిగారిపల్లి గ్రామానికి చెందిన ఎం. శంకర్‌రెడ్డి ఇంట్లో మే 15న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి 8 గ్రాముల బంగారు గొలుసు, రూ.20 వేల నగదు అపహరించారు. దీనిపై కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా చిత్తూరు ఫింగర్‌ప్రింట్స్ బ్యూరో సిబ్బందితో పరిశీలన చేయించగా రొంపిచెర్ల మండలం దద్దాలవారిపల్లికి చెందిన ఆవులకుంట నరేష్ వేలిముద్రలుగా గుర్తించినట్లు నిర్ధారణ అయింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం పులిచెర్ల రైల్వే స్టేషన్ వద్ద నరేష్‌తో పాటు అతనికి సహకరించిన పిన్న బోయున శ్రీనివాసులును పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో నరేష్ 2025లో కొత్తపేటలోని అబ్దుల్ మునాఫ్ ఇంటితో పాటు, కల్లూరు- పులిచెర్ల ంచే దారి లో వగాళ్ల వారి వల్లి సమీపంలోని ఎల్లమ్మ ఆలయం, 106 రామిరెడ్డి గారివల్లి, బలిజిపల్లి లో ఏకాంబరం ఇంట్లో దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే పీలేరు, చంద్రగిరి మండలాల్లోని ఆలయాల్లోనూ దొంగతనాలు చేసినట్లు అంగీకరించినట్లు పేర్కొన్నారు. దొంగతనం చేసిన బంగారాన్ని వివిధ బంగారు ఆభరణాల దుకాణాల్లో విక్రయించేందుకు శ్రీనివాసులు సహకరించినట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుల నుంచి రూ. 2.42 లక్షల నగదు, 78 గ్రాముల బంగారం, 30 గ్రాముల వెండి కలిపి సుమారు రూ.13 లక్షల విలువైన దొంగసొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడీ ఆదేశాల మేరకు చిత్తూరు డీఎస్పీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో కల్లూరు సీఐ ఎం. జయరామయ్య పర్యవేక్షణలో ఎస్ఐ యు. వెంకటేశ్వర్లు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేశారు.



# రాజకీయ భవిష్యత్తుపై రేపు విజయసాయి ప్రకటన



**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తన భవిష్యత్తుపై కీలక నిర్ణయం తీసుకోనున్నారు.ఆయన ఈ నెల 7వ తేదీ మధ్యా హ్నం 1:15 నిమిషాలకు విజయవాడ లెమన్ ట్రీ ప్రీమియర్ హోటల్లో ప్రెస్ మీట్‌ను విజయసాయి నిర్వహిస్తున్నారు. ఈ ప్రెస్ మీట్‌లో భవిష్యత్తు రాజకీయ విధానం గురించి కీలక ప్రకటన చేస్తానని ఎక్స్‌లో విజయసాయిరెడ్డి పోస్ట్ చేసారు.విజయసాయి రెడ్డి ఇటీవల తానెందుకు వైసిపికి రాజీనామా చేయాల్సి వచ్చింది బహిరంగ లేఖలో వెల్లడించారు.తనపై సజ్జల రామకృష్ణారెడ్డి భౌతిక దాడికి పాల్పడిన విషయాన్ని విజయసాయి వెల్లడించారు.ఈ అంశాన్ని జగన్ పట్టించుకోలేదన్నారు.నూతన పార్టీని త్వరలోనే ప్రకటిస్తానంటూ ఇది వరకే వెల్లడించారు సాయిరెడ్డి. దీంతో ఆయన ఏర్పాటు చేసిన ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ పై అందరి చూపూ నిలిచింది. ఎలాంటి ప్రకటన చేయబోతోన్నారనేది ఇప్పటి నుంచే చర్చనీయాంశంగా మారింది.ఈ క్రమంలో ఏపీలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ తెరమీదికి రావాల్సిన అవసరం ఉందంటూ విజయసాయిరెడ్డి తాజాగా ఓ ట్వీట్ పోస్ట్ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# హైవే వంతెనపై ప్రమాదం

## బస్సు డ్రైవర్ మృతి, మహిళకు తీవ్రగాయాలు



**మనుబోలు (నెల్లూరు), సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** మనుబోలు మండలంలోని గురవిందపూడి క్రాస్ రోడ్ సమీపంలోని కృష్ణపట్నం క్రాస్‌రోడ్డు వద్దహైవేవంతెనపై శనివారం తెల్లవారు జామున ఘోరరోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ముందు వెళుతున్న లారీని వెనుక నుండి ట్రెవల్ బస్సు ఢీకొనడంతో బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఒక మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో 18 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయి. పోలీసుల వివరాలు మేరకు తిరుపతి నుండి విజయవాడకు సుమారు 30 మంది ప్రయాణికులతో వెళుతున్న ట్రావెల్ బస్సు కృష్ణపట్నం క్రాస్‌రోడ్డు సమీపంలోని హైవే వంతెనపైకి చేరుకున్న సమయంలో ముందు వెళుతున్న లారీని వేగంగా ఢీకొంది. దీంతో బస్సు ముందు భాగంగా తీవ్రంగా దెబ్బతినడంతో డ్రైవర్ లారీ వెనుక భాగంలో ఇరుక్కుపోయి మృతి చెందాడు. డ్రైవర్ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాద సమాచారం అందుకున్న హైవే మొబైల్ సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్ మస్తాన్, కానిస్టేబుల్ మహేష్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని బయటకు తీసి చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఈఘటనపై పోలీసుల వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉత్తమ జర్నలిస్టు అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

### 12 విభాగాల్లో పురస్కారాలు

### 28లోగా దరఖాస్తులు అందాలి

**విజయవాడ, సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** జర్నలిజం రంగంలో విశేష సేవలందిస్తూ, వృత్తిపరమైన ప్రతిభను కనబరిచిన పాత్రికేయులను ప్రోత్సహించి, వారి సేవలను గుర్తించి గౌరవించేందుకు 2025 సంవత్సరానికి 12 విభాగాల్లో ఉత్తమ జర్నలిస్టు అవార్డులు అందజే యాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అవార్డులకు అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు ఆయా విభాగాలకు చెందిన జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన జర్నలిస్టులు తమ దరఖాస్తులను 2026 సెప్టెంబరు 28వ తేదీ సాయంత్రం 5.00 గంటల్లోగా కింది చిరునామాకు పంపించాలని ఆయన సూచించారు.డైరెక్టర్,సమాచార పౌరసంబంధాల శాఖ, 2వ అంతస్తు, ఎన్టీఆర్ పరిపాలన భవనం,పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్, విజయవాడ-520013..కమిటీ విచక్షణాధికారంతో ఎంపిక చేసే పురస్కారాలు .కింది మూడు పురస్కారాలకు జర్నలిస్టుల నుంచి ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరించకుండా, ఎంపిక కమిటీ తన విచక్షణాధికారంతో పురస్కార గ్రహీతలను ఎంపిక చేస్తుంది. 1.వి.ఆర్.నార్ల జీవిత సాఫల్య పురస్కారం. 2. కొక్కు అహోబలరావు ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డు 3. మద్దూరి అన్నపూర్ణయ్య పేరిట రాష్ట్రంలోని చిన్న,మధ్యతరహా వార్తాపత్రికల సంపాదకులకు అందించే అవార్డు.



రైతులతో మాట్లాడుతున్న రోణంకి కూర్మనాథ్

# వచ్చే మార్చికి భూవివాదాలు లేని రాష్ట్రంగా ఏపి : రోణంకి కూర్మనాథ్

**విజయవాడ, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** వచ్చే ఏడాది మార్చి నాటికి రీసర్వే పనులు పూర్తిచేసి రాష్ట్రాన్ని భూవివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది కృషిచేస్తున్నట్లు రాష్ట్రసర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ రైతులకు భరోసా ఇచ్చారు. ఎన్టీఆర్‌జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలో నిర్వహిస్తున్న భూముల రీసర్వే పనులను శనివారం ఉదయం ఆయన ఆకస్మిక తనిఖీ చేసారు. ఈసందర్భంగా కూర్మనాథ్ మాట్లాడుతూ రీసర్వేలు తప్పులు జరుగకుండా ఉండేందుకు రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వే చేసే రోజున సంబందిత రైతు లేదా వారి కుటుంబసభ్యులు క్షేత్రస్థాయిలో ఉండాలని, సర్వేపూర్తయిన తరువాత డాక్యుమెంట్ వెరిఫికేషన్ ద్వారా సరిహద్దుల నిర్ణయం రైతు సమక్షంలోనే జరగాలన్నారు. రైతు చేతికి సరైన కొలతలతో కూడిన పట్టాదారు పాసుపుస్తకం అందచేసే వరకు సమాచారం తప్పనిసరిగా అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యా ప్తంగా 2,800 బృందాలతో అత్యాధునిక రోవర్స్‌తో సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులతో మాట్లాడి సర్వే పై రైతుల అభిప్రాయాలు సేకరించారు. ఈకార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలపై కొత్త నిబంధనలు

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నగరపాలక సంస్థల ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇటీవల తీసు కొచ్చిన ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ చట్టాల సవరణ చట్టం, 2026 అమలుకు ఆమోదం తెలుపుతూ ఏకకాలంలో మేయర్, వార్డు మెంబర్ల ఎన్నికల నిర్వహణ నియమావళిని ఖరారు చేసింది. ఈమేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్ జీవో నెం. 210,జీవో నెం. 211 పేరిట రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ చట్టాలకు చేసిన తాజా సవరణలు ఈ ఏడాది ఆగస్టు 28 నుంచే రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చినట్లు జీవో 210 ద్వారా ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈ సవరణల ఆధారంగానే ఇకపై రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. సవరించిన చట్టం ప్రకారం ఖిది ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్స్ మేయర్, వార్డు మెంబర్ల ఎన్నికల నిర్వహణ రూల్స్ 2026ఖి ను తక్షణమే అమల్లోకి తెస్తూ జీవో 211ను విడుదల చేశారు. నామినేషన్ల ఘట్టం నుంచి ఓట్ల లెక్కింపు వరకు పకడ్బందీగా ఈ నిబంధనలను రూపొందించారు. మేయర్ లేదా కార్పొరేటర్ స్థానాలకు పోటీ చేసే జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ. 5,000, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యర్థులు రూ. 2,500 మేర నామినేషన్ డిపాజిట్ చెల్లించాలి. ఒక అభ్యర్థి ఒకే స్థానానికి గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను మాత్రమే దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు.

6-9pg4:6-9pg4.qxd 9/5/2026 11:42 PM Page 1



# ఆంక్షలున్నా.. అడుగడుగున ప్రమాదాలే

రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలను వివరిస్తున్న నిపుణుల మాటలను సర్కారు విభాగాలు ఇకనైనా పట్టించుకోవాల్సి న అవసరం వుంది. డ్రైవర్ల నిర్లక్ష్యానికి కళ్లెం వేయడంతో పాటు రోడ్డు ఇంజనీరింగ్ ను మెరుగుపరచాల్సిన అవసరాన్ని నిపుణులు పదేపదే గుర్తుచేస్తున్నారు. రోడ్డు ఇంజనీరింగ్ ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్చాల్సిన అవసరం వుంది. ప్రమాదకర మలుపులను సరిచేయాల్సి వుంది. దీనివల్ల అనేక ప్రాంతాలలో రహదారులు ఇప్పటికీ నెత్తురోడుతున్నాయి. ఇక దీని తరువాత వాహనాలను నడిపే డ్రైవర్లు డ్రైవింగ్ పై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలి. వాహనాలను నడిపే డ్రైవర్ అంతకుముందు కచ్చితంగా అరగంట పాటు విశ్రాంతి తీసుకోవాలనే నిబంధన వున్నా ఇది ఎక్కడా అమలవడం లేదు. డ్రైవర్ పక్కన కూర్చున్న వ్యక్తి ఎట్టి పరిస్థితుల్లోనూ నిద్రపోకూడదు. ఇలా చేస్తే డ్రైవర్ కు నిద్ర మత్తు ఆవహించి మొదటికే మోసం వచ్చే వీలుంది. మలుపుల వద్ద, చౌరస్తాల వద్ద కచ్చితంగా ఒకటికి పదిసార్లు గమనించిన తరువాతే వాహనాలను ముందుకు తీయాలి. ఇక అన్నింటికీ మించి డ్రైవర్లు పాటలు వినడం లేదా, ఇతర అంశాలపై ఫోకస్ వుండడం, సెల్ఫోన్లు మాట్లాడడం వంటివి చేయడం మరింత ప్రమాదకరంగా చెప్పాలి. ఇక దీనికితోడు వాహనాలను నడిపే డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించరాదు. ఇటీవల జరిగిన అనేక ప్రమాదాలలో బస్సులు, ఇతర వాహనాల డ్రైవర్లు మద్యం సేవించడం వల్ల జరిగాయని తేలింది. ఇక అన్నింటికీ మించి తగిన అర్హత లేనివారు అంటే ద్విచక్ర వాహనం డ్రైవింగ్ లైసెన్స్ వున్న వారు కారు లేదా బస్సును నడపడం ఎంత మాత్రం సరికాదని రవాణా రంగ నిపుణులు చెబుతున్నారు. ఈ విషయంలో రెండు రాష్ట్రాల విభాగాలు ఇకనైనా దృష్టి

**డి. మురళీధర్ అమర్‌నాథ్**

దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు ఏయేటికాయేడు పెరిగిపోతున్నాయి. జాతీయ రహదారులతో పాటు రాష్ట్రస్థాయి రహదారులు, ఆఖరుకు మారుమూల ప్రాంతాలలోని రోడ్లు సైతం రక్తం రుచి మరిగి రోజులేదంటే అతిశయోక్తి కాదు. గడచిన కొన్నేళ్లలో దేశంలోని అనేక ప్రాంతాలలో రహదారులు భారీగా అభివృద్ధి చెందడం ఒక ఎత్తయితే అదే సమయంలో ప్రమాదాలు సైతం అంతే స్థాయిలో పెరగడం గమనార్హం. రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదాలు 70 శాతం వరకు ఉంటే రహదారుల నిర్మాణంలో ఇంజనీరింగ్ లోపం, ఇతరత్రా కారణాలు మరో 30శాతం వరకు ఉన్నాయని, వీటిని సరిచేస్తే ప్రమాదాల నివారణ సాధ్యమని నిపుణులు పదేపదే చెబుతున్నా ఆ దిశగా సర్కారు విభాగాలు పటిష్టమైన చర్యలుతీసుకోకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. రోడ్డు ప్రమాదాలు అంటే రెండు వాహనాలు ఢీ కొనడమో, లేదా కొందరు మరణించడం లేదా ఇంకొందరు గాయపడడం కాదు. కొన్ని కుటుంబాలు వీధిన పడడం అనే విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా బీద, మధ్య తరగతి ప్రజలు రోడ్డు ప్రమాదాల బారిన పడిన సమయంలో అనేక కుటుంబాలు కోలుకునేందుకు చాలాకాలం పడుతుందనేది కూడా విదితమే. దేశవ్యాప్తంగా ఏటా లక్షా 83వేల మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తుండగా ఐదు లక్షల మందికి పైగా క్షతగాత్రులు అవుతున్నారు. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి 15 వేలమంది వరకు మృత్యువాత పడుతున్నారు. తెలంగాణ నుంచి ఏడు వేలకు పైగా మృత్యువాత పడుతున్నారు. రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదంతోపాటు రోడ్ ఇంజనీరింగ్ లోపాలు, ప్రమాదకర మలుపులు, రోడ్లపై గోతులు ఉండడం వంటి కారణాలు ప్రధానంగా చెప్పాలి. ఇక వీటి నివారణలో ప్రభుత్వవిభాగాలు కృషి చేయకపోవడం వాహనదారుల పాలిటశాపంగామారింది. తెలంగాణలోని చేవెళ్లలో ఏడాదిన్నర క్రితం ఓ ఆర్టీసీబస్సును కంకర లోడుతో వెళుతున్న టిప్పర్ ఢీకొన్న ఘటనలో 18 మంది ప్రయాణీకులు మరణించడం తెలిసిందే. తాజాగా సూర్యాపేట జిల్లాలో రోడ్డుపై ఆగివున్న లారీని ప్రైవేటు బస్సు ఢీకొనగా ఆరుగురు మరణించారు. మూడేళ్ల క్రితం కర్నూలు జిల్లా వెల్దుర్తి వద్ద హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న ప్రైవేటు బస్సు అతివేగంతో వెళుతూ ఒక వాహనదారుడిని తప్పించబోయి డివైడర్‌ను దాటి మరో మార్గంలో వెళుతున్న తుఫాన్ వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో తుఫాన్ వాహనంలోని 15 మంది, రోడ్డు పక్కన ఆగివున్న మరో ప్రయాణీకుడు మొత్తం 16 మంది మరణించారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా వుండే వెల్దుర్థి జంక్షన్ వద్ద బస్సు డ్రైవర్ 120 కిలోమీటర్ల వేగంతో బస్సును నడపడం ప్రమాద



తీవ్రతను పెంచింది. అంతకు ముందు తెలంగాణలోని ప్రజ్ఞాపూర్ వద్ద ఆర్టీసీ డ్రైవర్, లారీ డ్రైవర్‌ల నిర్లక్ష్యం కారణంగా 13మంది బలయ్యారు. ఈ రెండు వాహనాలు అతి సమీపం నుంచి మితిమీరిన వేగంగా వెళ్లడం, ఎదురుగా వాహనాలు వస్తున్న విషయాన్ని కూడా గమనించలేకపోవడం వల్ల ఏక కాలంలో నాలుగు వాహనాలు ఒకదానితో మరొకటి ఢీకొనడంతో మొత్తం 13మంది దుర్మరణం చెందారు. ఈ ప్రమాదాలకు కారణమైన ఆర్టీసీ, లారీ డ్రైవర్లు సురక్షితంగా బయట పడడం విశేషం. ఈ ఘటనకు ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం ఎక్కువగా వుండడంతో అతనిపై పోలీసులు కేసు కూడా నమోదుచేశారు. దీని తరువాత కొండగట్టు వద్ద ఆర్టీసీ బస్సు ప్రయాణీకులతో క్రిక్కిరిసి పోయి ఘాట్ రోడ్డులో వెళుతూ ఒక్కసారిగా లోయలో బోల్తా పడడంతో 65మంది మరణించడం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. తెలుగు రాష్ట్రాల ఆర్టీసీ చరిత్రలో ఇంత మంది ఒక ప్రమాదంలో మరణించడం ఇదే తొలిసారిగా చెప్పాలి. ఒక్క తెలుగురాష్ట్రాలే కాదు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో రోడ్డు ప్రమా దాల తీవ్రత ఎక్కువగా వుంది. ఇందు లో తమిళనాడు రాష్ట్రంమొదటి స్థానంలో వుంది. గతఏడాది దేశ వ్యాప్తంగా ఐదు లక్షల 13వేల 474ప్రమాదాలు సంభవించగా లక్షా 83వేల 434మంది మరణించారు. సగటున రోజుకు 502 మంది రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారు. దేశంలో గంటకు 59ప్రమాదాలు సంభవిస్తుండగా 21మంది చనిపోతున్నారు. ప్రమాదాలలో మరణిస్తున్నవారిలో ద్విచక్ర వాహనదారులు 46.2 శాతం, పాదచారులు 20.60 శాతం వుంది. ఈఏడాది జూలై నెలాఖరు వరకు రెండులక్షల 96 వేల 447 ప్రమాదాలు సంభవించగా లక్షా 1139 మంది చనిపోయారు.

**వాహనదారులు పాటించాల్సిన నియమాలు ఏమిటంటే**

అనారోగ్యంతో వున్నవారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు వాహనాలను నడపరాదు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు డ్రైవింగ్‌ను వృత్తిగా తీసుకుంటే వైద్యుల సూచనలతో మందులు వాడుతూ నిబంధనల మేరకుసుదూర ప్రయాణాలు కాకుండా స్వల్ప దూరం మేరకు వాహనాలను నడపవచ్చు. వాహనాలను రోడ్డుపై తీసుకువచ్చే సమయంలో వాటి కండీషన్ సరిగ్గా వుందో? లేదో? చూసుకోవాలి. ఒకవేళ కండీషన్ బాగా లేకున్నా, వాహనం పాతది అయినా, టైర్లు సరిగ్గా లేకుంటే వాహనాలు రోడ్డుపైకి తేరాదు. ఒకవేళ రహదారులపై వాహనం పాడై ఆగిపోతే వాటిని వెంటనే రోడ్డుపై కాకుండా ఇతర వాహనాలకు ఇబ్బంది లేకుండా పక్కననిలిపి, దీనిపై వెంటనే పోలీసులకు సమాచారం అందించి వీలైనంత త్వరలో ఆ వాహనాన్ని మరమ్మతులకు పంపాలి. వాహనం నడిపే సమయంలో కారు అయితే డ్రైవర్‌తో పాటు పక్కన వున్న వ్యక్తి సీటు బెల్టు, ది ్వచక్ర వాహనం అయితే వాహనదారుడితో పాటు వెనకాలవున్న వ్యక్తి కూడా హెల్మెట్ తప్పకుండా ధరించాలి. సుదూర ప్రయాణించే సమయంలో వాహనదారులు ప్రతి రెండు గంటలకు ఒకసారి ఆగి పావు గంట పాటు విశ్రాంతి తీసుకోవాలి. ఇదే సమయంలో వాహనం కండీషన్ చూడాలి. వీలైతే ఇద్దరు డ్రైవర్లు వుండేలా చూసుకోవాలి. ద్విచక్ర వాహనంపై సుదూర ప్రయాణం మంచిదికాదు. వాహనం నడిపే సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించకూడదు. భోజనం కానీ టిఫిన్‌కానీ పరిమితంగా భుజించాలి. ఒకవేళ అంతకు ముందు పరిమితంగా మద్యం సేవించి వుంటే కనీసం ఎనిమిది నుంచి పది గంటల పాటు విశ్రాంతి తీసుకోవాలి. అతిగా మద్యం సేవించి వుంటే 24 గంటల నుంచి 36గంటలపాటు డ్రైవింగ్‌కు దూరంగావుండాలి. వాహనం నడిపే వారు పూర్తిగా డ్రైవింగ్ పైనే దృష్టి సారించాలి. డ్రైవింగ్ చేస్తూ పాటలు వినడం, ఇతర అంశాలపై దృష్టిసారించడం వంటివి చేయకూడదు. వాహనదారులు ఎడమవైపునుంచే ఓవర్ టేక్ చేయాలి. ఓవర్ టేక్ చేసే సమయంలో ముందువున్న వాహన డ్రైవర్‌నుంచి సిగ్నల్ అందుకున్న తరువాతే ముందుకు కదలాలి. అడ్డదిడ్డంగా ఓవర్ టేక్ చేయకూడదు. వాహనాలు నడిపే డ్రైవర్ నిద్రవస్తుందని అనిపిస్తే వెంటనే వాహనాన్ని పెట్రోల్ సురక్షితమైన చోట ఆపి కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాక మళ్లీ డ్రైవింగ్ చేయాలి. జాతీయ,రాష్ట్ర స్థాయి రహదారులపై నడిపే వాహనాలను ఆయా వాహనాల కండీషన్‌ను బట్టి 80 కిలోమీటర్ల నుంచి 120 కిలోమీటర్ల వేగం వరకు నడపవచ్చు. అయితే మన రహదారులపై వంద కిలోమీటర్ల వేగంతో మాత్రమే ప్రయాణించేందుకు అనుమతి వుంది. ఒకవేళ రోడ్లపై వాహనాలు లేకున్నా ఇంతకు మించి వేగంతో వెళితే అనుకోని ఘటనలు ఎదురైతే వాహనంపై నియంత్రణ తప్పి ప్రమాదంలో పడే అవకాశం వుంది. రాత్రి వేళల్లో, తెల్లవారు జామున ప్రయాణాలు సాగించిన సమయంలో డ్రైవర్లు మరింత జాగ్రత్తగా వుండాలి. తెల్లవారు జామున వాహనాలు నడిపే సమయంలో కళ్లు రెప్పవాల్చి అనుకోకుండా కునుకువచ్చే అవకాశాలు ఎక్కువగా వుంటాయి. సరిగ్గా ఇదే సమయంలోనే క్షణ కాలంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతుంటాయి. రాత్రి వేళల్లో డ్రైవింగ్ చేస్తే ప్రతి గంట ఓసారి వాహనాన్ని ఆపి ముఖాన్ని నీటితో శుభ్రం చేసుకోని టీతాగాలి. వర్షాకాలంలో వాన పడిన సమయంలో తక్కువ వేగంతో వెళ్లాలి. వాహనాలలో పరిమితికి మించి ప్రయాణీకులు వుండరాదు. దీంతో పాటు గ్యాస్ సిలిండర్లు, పేలుడు పదార్థాలు తరలించే సమయంలో పూర్తి జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ●

# ఆరని మంటలు!

మణిపూర్

మణిపూర్ లో మంటలు ఇంకా ఇంకా ఎగసి పడుతున్నాయి. యేడాదిపాటు సాగిన రాష్ట్రపతి పాలన తర్వాత కూడా రాష్ట్రంలో పరిస్థితులు చక్కబడకపోవడం, తర్వాత ఏర్పడిన ప్రభుత్వం నిర్దిష్టమైన పరిష్కారప్రణాళిక రూపొందించకపోవడంతో ఈ మంటలు ఇప్పట్లో చల్లారుతాయా? అనే సందేహం కలుగుతోంది. గత ఫిబ్రవరి 4న రాష్ట్రపతి పాలన ఎత్తివేసి ఖేమ్ చంద్ సింగ్ నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేశారు. అంతకు ముందు ఉన్న బీరేన్ సింగ్ ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణలో పూర్తిగా విఫలం కావడంతో మణిపూర్ సంక్షోభం దేశంలో అందరి దృష్టిని ఆకర్షించింది. రాష్ట్రపతి పాలన తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పాటైనా అశాంతి అంతా పాతదే కొనసాగడంతో ఇప్పుడు మళ్లీ సంక్షోభం తలెత్తింది. మరో యేడాదిలో ఎన్నికలు జరగవలసి ఉన్నా, తెగల మధ్య రాజీ కుదిర్చే ప్రయత్నాలు జరగకపోవడం బిజెపి ప్రభుత్వ వైఫల్యమనే చెప్పాలి. ప్రధానంగా ఉన్న మెయితీ, కుకీ జో సమస్యకు నాగాల సమస్య తోడవడంతో ఇప్పుడది మరింతగా ముదిరిపోతోంది. ముఖ్యమంత్రి ఖేమ్‌చంద్ మెయితీ వర్గానికి చెందినవారు కాగా, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు కుకీ, నాగా వర్గాలకు చెందినవారు. నాగాలు, కుకీలు బయట ఎన్ని ఘర్షణలకు పాల్పడుతున్నారో అదే దృశ్యం అసెంబ్లీలో కూడా కనిపించడమే విచారకరం. మెజారిటీ మెయితీలు మైనారిటీలైన కుకీ, నాగాలతో తలపడడం రానురాను రావణకాష్టంలా మారుతోంది. గత మంగళవారం జరిగిన దారుణ సంఘటన చాలు ప్రస్తుతం మణిపూర్ కుంపటి ఎలా రగులుతున్నదో చెప్పడానికి. మూడు నాగా గ్రామాలపై కుకీలు పెద్ద ఎత్తున దాడులు జరిపి నానా బీభత్సం సృష్టించారు. కొన్నిడజన్ల ఇళ్లనుబూడిద చేశారు. ఆ ఘటనల్లో నలుగురు మరణించడంతో పాటు పెద్దసంఖ్యలో నాగాలు నిరాశ్రయులయ్యారు. మరోవంక మెయితీలతో కూడా కుకీల ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇద్దరు కుకీ జో ఎమ్మెల్యేలు గత బుధవారం అసెంబ్లీలోకి ప్రవేశించి కలకలం సృష్టించారు. మెయితీల ఆధిక్యత ఉన్న అసెంబ్లీలోకి ప్రవేశించవద్దంటూ కుకీల అత్యున్నత సంస్థ అయిన

**ఎ.వి.వి ప్రసాద్**

'కుకీ ఇన్పీ మణిపూర్' గతంలోనే ఆదేశాలిచ్చింది. అయితే వాటిని ధిక్కరిస్తూ కుకీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లారు. కుకీ పీపుల్స్ అలయెన్స్ కు చెందిన ఎమ్మెల్యే కిమ్నో హాకిప్ హ్యాంగ్ సింగ్ , మరో ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అసెంబ్లీలో కూర్చున్నారు. కుకీ జోల కోసం ప్రత్యేక పాలనా యంత్రాంగం ఏర్పాటుచేసే దాకా తమ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాబోరని కుకీ ఇన్పీ ప్రకటించింది



ఖేమ్ చంద్

కానీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే తాము అసెంబ్లీకి వచ్చామని వారు అంటున్నారు. కుకీ జో వర్గానికి ప్రస్తుతం తొమ్మిది మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అసెంబ్లీలోని మొత్తం 60 మంది సభ్యుల్లో దాదాపు 40 మంది మెయితీ వర్గానికి చెందినవారు కాగా, కుకీ, నాగాలకు చెందిన వారు తొమ్మిది మంది చొప్పున ఉన్నారు. నాగాలకు చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కొద్దిరోజుల క్రితం కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఓ లేఖ రాస్తూ, కుకీ నేషనల్ ఫ్రంట్ నాయకులపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, వారివల్ల నాగాలు తీవ్ర హింసలకు గురవుతున్నారనీ తెలిపారు. గత మే నెలలో పలువురు నాగాలు కిడ్నాప్‌కు గురి కావడం, తర్వాత వారి మృత దేహాలను కనుగొనడం అందరికీ దిగ్భ్రాంతిని కలిగించింది. కేంద్రానికి నాగాలు రాసిన లేఖ బయటకు పొక్కడంతో కుకీలు మరింతగా రెచ్చిపోయి హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారు. మెయితీల ఆధిక్యత ఉన్న అసెంబ్లీలో అడుగు పెట్టవద్దని కుకీ ఇన్పీ నేతలు జారీ చేసిన ఆదేశాలను ఇద్దరు ఎమ్మెల్యేలు ధిక్కరించడంతో వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకొంటారని తెలుస్తోంది. అదే జరిగితే ఘర్షణలు మరింత అధికమయ్యే అవకాశం ఉంది. గత ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఎంత నిర్లిప్తంగా ఉండేవారో, ఇప్పుడు ఖేమ్ చంద్ కూడా అదే బాటలో నడుస్తున్నారు. ఆయన మెయితీ వర్గానికి చెందినవారు కావడం వల్లనే కుకీల సమస్య పట్టించుకోవడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. మెజారిటీ వర్గమైన మెయితీలు ఎస్టీ హోదా డిమాండ్ చేస్తూ చాలా కాలం నుంచే ఆందోళనలు జరుపుతున్నారు. దానిని వ్యతిరేకిస్తున్న కుకీలు ఘర్షణలకు పాల్పడుతున్నారు. ఈహింసా కాండలో గత మూడేళ్లలోను 250 మంది చనిపోగా, 60 వేల మంది పైగా నిరాశ్రయులయ్యారు. ఈ ఘర్షణలు దారికి రాకపోవడంతో గత సంవత్సరం రాష్ట్రపతి పాలన విధించారు కానీ తర్వాత కూడా అదే పరిస్థితి కొనసాగింది. ఆ తర్వాత మళ్లీ ప్రభుత్వం ఏర్పాటైనా సమస్యకు పరిష్కారం లభించనే లేదు. మెయితీలకు ఎస్టీ హోదా ఇస్తే గిరిజనుల ఆధిక్యం ఉన్న కొండ ప్రాంతాలపై వారికి కూడా హక్కు ఏర్పడుతుంది. ప్రస్తుతం కొండప్రాంతాల్లోని గిరిజన భూములకు కొన్ని ప్రత్యేక రక్షణలున్నాయి. మణిపూర్‌లో దాదాపు 10 శాతం ప్రాంతం ఇంఫాల్ లోయ, మిగిలిన అధిక భాగం కొండ ప్రాంతాలు. మెయితీలు ప్రధానంగా లోయ,మైదాన ప్రాంతాల్లోను, కుకీలు, నాగాలు కొండప్రాంతాల్లోను నివశిస్తున్నారు. అయితే కొండ ప్రాంతాలపై మెయితీల కన్ను పడడం వల్లనే సంక్షోభం మొదలయింది. ఈ ప్రధాన సమస్యను కేంద్రం సాధ్యమైనంత త్వరగా పరిష్కరించవలసి ఉంది. ముఖ్యమంత్రిని మారిస్తే సమస్య పరిష్కారం కాదనే విషయం అర్థమైంది గనుక బిజెపి అధిష్ఠానం ఇప్పటికైనా సరైన వ్యూహం రూపొందించడం అవసరం. మణిపూర్ ను మరోసారి విభజించే అవసరం తలెత్తకుండా సమస్యను పరిష్కరించాలి. మయన్మార్ నుంచి రాష్ట్రంలోకి పెరుగుతున్న అక్రమ వలసలు నిరోధించే దిశగా చర్యలు తీసుకోవాలి. మణిపూర్ గ్రామాలు కాలడాన్ని మిగిలిన దేశం చోద్యం చూస్తూ ఉంటే ఎలా? ఎన్నికలు వచ్చే లోగా పరిష్కారం లభిస్తుందా! చూడాలి. ●


# లీకుల కలకలం!

అమెరికా

మధ్యప్రాచ్యంపై కాలుదువ్విన అమెరికా అధ్యక్షుడికి ఏడు నెలలుగా అక్కడ చేస్తున్న యుద్ధం కొలిక్కిరాకపోవడం, ఆయుధనిల్వలు తరిగిపోతున్నాయన్న ఆందోళన, పైగా రక్షణరంగానికి సంబంధించిన కీలక సమాచారం లీకు అవుతుండటం వంటివి ట్రంప్‌నకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయనే చెప్పాలి. యుద్ధతంత్రంలో ఎక్కడో లోపం జరిగిందని భావిస్తున్నట్లు వస్తున్న లీకులపైదృష్టి పెట్టిన ట్రంప్ ముందు పెంటగాన్ రక్షణ వ్యవస్థను ప్రక్షాళన మొదలుపెట్టారు. పనిలోపనిగా లీకులపైనే ఫోకస్ పెంచారు. అమెరికా సైన్యంలో కీలకంగా ఉన్న జాయింట్ స్టాఫ్‌లోని అనుమానాలున్న వ్యక్తులు అధికారులకు పాలిగ్రాఫ్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. అనుకోవడమే తరువాయి జాయింట్ స్టాఫ్‌లో పనిచేస్తున్న సుమారు 50 మంది సిబ్బందికి పాలిగ్రాఫ్ పరీక్షలు నిర్వహించారు. జర్నలిస్టులకు రహస్య, వర్గీకృత సమాచారాన్ని లీక్ చేశారనే అనుమానాలపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా ఈ పరీక్షలు నిర్వహించారు. ఆగస్టులో ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలుస్తోంది. సైనిక అధికారులు లేదా పౌర సిబ్బంది వర్గీకృత సమాచారాన్ని మీడియా ప్రతినిధులకు అందించారా అనే విషయాన్ని తెలుసుకునేందుకు దర్యాప్తు అధికారులు ఈ పరీక్షలు నిర్వహించినట్లు సమాచారం. ఇరాన్‌తో జరిగిన యుద్ధం అనంతరం అమెరికా కీలక ఆయుధాల నిల్వల్లో కొరత ఏర్పడిందంటూ వెలువడిన మీడియా కథనాలపై కూడా దర్యాప్తు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా దీర్ఘశ్రేణి క్షిపణులు, పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్ల సరఫరాపై ఆందోళనలు వ్యక్తమైన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా సిబ్బందిని జర్నలిస్టులకు వర్గీకృత సమాచారాన్ని వెల్లడించారా అనిప్రశ్నలు సంధించారు. అలాగే అమెరికా ఆయుధ నిల్వల్లో తగ్గుదలపై వివరాలను ఎవరితోనైనా పంచుకున్నారా అనే అంశంపైనా ప్రశ్నలువేసినట్లు సమాచారం. ఇరాన్‌తో జరిగిన ఘర్షణ సమయంలో అమెరికా ఆయుధ నిల్వలపై ఒత్తిడి పెరిగిందని పలు మీడియా కథనాలు వెలువడ్డాయి. ముఖ్యమైన ఆయుధ వ్యవస్థల లభ్యత, యుద్ధం కారణంగా అమెరికా మందుగుండు సామగ్రి నిల్వలపై పడిన ప్రభావంపై ఈ నివేదికలు ప్రశ్నలు

**గన్ని మోహన్**

లేవనెత్తాయి. అందరికీ తెలిసినట్లుగానేసెంట్‌కామ్ కూడా పలుపర్యాయాలు అమెరికా సెనేట్, ప్రతినిధుల సభలకు యుద్ధ నివేదికలు అందచేస్తూ ఆయుధ నిల్వల సమాచారం కూడా అందచేసింది. ఎంతో వ్యయంతో తయారుచేసినక్షిపణులను ఇరాన్ కారుచౌక క్షిపణులతోనే కూల్చి వేస్తున్న వైనంపైనా చట్టసభల్లో ప్రత్యేక నివేదికలు కూడా ఇచ్చింది. అవన్నీ కూడా మీడియా పతాకశీర్షికలకు ఎక్కిన సంగతి తెలిసిందే.



ట్రంప్


వీటన్నింటినీ కట్టడిచేయడం కోసమే అన్నట్లుగా ఇప్పుడు నేరస్తులు, కరుడుగట్టిన సిబ్బందికి నిర్వహించే పాలిగ్రాఫ్ పరీక్షలు రక్షణ రంగ సిబ్బందికి కూడా నిర్వహించారు. జాయింట్ స్టాఫ్‌లోసుమారు 1,500 నుంచి 2,000 మంది అధికారులు, సిబ్బంది ఉంటారు, పాలిగ్రాఫ్ పరీక్షలకు హాజరైన 50మంది మొత్తం సిబ్బందిలో ఒక చిన్న భాగమే. రక్షణరంగ సమాచారం లీక్ కావడంపై తీవ్రంగా పరిగణిస్తున్న పెంటగాన్ ఈ ప్రక్రియ మొత్తం రహస్యంగానే నిర్వహించినా చివరకు లీక్ అవక తప్పలేదు. వర్గీకృత జాతీయ భద్రతా సమాచారానికి సంబంధించిన ఏదైనా లీక్‌ను అమెరికా రక్షణశాఖ తీవ్రంగా పరిగణిస్తుందని, అమెరికా జాతీయ భద్రతతోపాటు ప్రపంచ వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న అమెరికా సైనికుల భద్రతకు వర్గీకృత సమాచారాన్నిరక్షించడం అత్యంత కీలకమని పెంటగాన్ ప్రతినిధి సీన్ పార్నెల్ సమర్థించుకోవడం చూస్తుంటే సిబ్బంది అధికారులకు పరీక్షలు నిర్వహించినట్లు చెప్పకనే చెప్పినట్లయింది. పాలిగ్రాఫ్ పరీక్షలకు గురైన50 మంది సిబ్బందిలో ఎవరైనా వాస్తవంగా రహస్య సమాచారాన్ని లీక్ చేశారా అన్నది దర్యాప్తు నిర్ధారించలేదు. కానీ ఈ లీకుల వ్యవహారంతో ఒక్కసారిగా పెంటగాన్ రక్షణ వ్యవస్థ మొత్తం వార్తల్లోకి ఎక్కింది. నిజానికి ఇరాన్‌కు ఆయుధ పరంగా చైనా, ఇంటెలిజెన్స్ పరంగా రష్యా సహకరిస్తున్నాయని ముందు నుంచి అనుమానాలు తొలిచేస్తున్నాయి. ఒకటిరెండు సార్లు బహిరంగంగానే తన అక్కసుకూడా వెళ్లగక్కారు. చైనాతో పటిష్టబంధం పేరిట ఆదేశంలో పర్యటించి మరీ వచ్చిన ట్రంప్ చైనా నుంచి ఆశించిన మేర ఫలితం రాబట్టలేకపోయారు. అదేవిధంగా ఆంక్షలు కూడా లెక్కకుమించిన స్థాయిలో విధించారు. ఇరాన్‌కు సహకరించే ఏదేశం అయినా సరే తమ ఆంక్షలకు గురికావాల్సిందేనని తెగేసి చెప్పారు. అనుకున్నట్లుగానే తన ఖజానా నింపుకోడానికో, లేక శత్రు, మిత్రదేశాలపై తన పట్టును కొనసాగించుకోడానికో అన్నట్లు మొత్తం సుంకాలు ఎడాపెడా వేసారు. కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా వాటికి ప్రత్యామ్నాయాలు ఆలోచించి మరీ ముందుకు సాగారు. ఈక్రమంలో ముందు సొంత ఇంటిని చక్కదిద్దుకోవాలని భావించారో ఏమో కానీ పెంటగాన్ ప్రక్షాళన కూడాచేపట్టారు. వెనువెంటనే పలువురిపేర్లను కూడా పరిశీలించారు. వీరిలో మార్క్ ఆండర్సన్,సీన్ పార్నెల్‌లపేర్లు ఇపుడు పరిశీలనలో ఉన్నాయి. రక్షణమంత్రి పీట్‌హెగ్సెత్‌తో విభేదాలు పొడసూపిన తర్వాత అప్పటివరకూ ఉన్న డాన్ డ్రిస్కాల్ రాజీనామా చేయడంతో ఆస్థానం అత్యవసరంగా భర్తీచేయాల్సి ఉంది. తాత్కాలికంగా ఆ బాధ్యతలు ఆడమ్ టెల్లె నిర్వహిస్తున్నా శాశ్వత ప్రాతిపదికన నియామకాలు జరగాలి. ఇప్పటికే జాయింట్ స్టాఫ్ చీఫ్ రాండి జార్జి వైదొలిగారు. వారితోపాటు స్టీవ్‌ఫీన్ బెర్గ్‌నుకూడా హెగ్సెత్, ట్రంప్ కూడా పరిశీలిస్తున్నారని రక్షణరంగంలో విస్తృతప్రచారానికి నాంది పలికింది. ఈక్రమంలోనే ముందు లీకులు అరికట్టేందుకు మొత్తం వ్యవస్థనే ప్రక్షాళన చేసేదిశగా ట్రంప్ అడుగులు వేస్తున్నారనిచెప్పవచ్చు. న్యాయస్థానాల బ్రేకులు,కొనసాగుతున్న సుదీర్ఘయుద్ధం, కొలిక్కిరాని శాంతి యత్నాలు వంటివి ట్రంప్‌లో అసహనం పెంచుతున్నాయనడానికి ఆయన వైఖరే ప్రత్యక్ష నిదర్శనంగా కనిపిస్తోంది. ●

# బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు ఎలా?



**పాపని నాగరాజు**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ పునరుద్ధరణ మరోసారి రాజకీయ చర్చకువచ్చింది. ప్రభుత్వం గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్‌కు నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వెనుక న్యాయపరమైన చరిత్ర, కమిషన్ల పాత్ర ఇప్పటికే బహిరంగ చర్చలో ఉన్నాయి. కానీ ఇంకా చర్చకు రాని దాచిపెట్టిన మరో ప్రశ్న ఏమంటే, 34 శాతానికి జనాభా ప్రాతిపదిక ఏమిటి? బీసీల వాస్తవ సంఖ్య తెలియకుండానే ఈ శాతం ఎలా ఖరారైంది? ప్రభుత్వం ఇదే సమయంలో ఓటర్ల జాబితా ఆధారంగా బీసీ జనాభాను గుర్తించే ప్రక్రియను చేపట్టిందే తప్ప, ఆ ప్రక్రియ పూర్తయ్యేలోగానే శాతాన్ని ప్రకటించింది. లెక్కలు వాటాను నిర్ణయించాలా, లేక వాటా ముందే నిర్ణయించి లెక్కలు తరువాత సర్దుబాటు చేయాలా అన్నదే ఇక్కడ అసలు ప్రశ్న. 2019లో ఇదే 34 శాతం రిజర్వేషన్ న్యాయస్థానంలో నిలబడలేదు అన్నది తెలిసిన విషయమే. ఆ అనుభవం ఒక్కటే చాలు, రిజర్వేషన్‌శాతాన్ని కేవలం రాజకీయ ప్రకటనగా కాకుండా, గణాంక ఆధారంతో నిలబెట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేయడానికి. అయితే ఈసారి కొత్తగా చూడాల్సింది ఆ చట్టపరమైన చరిత్ర కాదు, ప్రస్తుతం జరుగుతున్న గణాంక ప్రక్రియే. ఆగస్టు 18నుంచి ప్రభుత్వం ఓటర్ల జాబితా ఆధారంగా పంచాయతీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభాను గుర్తించే ప్రక్రియను ప్రారంభించింది. సెప్టెంబర్ 7లోగా దీన్ని పూర్తి చేయనున్నట్లు ప్రకటించింది. అంటే బీసీల స్థానిక జనాభా వివరాలను ప్రభుత్వం ఇంకా సేకరిస్తున్న సమయంలోనే 34 శాతం ఇప్పటికే ఖరారైంది. లెక్కలు వాటా నిర్ణయానికి ఆధారం అయితే ముందుగా లెక్కలు రావాలి, ఆ తరువాతే శాతం ఖరారు కావాలి. కానీ ఇక్కడ ముందే శాతం నిర్ణయించి, తరువాత జనాభాను గుర్తిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. రేపు ఈ లెక్కల్లో బీసీల జనాభా 34 శాతానికి భిన్నంగా తేలితే, ఇప్పటికే ఖరారైన శాతానికి సమర్థన ఏమిటన్నది ప్రభుత్వం చెప్పాల్సి ఉంటుంది. లెక్కలు తీయడం తప్పు కాదు, కానీ లెక్కలు పూర్తి కాకముందే నిర్ణయం ఎందుకు అన్నదే ప్రశ్న. అయితే ఈ స్థానిక జనాభా గుర్తింపు ప్రక్రియను దేశవ్యాప్త సమగ్ర కులగణనగా భావించకూడదు. ఓటర్ల జాబితా ఆధారంగా స్థానిక సంస్థల పరి ధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభాను గుర్తించడం ఎన్నికల రిజర్వేషన్‌కు ఉపయోగపడే పరిపాలనా సమాచారం కావచ్చు. కానీ దేశంలోని బీసీల వాస్తవ జనాభా ఎంత, కులాల వారీగా వారి సామాజిక స్థితి ఏమిటి, విద్య, ఉపాధి, ఆర్థిక వనరులు, భూమి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాల్లో వారి పరిస్థితి ఏమిటి అన్నది తెలుసుకోవాలంటే సమగ్ర కుల గణన అవసరం. రాష్ట్రంస్థానిక సంస్థల కోసం సేకరించే ఈ లెక్కలు కేంద్ర స్థాయిలోని దేశవ్యాప్త జనాభా గణనకు ప్రత్యామ్నాయం కావు. ఈ రెండు ప్రక్రియల మధ్య తేడాను స్పష్టంగా గుర్తించడమే ఇక్కడ అవసరం. మండల్ కమిషన్ 1980లో సమర్పించిన నివేదికలో ఓబీసీ జనాభాను సుమారు 52శాతంగా అంచనా వేసిన చారిత్రక విషయం ఈ చర్చకు ఒక నేపథ్యం మాత్రమే. ఇది ప్రస్తుత జనాభా గణాంకం కాదు, రిజర్వేషన్ కోటా కూడా కాదు. దశాబ్దాలనాటి అంచనా మాత్రమే. అయినా ఒక ముఖ్యమైన ప్రశ్నకు ఇది నేపథ్యాన్ని ఇస్తుంది. దశాబ్దాలుగా బీసీల జనాభా గురించి చర్చిస్తున్న దేశం, నేటి వాస్తవ జనాభాను ఎందుకు స్పష్టంగా లెక్కించకూడదు? ప్రస్తుత రిజర్వేషన్ నిర్ణయాలు పాత అంచనాలపై కాకుండా తాజా, విశ్వసనీయ గణాంకాలపై ఆధారపడాలి. అందుకే కుల గణన కేవలం ప్రధాన బీసీ కులాల సంఖ్యను తెలుసుకునే ప్రక్రియ మాత్రమే కాదు, ఉపకులాలు, అర్ధ సంచార, సంచార జాతులు వంటి ఇప్పటికీ గుర్తింపు, గణాంక ప్రాతినిధ్యం లేని అట్టడుగు వర్గాలను కూడా వెలుగులోకి తెచ్చే ప్రక్రియ. అదే రాబోయే విధానాలకు శాస్త్రీయ పునాది కాగ



లదు. నిజంగా బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం కేవలం స్థానిక ఎన్నికల కోసం తాత్కాలిక లెక్కలతో సరిపెట్టుకోకుండా, కేంద్ర జనాభా గణనలోనే కులాలు, ఉపకులాల వారీగా జనాభా వివరాలను నమోదు చేసే స్థిరమైన వ్యవస్థ కోసం కేంద్రంపై రాజకీయ ఒత్తిడి ఎందుకు తేవడం లేదు? బీసీలు ఒకే సామాజిక యూనిట్ కాదు. అనేక కులాలు, ఉపకులాలు, వృత్తులు, ప్రాంతాలు, ఆర్థిక స్థాయిలతో కూడిన సమూహం. మొత్తం బీసీలు ఎంతమంది అన్నది తెలిసినా, వారిలో ఎవరు అత్యంత వెనకబడి ఉన్నారో తెలియకపోతే విధాన రూపకల్పన అసంపూర్ణంగానే ఉంటుంది. ఇక్కడ ఒక మరో ముఖ్యమైన అంశం ఉంది. ఓటర్ల జాబితా ఆధారంగా జనాభాను గుర్తించే పద్ధతికే ఒక పరిమితిఉంది. ఓటర్ల జాబితాలో నమోదైన కులం వివరాలు ఎంత కచ్చితమైనవి, ఎంత మంది తమ కులాన్ని సరిగ్గా నమోదు చేసుకున్నారు, వలస కార్మికులు, తాత్కాలికంగా వేరే ప్రాంతాల్లో ఉంటున్నవారు ఈ లెక్కల్లోకి వస్తారా అన్న ప్రశ్నలు వెంటనే వస్తాయి. ఓటర్ల జాబితా ప్రధానంగా ఎన్నికల నిర్వహణ కోసం రూపొందించినది, అది జనాభాను శాస్త్రీయంగా, సమగ్రంగా వర్గీకరించే సాధనం కాదు. అటువంటి జాబితా ఆధారంగా వచ్చే గణాంకాలను రిజర్వేషన్ నిర్ణయానికి తుది ప్రాతిపదికగా చూపిస్తే, ఆ గణాంకాల విశ్వసనీయతపైనేన్యాయ స్థానంలో ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉంటుంది. కచ్చితమైన సామాజిక న్యాయం, న్యాయమైన వనరుల పంపిణీ కోసం ఓటర్ల జాబితా కాదు, స్వతంత్రమైన, శాస్త్రీయమైన కులగణనే విశ్వసనీయమైన ఆధారం కాగలదు. ఇక్కడ బీసీఉద్యమం కూడా తన పాత్రను పునరాలోచించుకోవాలి. ప్రభుత్వాలు ఇచ్చే ప్రతి శాతాన్ని స్వాగతించడమే ఉద్యమం కాదు. పాలకపక్షాలకు అనుకూలంగా ఉన్న కొన్ని సంఘాలు 34 శాతాన్ని సమర్థించవచ్చు. కానీ వాటి స్పందనను మొత్తం బీసీ సమాజం అభిప్రాయంగా చూపించడం సరి కాదు. నిజమైన బీసీ సంఘం 'ఈ శాతానికి జనాభా ఆధారం ఏమిటి, లెక్కలు పూర్తికాకముందే శాతం ఎందుకు, కేంద్ర జనాభా గణనలో కులాల కాలమ్ ఎందుకు ఉండకూడదు' అని అడగాలి. ఇంకా ఒక ముఖ్యమైన విషయం. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం వచ్చినా అది ఇతర రంగాలకు విస్తరించకపోతే సామాజిక న్యాయం పూర్తికాదు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యత, ఉన్నత విద్యలో ప్రవేశం, ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం వంటి అంశాలు బలోపేతం కావాలి. సంప్రదాయ వృత్తులపై ఆధారపడిన బిసి కుటుంబాలు ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ఎక్కడ నిలుస్తున్నాయో, సూక్ష్మ పరిశ్రమలకు మూలధనం, మార్కెట్ ఎవరికెంత అందుతోందో, గ్రామీణ సమాజంలో భూమి యాజమాన్యం ఎలా ఉందో కూడా ఈ రాజకీయ అజెండాలో భాగం కావాలి. విద్యలో వాటా, ఉద్యోగంలో వాటా, ఆర్థిక వనరుల్లో వాటా, పరిశ్రమల్లో వాటా, భూమిలో వాటా, రాజకీయ నిర్ణయాధికారంలో వాటా. ఇవన్నీ పరస్పరం అనుసంధానమైన అంశాలు. ఎన్నికల్లో ఒక సీటు దక్కడం వల్ల సమాజంలోని వనరుల పంపిణీ మారదు, నిర్ణయాధికారంలో స్థిరమైన భాగస్వామ్యం ఏర్పడినప్పుడే మార్పు సాధ్యమవుతుంది. లెక్కలు పూర్తికాకముందే నిర్ణయం ఎలా తీసుకున్నారో వివరించాలి. స్థానిక సర్వేను సమగ్ర కులగణనగా చిత్రించకూడదు. కేంద్ర జనాభా గణనలో కులాల కాలమ్ కోసం రాజకీయంగా పోరాడాలి. స్థానిక యూనిట్ విధానాన్ని పారదర్శకంగా ప్రకటించాలి. బీసీలకు కావాల్సింది మరో ఎన్నికల హామీ కాదు. హామీని చట్టబద్ధమైన హక్కుగా మార్చే రాజకీయ సంకల్పం. ప్రభుత్వం ఇచ్చే శాతం కాదు, గణాంకం నిర్ధారించే వాటా కావాలి. కాగితంపై రిజర్వేషన్ కాదు, వాస్తవ రాజకీయ ప్రాతినిధ్యం కావాలి. 34 శాతం ఈ ప్రయాణంలో ఒక అడుగు కావచ్చు. కానీ అది ముగింపు కాదు. బీసీలకు నిజమైన న్యాయం జరిగిందని చెప్పాలంటే, వారి జనాభా ఎంత అన్నది నమ్మదగిన లెక్కల్లో కనిపించాలి, ఆ జనాభా మేరకు వారి వాటా విధానాల్లో ప్రతిబింబించాలి, ఆ వాటా రాజకీయ అధికారంగా మారాలి. ●

6-9Pg5:6-9Pg5.qxd 9/5/2026 11:43 PM Page 1



### ప్రపంచంలోని స్ఫూర్తిదాయక నేతల్లో

# ప్రధాని మోడీయే టాప్

### బెల్జియం ప్రధాని ప్రశంసలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** ప్రపంచ రాజకీయాల్లో తీవ్ర అస్థిరత, భౌగోళిక ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత తరుణంలో భారత ప్రధాని మోదీ అనుసరిస్తున్న దౌత్య విధానాలు, నాయకత్వ పటిమపై బెల్జియం ప్రధాని బార్ట్ డె వెవర్ ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలోని అత్యంత స్ఫూర్తిదాయకమైన, తెలివైన నేతల్లో మోదీ అగ్రగామి అని అభివర్ణించిన ఆయన మోదీతో భేటీ కావడం తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోని పలువురు అగ్రనేతల ప్రసంగాలు విన్నప్పుడు ఆందోళన, అభద్రతా భావం కలుగుతాయని కానీ ప్రధాని మోదీమాటల్లోని ఆయన చెప్పిన దార్శనికతను అనుసరించాలనే నమ్మకం, స్ఫూర్తి కలుగుతాయని వ్యాఖ్యానించారు. విశ్వవేదికపై భారత్ పాత్ర అత్యంత కీలకంగా మారిందని కొనియాడిన బెల్జియం ప్రధాని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారతను బెల్జియం ఒక విశ్వసనీయ భాగస్వామిగా చూస్తోందని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇదే సమయంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలు, టారిఫ్‌లపై ఆయన పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఏ క్షణాన ఏ విధానాలను తీసుకుంటారో తెలియని అస్థిరత వల్ల ప్రపంచ వాణిజ్యమే ప్రమాదంలో పడుతుందని స్వేచ్ఛా వాణిజ్యం, బలమైన ద్వైపాక్షిక భాగస్వామ్యాల ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

## గూఢచర్యం కేసులో 15మందిపై ఎన్ఐఏ ఛార్జిషీట్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** పాకిస్తాన్‌కు గూఢచర్యం చేసిన కేసులో 15 మంది నిందితులపై ఎన్ఐఏ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) శనివారం చార్జిషీటు దాఖలు చేసింది. ఈ కేసులో ప్రవీణ్, రాజ్ వాల్మీకి, శివ వాల్మీకి, రితిక గ్యాంగ్‌వార్, సమీర్ మాలిక్, దుర్గేష్ నిషాద్, నౌషద్, గగన్ కుమార్, వివేక్, శివరాజ్, మీరా ఠాకూర్, షేన్ ఇరామ్ మహక్ అనే 15 మందిని నిందితులుగా పేర్కొంది. వీరిపై ఉత్తర ప్రదేశ్, లక్నోలోని స్పెషల్ కోర్టులో తాజా చార్జిషీటు సమర్పించింది. ఐదుగురు జువైనల్ నిందితులు సంబంధించిన నివేదికను గత మే 18న, జువైనల్ జస్టిస్ బోర్డుకు సమర్పించారు. ఈ ఐదుగురు మైనర్లు కావడం వల్ల వీరికి విధించే శిక్షలు వంటి అంశాల్లో ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఘజియాబాద్ కమిషనరేట్ పరిధిలోని, కౌశంబి పోలీస్ స్టేషన్‌లో నిందితులపై గత మార్చి 14న ఎఫ్ఐఆర్ నమోదైంది. దీనిలో భాగంగా 21 మందిని అరెస్టు చేశారు. భారత దేశ సమగ్రతకు, సార్వభౌమాధికారానికి భంగం కలిగించేలా నిందితులు కుట్ర చేశారని ఎన్ఐఏ ఆరోపించింది. పాకిస్తాన్ కోసం గూఢచర్యం చేస్తూ నిందితులు దేశానికి చెందిన కీలక, సున్నితమైన సమాచారాన్ని చేరవేశారని ఆరోపించింది. నిషేధిత ప్రదేశాలకు చెందిన జీపీఎస్ లోకేషన్లను కూడా వీరు శత్రువులకు అందించారు. ఇలాంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు భారతీయ సిమ్ కార్డులను వినియోగించారు. దేశ ఐక్యత, సమగ్రత, భద్రతకు భంగం కలిగించే పని చేశారు. మిగతా నిందితులపై కూడా విచారణ కొనసాగుతోంది. వారిపై నిపుణుల అభిప్రాయం తీసుకున్న అనంతరం తదుపరి విచారణ జరిపి, పూర్తిస్థాయి చార్జిషీటు దాఖలు చేస్తారు. మరో ఘటనలో పాకిస్తాన్‌కు గూఢచర్యం చేస్తున్న ఏడుగురిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు.

# ఆఫ్రికా పెద్దది.. గ్రీన్‌లాండ్ చిన్నది!

### త్వరలో కొత్త ప్రపంచ పటం విడుదల



**న్యూయార్క్, సెప్టెంబరు 5:** కొత్త ప్రపంచ పటం కోసం యుఎన్ అసెంబ్లీలో తీర్మానం చేశారు. అయితే ఆ కొత్త మ్యాప్‌లో ఆఫ్రికా ఖండం సైజు పెరగనుంది. మెర్కేటర్ మ్యాప్‌లో వాస్తవానికన్నా ఎక్కువ సైజులో కొన్ని ఖండాలు, దేశాలు ఉన్నాయి. ఈక్వేటార్‌కు దూరంగా ఉన్న గ్రీన్‌ల్యాండ్.. మెర్కేటర్ మ్యాప్‌లో ఆఫ్రికా కన్నా పెద్దగా ఉన్నట్లు కనిపిస్తుంది. కానీ నిజానికి గ్రీన్‌ల్యాండ్ కన్నా ఆఫ్రికా 14 రెట్లు పెద్దది. ఇక కొత్త వరల్డ్ మ్యాప్‌తో ఆ సైజులో స్పష్టత రానుంది. ఉత్తర యూరోప్, ఉత్తర అమెరికాను కూడా పాత మ్యాప్‌లో ఈక్వేటర్ దగ్గర ఉన్న దేశాల కన్నా ఎక్కువ పెద్ద సైజులో చూపించారు. అయితే కొత్త మ్యాప్‌తో ఆ సైజుల్లో మార్పులు జరగనున్నాయి. మ్యాప్ తమకు సమస్య కాదు అని, కానీ ప్రపంచం మమ్మల్ని మ్యాప్‌ల ఆధారంగా అర్థం చేసుకుంటుందని టోగో విదేశాంగ మంత్రి రాబర్ట్ దుస్సే తెలిపారు. మ్యాప్‌ల ద్వారా ఆఫ్రికా సైజు మారదు అని, కానీ ఆఫ్రికా ఖండం గురించి ప్రజల ఆలోచన మారుతుందని కొందరంటున్నారు. మ్యాప్ మార్పు తీర్మానాన్ని ఆఫ్రికా యూనియన్ స్వాగతించింది.

2018లో ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్ చేశారు. మెర్కేటర్ మ్యాప్‌లా కాకుండా.. వాస్తవ సైజుకు దగ్గరగా ఖండాల భూభాగాన్ని ఆ మ్యాప్‌లో చూపించాలనుకున్నారు. ఇక ఆఫ్రికా ఎంత పెద్ద సైజులో ఉందో.. ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్ ప్రకారం అంతే సైజులో కనిపించనున్నది. మెర్కేటర్ మ్యాప్‌లో పెద్దగా ఉన్న గ్రీన్‌ల్యాండ్ ఇప్పుడు కొత్త మ్యాప్‌తో తన సైజును కోల్పోనుంది. అయితే ఈ అంశాన్ని అమెరికా వివాదంగా మార్చింది. తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేసిన.. ఇది సైద్ధాంతిక చర్య అని విమర్శలు చేసింది. మెర్కేటర్ మ్యాప్ బదులుగా కొత్త మ్యాప్‌లను ప్రోత్సహించనున్నట్లు ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీన్ నోయల్ బారట్ తెలిపారు. ఇక వివాదాస్పద భూభాగాల అంశంలో మరో ఆందోళన మొదలైంది. ఈక్వెల్ ఎర్త్ మ్యాప్ ప్రకారం ఉక్రెయిన్‌లోని భూభాగాన్ని రష్యా ఆక్రమించినట్లుగా ఉంది. దీంతో ఆ మ్యాప్ విధానాన్ని ఉక్రెయిన్ వ్యతిరేకించింది. ఓటింగ్‌లో ఉక్రెయిన్ పాల్గొనలేదు. తీర్మానానికి యురోపియన్ యూనియన్ మద్దతు ఇచ్చింది. మ్యాప్‌లు మారినా బోర్డర్‌లు మారవని ఇయు పేర్కొన్నది. పర్ఫెక్ట్ మ్యాప్ ఏదీ లేదన్న అభిప్రాయం కూడా వెల్లడైంది. భూమి గుండ్రంగా ఉన్నా.. మ్యాప్‌లు మాత్రం ఫ్లాట్‌గా ఉన్నాయన్నారు. విస్తీర్ణం, ఆకారం, దూరం, డైరెక్షన్ అంశంలో మ్యాప్‌లో మార్పులు ఉండనున్నాయి. కేవలం భూమి సైజుతో పోలుస్తూ.. ఈక్వెల్ ఏరియా మ్యాప్‌లను ప్రోత్సహించాలని యుఎన్ భావిస్తున్నది. ఈ ప్రతిపాదనకు భారత్ కూడా మద్దతు తెలిపింది.

### లోన్‌రికవరీ కోసం మహిళ దుస్తులు విప్పించి విడియో చిత్రీకరణ

**పోలీసులు రంగ ప్రవేశంచేసి నలుగురి అరెస్టు**

**బెంగళూరు, సెప్టెంబరు 5:** బెంగళూరులో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేదన్న కారణంతో ఓ మహిళను కొందరు కిడ్నాప్ చేసి, రోజుల తరబడి నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారు. బలవంతంగా ఆమె దుస్తులు విప్పించి వీడియో తీసి, డబ్బు ఇవ్వకపోతే దాన్ని వైరల్ చేస్తామని బెదిరించారు. ఈ అమానుష ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. బెంగళూరు సుంకడకట్టే ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల మహిళ రెండేళ్ల క్రితం రేష్మా బాను వద్ద రూ. లక్ష, నజ్రత్ బేగం వద్ద రూ.50 వేలు వడ్డీకి అప్పుగా తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల కొన్ని నెలలుగా వాయిదాలు చెల్లించలేకపోయారు. దీంతో ఆగస్టు 27న పని ఇప్పిస్తానని చెప్పి నజ్రత్ ఆమెను తన ఇంటికి పిలిచింది. అక్కడికి వెళ్లగానే, రేష్మా, ఆమె భర్త సుహైల్, సైఫ్‌లు ఆమెపై దాడి చేసి, కత్తితో బెదిరించి కుంబల్‌గోడులోని రేష్మా ఇంటికి తీసుకెళ్లి కిడ్నాప్ చేశారు. అక్కడ ఆమెను నాలుగు రోజుల పాటు బంధించి, కర్రలతో కొట్టారు. అసలు, వడ్డీ కలిపి రూ.11 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతనెల ఆమెను బలవంతంగా అర్ధనగ్నంగా మార్చి వీడియో తీశారు. డబ్బు చెల్లించకపోతే వీడియోను సోషల్ మీడియాలో పెడతామని, వేశ్యా వృత్తిలోకి దించుతామని బెదిరించారన్నారు.



# అమెరికా ఉద్యోగం ఆశలు ఆవిరి!

## హెచ్1బి వీసా ఫీజులు ఇక రెండులక్షల డాలర్లు పైనే!

**వాషింగ్టన్,సెప్టెంబరు 5:** అమెరికాలో ఉద్యోగం చేయాలలనుకునే వారు ఇక ఆశలు వదిలేసుకోవాల్సిందే. విదేశీయులు ఉద్యోగం పేరుతో అమెరికాలో అడుగుపెట్టే ధైర్యం చేయకుండా డొనాల్డ్ ట్రంప్ కఠిన నియమాలు తీసుకువస్తున్నారు. ఇప్పటిదాకా లక్ష డాలర్ల ఫీజుతో బెంబేలెత్తించిన ట్రంప్ దాన్ని ఏకంగా రెండు లక్షల డాలర్లకు పెంచే ప్రయత్నం చేస్తున్నాడు.

దీంతో అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే వారికి బిగ్ షాక్ తగలబోతోంది. విదేశాల నుండి కొత్తగా హెచ్1బి ఉద్యోగులను దేశంలోకి తీసుకురావడానికి అయ్యే ఖర్చును ఊహించని రీతిలో పెంచేందుకు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రచురించిన ఫెడరల్ రిజిస్టర్ ప్రకటన ప్రకారం అమెరికా వెలుపల నుండి వచ్చే ప్రతీ కొత్త హెచ్1బి దరఖాస్తుదారుపై అదనంగా 103,265 డాలర్లు అంటే సుమారు రూ. 86 లక్షలు రుసుమును విధిస్తూ ప్రతిపాదనలు చేసింది. గతంలో ప్రభుత్వం సవాలు చేసిన 100,000 డాలర్ల రుసుము గనక న్యాయస్థానంలో నిలబడితే విదేశాల నుండి ఒక కొత్త హెచ్1బి ఉద్యోగిని స్పాన్సర్ చేయడానికి అమెరికన్ కంపెనీలు చెల్లించాల్సిన మొత్తం రుసుము 203,265 డాలర్లు అంటే రూ. 1.70 కోట్లు దాటే అవకాశం ఉందని యూఎస్ఏ టుడే నివేదిక స్పష్టం చేసింది. హెచ్1బి ప్రోగ్రామ్‌ను మరింత ఖరీదైనదిగా, పరిమితులతో కూడినదిగా మార్చేందుకు అమెరికా ప్రభుత్వం చేపడుతున్న విస్తృత వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయం వెలువడింది.

ఈ భారం కేవలం సాంకేతిక దిగ్గజాలపైనే కాకుండా విదేశీ నిపుణులపై ఆధారపడే విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, ఆరోగ్య సంరక్షణ రంగాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. గతంలో విధించిన 100,000 డాలర్ల రుసుమును మసాచుసెట్స్ ఫెడరల్ కోర్టు కొట్టివేయగా దానిపై ప్రభుత్వం అప్పీల్ చేసింది. ప్రస్తుతం ఆ విచారణ కొనసాగుతుండగానే, అమెరికా వలస వ్యవస్థ నిర్వహణకు అవసరమైన నిధులను సమకూర్చుకోవడానికి ఈ కొత్త 103,265 డాలర్ల ఛార్జీని తెరపైకి తెచ్చినట్లు డిహెచ్ఎస్ పేర్కొంది. రాబోయే దశాబ్ద కాలంలో ఈ రుసుముల ద్వారా సుమారు 8.8 బిలియన్ డాలర్ల రాబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రతి ఏటా కేటాయించే 85,000 వీసాల కోసం తీవ్రమైన పోటీ నెలకొంటున్న తరుణంలో, అమెజాన్, యాపిల్, గూగుల్, మెటా వంటి బహుళజాతి సంస్థలు మరియు గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించే ఆసుపత్రులు ఈ ప్రతిపాదనల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కఠిన ప్రతిపాదనల వల్ల భారతీయ ఐటీ నిపుణులకు భారీగా ప్రతికూల పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రతి సంవత్సరం ఆమోదం పొందుతున్న మొత్తం హెచ్1బి వీసాలలో 70 శాతానికి పైగా భారతీయ పౌరులకే లభిస్తున్నాయి. విదేశాల నుండి నేరుగా అమెరికా వెళ్లి పనిచేయాలనుకునే భారతీయ టెక్ ఉద్యోగులకు 200,000 డాలర్లకు పైగా ఫీజు కావడం వల్ల అనేక కంపెనీలు స్పాన్సర్‌షిప్‌లను తగ్గించుకునే ప్రమాదం ఉంది.

ఈ కొత్త రుసుము కేవలం దేశం వెలుపల నుండి వచ్చే కొత్త దరఖాస్తుదారులకే వర్తిస్తుందని, ఇప్పటికే అమెరికా విశ్వవిద్యాలయాల్లో చదివి ఉద్యోగాల్లో చేరే విద్యార్థులకు, అలాగే దేశంలోనే ఉన్న వీసాదారులకు వేర్వేరు నిబంధనలు ఉంటాయని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనపై సెప్టెంబర్ 24 వరకు ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ కొనసాగుతుండగా, తుది నిర్ణయం వెలువడితే అమెరికా వలస విధానంలో ఇది ఒక చారిత్రాత్మక మార్పుగా నిలవనుంది.



### నేపాల్ సొరంగంలో సజీవంగా చైనీస్ దేశస్థుడు

### శిథిలాల కింద ప్రాణాలతో మహిళ

**ఖాట్మండ్, సెప్టెంబరు 5:** నేపాల్‌లో వరదల్లో చిక్కుకున్న మరో ఇద్దరిని శనివారం రక్షించారు. త్రిశూలీ సొరంగం నుంచి ఓ చైనీస్ దేశస్థుడిని కాపాడారు. వరదలు సంభవించిన పది రోజుల తర్వా ఆ చైనా దేశస్థుడు టన్నెల్‌లో సజీవంగా ఉన్నాడు. చికిత్స కోసం అతడిని కాఠ్మాండుకు తరలించినట్లు నేపాలీ ఆర్మీ ప్రకటించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న జల విద్యుత్ టెన్నెల్‌లో చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు భారీ ఆపరేషన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. సుమారు 900 మంది కార్మికులు వివిధ టన్నెళ్లలో ఉంటారని భావిస్తున్నారు. ఆగస్టు 26న సంభవించిన నేపాల్ జల విలయంలో సుమారు 1300 మంది ప్రాణాల కోల్పోయారు. మరో 5 వేల మంది మిస్సింగ్ అయ్యారు. భారత, నేపాలీ బృందాలు రెస్క్యూ ఆపరేషన్ చేపడుతున్నాయి. శుక్రవారం 9వ రోజు ఇద్దరు నేపాలీ దేశస్థులను త్రిశూలీ టన్నెల్ నుంచి సజీవంగా రక్షించిన విషయం తెలిసిందే. సువాకోట్ పట్టణంలో పూర్తిగా దెబ్బతిన్న ఓ ఇంటి నుంచి ఓ మహిళను కూడా నేపాల్ ఆర్మీ రక్షించింది. 64 యేళ్ల చండికా శ్రేష్ఠ అనే మహిళ ఆ ఇంట్లో ఉన్నట్లు గుర్తించారు. బేత్రావతిలో ఇంటి శిథిలాల కింద నుంచి ఆమెను సురక్షితంగా బయటకు తీశారు.

## ఖర్గ్ ఐలాండ్ సమీపంలో ఇరాన్ ట్యాంకర్‌పై దాడి

**టెహ్రాన్, సెప్టెంబరు 5:** ఖర్గ్ ఐలాండ్ సమీపంలో అమెరికా దళాలు ఇరాన్‌కు చెందిన ఒక ఆయిల్ ట్యాంకర్‌ను లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. స్థానికంగా పలు పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు స్థానిక ఫార్స్ న్యూస్ ఏజెన్సీ తెలిపినప్పటికీ, పేలుళ్లకు గల స్పష్టమైన కారణాలను వెల్లడించలేదు, అటు, ఈ దాడులను ఇరాన్ అధికార వర్గాలు ఇంకా అధికారికంగా ధ్రువీకరించలేదు. మూడోసారి లక్ష్యంగా ఖర్గ్ ఐలాండ్‌పై దాడిజరిగింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికాఇరాన్ మధ్య యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఖర్గ్ ఐలాండ్‌పై దాడి జరగడం ఇది మూడోసారి. మొదటి దాడి మార్చిలో ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేసి గ్లోబల్ ఆయిల్ సరఫరాకు ఆటంకం కలిగించడంతో, అమెరికా ఖర్గ్ ఐలాండ్‌లోని మిలిటరీ స్థావరాలను ధ్వంసం చేసింది. అయితే అప్పట్లో ఆయిల్ మౌలిక సదుపాయాలపై దాడి చేయలేదు. రెండో దాడి ఏప్రిల్ 7న జరిగింది. ఇరాన్ వైఖరి మారకపోవడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికల అనంతరం మరోసారి ఇరాన్ సైనిక స్థావరాలపై వైమానిక దాడులు జరిగాయి. ఇప్పుడు తాజాగా ఖర్గ్ ద్వీపం సమీపంలోని ఆయిల్ ట్యాంకర్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులు జరగడం వల్ల ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇరాన్ తీరానికి దాదాపు 33 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ఐలాండ్, ఆ దేశానికి అతిపెద్ద చమురు ఎగుమతి కేంద్రం. ఇరాన్ ఎగుమతి చేసే క్రూడ్ ఆయిల్‌లో అత్యధిక శాతం ఈ ద్వీపం ద్వారానే సరఫరా అవుతుంది. చైనా వంటి దేశాలకు ఇక్కడి నుంచే ప్రధానంగా ఆయిల్ రవాణా జరుగుతుంది. ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు, ప్రభుత్వ ఆదాయానికి ఈ ఐలాండ్ వెన్నెముక లాంటిది. చమురు నిల్వ కేంద్రాలు, రిఫైనరీలు మాత్రమే కాకుండా, ఈ ద్వీపంలో వేలాది మంది కార్మికుల నివాసాలు, చారిత్రక పోర్చుగీస్ కోట, పురాతన క్రైస్తవ మఠం వంటి చారిత్రక ప్రాధాన్యం ఉన్న ప్రదేశాలు కూడా ఉన్నాయి.

## బస్తర్ మావోయిస్టు దాడిలో ఎన్ఐఎ కోర్టు తీర్పు

### పది మంది దోషులుగా నిర్ధారణ, 16న శిక్షలు ఖరారు

**జగ్‌దల్‌పూర్, సెప్టెంబరు 5:** ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో 2013లో కాంగ్రెస్ నాయకుల కాన్వాయ్‌పై జరిగిన ఘోర మావోయిస్టు దాడి కేసులో జగదల్‌పూర్ ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ దాడిలో ముగ్గురు మహిళలతో సహా మొత్తం 10 మందిని దోషులుగా కోర్టు నిర్ధారించింది. ప్రత్యేక న్యాయమూర్తి అభయ్ సింగ్ రాజ్‌పుత్ ఈ తీర్పును వెల్లడించగా, దోషులకు విధించే శిక్షల వివరాలను ఈనెల 16న ప్రకటించనున్నారు. ఛత్తీస్‌గఢ్ చరిత్రలోనే దారుణమైన దాడిగా ప్రాసిక్యూషన్ వర్ణించింది. 2013లో మే 25న బస్తర్ జిల్లా దర్భా పోలీస్ స్టేషన్ పరిధిలోని జీరమ్ లోయ వద్ద జాతీయ రహదారిపై ఈ ఘాతుకం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన పరివర్తన్ ర్యాలీముగించుకుని తిరిగి వస్తుండగా మావోయిస్టులు కాన్వాయ్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో మొత్తం 29 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిలో నాటి ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నంద్ కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్, అసెంబ్లీ మాజీ ప్రతిపక్ష నేత మహేంద్రకర్మ, మాజీ కేంద్ర మంత్రి విద్యాచరణ్ శుక్లా, మాజీ ఎమ్మెల్యే ఉదయ్ ముద్లియార్ వంటి అగ్రనేతలతో పాటు పలువురు భద్రతా సిబ్బంది, పౌరులు అమరులయ్యారు. ఈ ఘటనతో అప్పట్లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం తీవ్రంగా దెబ్బతింది. ప్రారంభంలో బస్తర్ పోలీసులు ఈ కేసును నమోదు చేసినప్పటికీ, ఘటన తీవ్రత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం విచారణను జాతీయ దర్యాప్తు సంస్థకి అప్పగించింది. ఎన్ఐఏ 2014 సెప్టెంబర్‌లో జగదల్‌పూర్ ప్రత్యేక కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసి, ఈ కేసులో 101 మంది సాక్షులను విచారించింది. కేసు సమగ్ర విచారణకు రెండు జుడీషియల్ కమిషన్లు కూడా ఏర్పాటయ్యాయి. ఈ తీర్పుపై రాష్ట్రంలో రాజకీయ వేడి రాజుకుంది. ఎన్ఐఏ అనేక వాస్తవాలను తప్పుదోవ పట్టించిందని, రాష్ట్ర ప్రభుత్వం స్వతంత్రంగా విచారణ జరపకుండా అడ్డుకుందని మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బాఘేల్ ఆరోపించారు. నాటి బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులకు సరైన భద్రత కల్పించడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. ఈ ఆరోపణలను మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత రమణ్ సింగ్ ఖండించారు. కాంగ్రెస్ నాయకులు ఈ సున్నితమైన అంశంపై కేవలం రాజకీయం చేయడానికే ప్రాధాన్యం ఇచ్చారని ఆయన తిప్పికొట్టారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు: 8 మంది యువకులు మృతి



**తిరువనంతపురం, సెప్టెంబరు 5:** కేరళలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. త్రిస్సూర్ జిల్లాలో ఆగి ఉన్న లారీని ఓ కారు వేగంగా ఢీకొట్టిన ఘటనలో 8 మంది యువకులు దుర్మరణం పాలయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. మృతులను తమిళనాడుకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులుగా అనుమానిస్తున్నారు. శుక్రవారం రాత్రి 11:40 గంటల సమయంలో త్రిస్సూర్ జిల్లాలోని కైపమంగలం సమీపంలోని పనంబిక్కున్న వద్ద జాతీయ రహదారి 66పై ఈ ప్రమాదం జరిగింది. తమిళనాడు రిజిస్ట్రేషన్ టిఎన్ 59 డిడబ్ల్యు 8299 ఉన్న కారులో 8 మంది యువకులు గురువాయూర్ నుంచి కొడుంగల్లూర్ వైపు ప్రయాణిస్తున్నారు. అదే సమయంలో, నిర్మాణ పనులు జరుగుతున్న హైవేపై రోడ్డు పక్కన ఆగి ఉన్న గూడ్స్ లారీని వెనుక నుంచి కారు బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయి లారీ కిందకు చొచ్చుకుపోయింది. దీంతో కారులోని వారంతా అందులోనే చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## బ్రిటన్‌లో చదివే విదేశీ విద్యార్థులకు ఫండ్ పరిమితి పెంపు

### కఠిన నిబంధనలు అమలుచేస్తున్న బ్రిటన్ సర్కార్

**లండన్, సెప్టెంబరు 5:** ఉన్నత చదువులు చదవాలని ఆశిస్తున్న భారతీయ విద్యార్థులకు బ్రిటన్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. యూకే వీసా నిబంధనలను మరింత కఠినతరం చేసింది. అక్కడ చదువుకునేందుకు వెళ్లే అంతర్జాతీయ విద్యార్థులు ఇకపై తమ నివాస ఖర్చుల కోసం చూపించాల్సిన కనీస మెయింటెనెన్స్ ఫండ్ పరిమితిని భారీగా పెంచింది. ఈ ఏడాది నవంబర్ 30 నుంచి దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ఈ నూతన నిబంధనలు వర్తిస్తాయి. యూకే హోమ్ శాఖ విడుదల చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులు చదువుకునే ప్రాంతాన్ని బట్టి వారు చూపించాల్సిన ఫండ్ పరిమితి మారుతుంటుంది. లండన్‌లో నివసిస్తూ చదువుకునే విద్యార్థులు ప్రతి నెలా చూపించాల్సిన ఫండ్ మొత్తం 1,529 అంటే.. సుమారు రూ. 1.95 లక్షల నుంచి 1,570 పౌండ్ లకుఅంటే సుమారు రూ. 2.01 లక్షలకు పెంచారు. ఈ తాజా పెంపు వల్ల విద్యార్థులు తమ నిధులను ముందుగానే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. లండన్ వెలుపల గల యూనివర్శిటీల్లో ప్రవేశాలు పొందే విద్యార్థుల జీవన వసతి ఖర్చుల నిబంధన కూడా పెరిగింది. ప్రస్తుతం ఉన్న నెలవారీ పరిమితి 1,171 నుంచి 1,203 యూరోలకు పెరిగింది. భారతీయ కరెన్సీలో ఈ మొత్తం రూ. 1.54 లక్షలు అవుతుంది. విద్యార్థులు గరిష్టంగా తొమ్మిది నెలల కాలానికి సరిపడా మెయింటెనెన్స్ ఫండ్స్ నిల్వలను దరఖాస్తు సమయంలో పొందుపర్చాల్సి ఉంటుంది. దీని ప్రకారం లండన్ పరిధిలో చదువుకునే వారు గరిష్టంగా రూ. 18.06 లక్షలు అంటే 14,130 పౌండ్లు, ఇతర ప్రాంతాలలో విద్యనభ్యసించే వారు దాదాపు రూ. 13.84 లక్షలు 10,827 పౌండ్లను మెయింటెనెన్స్ ఫండ్స్ చూపించాలి. ఈ మొత్తం మెయింటెన్స్ ఫండ్స్ కోసం మాత్రమే. కాలేజీ ట్యూషన్ ఫీజు దీనికి అదనం. బ్రిటన్ ప్రభుత్వం స్థానిక విద్యార్థులకు అందించే వార్షిక మెయింటెన్స్ లోన్లకు అనుగుణంగానే అంతర్జాతీయ విద్యార్థుల ఆర్థిక పరిమితులను కూడా సమం చేయాలని నిర్ణయించడమే దీనికి ప్రధాన కారణం. దీంతో పాటు వీసాలో జరిగే దుర్వినియోగాన్ని అరికట్టడం, అర్హత గల విద్యార్థులకు మాత్రమే వాటిని మంజూరు చేయడానికి ఈ కఠిన నిబంధనలను తీసుకువచ్చినట్లు హోమ్ ఆఫీస్ స్పష్టం చేసింది. భారతీయ విద్యార్థులు ఈ ఫండ్ మొత్తాన్ని యూకే ప్రభుత్వానికి ఎలాంటి ఫీజుల రూపంలో చెల్లించనక్కర్లేదు. వీసా ఆమోదం కోసం తమ బ్యాంక్ ఖాతాలలో ఈ




నిధుల లభ్యతను చూపించితే సరిపోతుంది. ఈ ఏడాది నవంబర్ 30 తర్వాత వీసా దరఖాస్తులు సమర్పించే వారంతా పాత నియమాలను కాకుండా ఈ నూతన రేట్లను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే వారి వీసా రిజెక్ట్ అవుతుందని హోమ్ శాఖ తెలిపింది. జనవరి ఇన్‌టేక్‌లో లండన్ లేదా బ్రిటన్ లోని ఇతర నగరాల్లో విద్యాభ్యాసం చేయాలనుకునే అభ్యర్థులు తప్పనిసరిగా ఈ కొత్త మార్పులను గమనించాలి. బ్రిటిష్ వీసా పొందడానికి వీసా కార్యాలయానికి సమర్పించే బ్యాంక్ ఖాతాలలో మునుపటి కంటే చాలా ఎక్కువ నిల్వ నిధులను చూపించాల్సి ఉంటుంది. విద్యార్థులు అక్కడికి వెళ్లిన తర్వాత వారి స్థానిక నివాసం, ఆహారం, ఇతర అత్యవసర ఖర్చులకు లోటు లేకుండా ఉండేందుకే ఈ మార్పులు చేసినట్లు బ్రిటన్ హోమ్ శాఖ స్పష్టం చేసింది.

# సంక్షిప్త వార్తలు

### 280 ఎన్నికల్లో పోటీచేసిన నాగర్‌మల్ బజారియా మృతి



**పాట్నా, సెప్టెంబరు 5:** భారత ఎన్నికల చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్న ధర్తి పకడ్ నాగర్‌మల్ బాజోరియా (96) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, పాట్నాలోని మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. వందల సార్లు ఎన్నికల బరిలో నిలిచి, ఒక్కసారి కూడా గెలవకపోయినా ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనడమే ముఖ్యమని చాటిచెప్పిన ఆయన మృతితో ఒక శకం ముగిసింది.

### కోర్టు ఉత్తర్వులతో సహారాన్‌పూర్ కలెక్టరేట్ మసీదు కూల్చివేత

**సహారాన్‌పూర్, సెప్టెంబరు 5:** ఉత్తర ప్రదేశ్‌లోని సహరన్‌పూర్‌లో ఒక మసీదును అధికారులు కూల్చివేశారు. భారీ భద్రత నడుమ శనివారం ఈ కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. సహరన్‌పూర్‌ని కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఒక మసీదు చాలా కాలంగా ఉంది. అయితే, ఆ మసీదు ఉన్న స్థలం ప్రభుత్వ భూమి. ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా ఈ మసీదు కొనసాగుతోంది. దీంతో ఈ మసీదును తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### అమెరికాలో మోస్ట్ వాంటెడ్.. పంజాబ్‌లో అరెస్ట్

**అమృత్‌సర్, సెప్టెంబరు 5:** అమెరికాలో భారీ మోసానికి పాల్పడి, ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) 'మోస్ట్ వాంటెడ్' జాబితాలో ఉన్న భారత సంతతి వ్యక్తిని పంజాబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సుమారు దాదాపు రూ. 5.7 కోట్లు మోసం కేసులో నిందితుడైన మంజీత్ సింగ్ బేడీ (65)ని జలంధర్‌లో శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అమెరికా పౌరసత్వం పొందిన బేడీ, వాషింగ్టన్ రాష్ట్రంలోని టకోమాలో కిరాణా దుకాణం నడిపేవాడు. అక్కడ ప్రభుత్వం పేదలకు అందించే సప్లిమెంటల్ న్యూట్రిషన్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ (ఎస్ఎన్ఏపీ) ప్రయోజనాలను దుర్వినియోగం చేశాడు.

### సౌదీ అరేబియాకు ఐదు బిలియన్ డాలర్ల అమెరికా ఆయుధ సామగ్రి

**దుబాయి, సెప్టెంబరు 5:** ఇరాన్‌తో ఉద్రిక్తతలు, ప్రాంతీయ పోరాటాలు పరాకాష్టకు చేరిన తరుణంలో, గల్ఫ్ మిత్రదేశమైన సౌదీ అరేబియాకు 5 బిలియన్ డాలర్ల విలువైన అత్యాధునిక బాంబులు, గైడెన్స్ కిట్లు, రక్షణ పరికరాలను విక్రయించేందుకు అమెరికా విదేశాంగ శాఖ ఆమోదం తెలిపింది. పశ్చిమాసియా ప్రాంతంలో ఇరాన్ దళాలు, యెమెన్‌లోని హూతీ రెబెల్స్ నుంచి నిరంతరం ఎదురవుతున్న క్షిపణి, డ్రోన్ దాడులను తిప్పికొట్టేలా సౌదీ అరేబియా వైమానిక రక్షణ సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వాషింగ్టన్ ప్రకటించింది.



### లడఖ్‌లో తొలిసారిగా రాక్ చెక్‌డామ్



**లేహ్, సెప్టెంబరు 5:** లడఖ్‌లో నీటి కొరతతో ఇబ్బంది పడుతున్న రైతులకు భారత్ ఊరటనిచ్చింది. సింధు నదిపై దేశంలోనే తొలి రాక్ చెక్ డ్యామ్‌ను నిర్మించింది. లేహ్‌లోని ఉప్షి వద్ద నిర్మించిన ఈ డ్యామ్ వల్ల నదిలో నీటి మట్టం దాదాపు 10 అడుగులు పెరిగింది. వసంతకాలంలో సాగుకు నీరు అందక ఇబ్బంది పడుతున్న గ్రామాల పొలాలకు నీటిని మళ్లించే అవకాశం ఏర్పడింది. ఈ డ్యామ్‌ను సిమెంట్ ఉపయోగించకుండా పూర్తిగా సహజమైన పెద్ద రాళ్లతో నిర్మించారు. ఇందులో దాదాపు 4 కోట్ల లీటర్ల నీటిని నిల్వ చేయవచ్చు. ఈ నీటిని ఇగూ ఫే సాగునీటి కాలువ ద్వారా పొలాలకు అందిస్తున్నారు.



గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు పట్టు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

## గురువులను గౌరవించడం అదృష్టం


### ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

**కళ్యాణదుర్గం, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** గురువులను గౌరవించడం తమ తల్లి దండ్రుల నుంచే వచ్చిన సంస్కారమని, వేలాది మంది ఉపాధ్యాయులు కుటుంబాలను గౌరవించే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ప్రజావేదికలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 2650 మంది ఉపాధ్యాయ దంపతులకు పట్టువస్త్రాలు, శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, అక్టోబర్ 1 నుంచి రెండు డీఏలు, 12వ పీఆర్సీ ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. ప్రస్తుతం 37.31 శాతం ఉన్న డీఏ రాబోయే రెండు డీఏలతో 40.04 శాతానికి చేరుతుందని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు అస్పైర్ ట్రస్ట్ సహకారంతో రూ.5 కోట్లతో 7300 సైకిళ్లను అందిస్తున్నామని తెలిపారు. అలాగే 1200 మంది విద్యార్థులకు ఉచిత కోచింగ్, మెటీరియల్, భోజన వసతి కల్పించినట్లు వెల్లడించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా గురు పూజోత్సవం

### పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యే లక్ష్యం: మంత్రి నారాయణ

### అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎంపి వేమిరెడ్డి



**నెల్లూరు, సెప్టెంబరు 5, ప్రభాతవార్త - వైద్యం:** పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యే లక్ష్యమని మంత్రి నారాయణ పేర్కొన్నారు. శనివారం నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీఎన్ఆర్, ఆర్ఎస్ఆర్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమాల్లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను మంత్రి, ఎంపీ ఘనంగా సన్మానించి సత్కరించారు. మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలకు పూలవర్షం కురిపించిన విద్యార్థులు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలల్లో కల్పిస్తున్న ఆధునిక సౌకర్యాలను పరిశీలించిన నేతలు విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యాభ్యాసం, లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ చిన్న స్థాయి నుంచి ఎదిగి ఉపాధ్యాయుడిగా సేవలందించి, రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అందరికీ ఆదర్శనీయులని అన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది సెప్టెంబర్ 5న గురుపూజోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించి ఉన్నత శిఖరాలకు చేర్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి భవిష్యత్తునే కాదు ఒక దేశ భవిష్యత్తును కూడా మార్చగలరని పేర్కొన్నారు. విద్యారంగంలో యువనేత నారా లోకేష్ విప్లవాత్మక మార్పులు శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. అందుకు అనుగుణంగా డీఎన్ఆర్, ఆర్ఎస్ఆర్ పాఠశాలలను అన్ని హంగులతో ఆధునీకరించామని చెప్పారు. నెల్లూరు సిటీలోని అన్ని ప్రభుత్వ హైస్కూళ్లను దశలవారీగా ఆధునీకరిస్తామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన వాతావరణం, ఆధునిక సౌకర్యాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ డీఎన్ఆర్ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. మంత్రి నారాయణ కల్పించిన సౌకర్యాలు, అవకాశాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు మేయర్ దేవర కొండ సుజాత, కమిషనర్ నందన్, డీఈఓ బాలాజీరావు, ఎంఈఓ తిరుపాల్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతారెడ్డి, కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, టీడీపీ నగర అధ్యక్షులు మామిడాల మధు, టీడీపీ నేతలు అనం రంగ మయూర్ రెడ్డి, అన్నంగి ప్రసాద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు

### కొత్త జంతువులు: డిసిఎం పవన్

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు కొత్త జంతువులు వచ్చాయి. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రాధేకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్‌తో జంతు మార్పిడి కార్యక్రమాన్ని ఐజీజెడ్పీ విజయవంతంగా పూర్తి చేసింది. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ "ఎక్స్" వేదికగా వెల్లడించారు. ఈ జంతు మార్పిడిలో భాగంగా ఐజీజెడ్పీకి 3 జీబ్రాలు, 4 కామన్‌మార్మోసెట్ టామరిన్‌లు, 3 రెడ్‌నెక్డ్ వాలబీలు, 2 కామన్ మార్మోసెట్లు వచ్చాయి. ముఖ్యంగా అంతరించిపోతున్న కాటన్‌టాప్ టామరిన్‌లను ఐజీజెడ్పీలో తొలిసారిగా ప్రవేశపెట్టారు. ఐజీజెడ్పీ నుంచి 3 ఇండియన్ గౌర్లు, 4 స్లెండర్‌టెయిల్డ్ మకాక్‌లు, 2 ఘరియాల్‌లను జామ్‌నగర్‌కు తరలించారు. కొత్తగా వచ్చిన అన్ని జంతువులు ఆరోగ్యంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. అలాగే వన్యప్రాణుల సంరక్షణతో పాటు సందర్శకులకు మరింత మంది ఆసక్తిని పెంచేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పవన్ కళ్యాణ్ తన పోస్టులో పేర్కొన్నారు.

## స్థానిక ఎన్నికల నిర్వహణకు జనసేన సమన్వయ కమిటీ

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన సన్నద్ధమవుతోంది. జనసైనికులు, వీర మహిళలను సన్నద్ధం చేసేందుకు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమన్వయ కమిటీలను జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియమించారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక సమన్వయకర్తను, ముగ్గురు సమన్వయ కమిటీ సభ్యులను నియమించారు. వీరికి సహాయక బృందంగా ఆ పార్లమెంట్ పరిధిలోని ప్రతి శాసనసభ నియోజకవర్గం నుంచి ఒకరిని ఎంపిక చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాలు కోసం నియమించిన కమిటీలోని సభ్యులకు పార్లమెంట్ నియోజకవర్గాల సమన్వయ బాధ్యతలు అప్పగించారు. జనసేన అనుసరించే విధి విధానాలతో, కూటమి పక్షాలతో సమన్వయాన్ని వీరు చూస్తారు. ఈ సభ్యులందరికీ 9వ తేదీన ఉదయం 10 గం. నుంచి మంగళగిరిలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తారు.

## టిటిడిలో సంచలనం రేకెత్తిస్తున్న జనసేన నేత వ్యాఖ్యలు

### ఎవరా 50మంది అవినీతిపరులు?

**తిరుపతి,సెప్టెంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడిలో పనిచేస్తూ కోట్లాదిరూపాయల విలువైన ఆస్తులు కలిగి ఉన్న అక్రమార్కులు ఇంకా ఉన్నారనే జనసేన పార్టీ నేత వ్యాఖ్యలు తిరుమల,తిరుపతిలో పెద్ద సంచలనం కలిగిస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా దేవుని దర్శనాల పేరుతోనే ప్రాబల్యం చాటుకుని టిటిడిలో అటెండర్ స్థాయి నుండి డిప్యూటీ ఇఒ స్థాయి అధికారుల వరకు పలు రకాలుగా అవినీతికి అలవాటు పడి కోట్లు కూడబెట్టారనే వదంతులు ఇప్పుడు ఎసిబికి ఉప్పందిందనేది గుప్పుమంటోంది. తాజాగా తిరుమల ఆలయ డిప్యూటీ ఇఒ మెండు లోకనాథం ఆదాయానికి మించి ఐదుకోట్ల రూపాయలు విలువైన ఆస్తులు కలిగిఉన్నట్లు ఎసిబి అధికారులు నిర్ధారించడం,తదనంతరం ఆయన్ను అరెస్ట్ చేసి నెల్లూరు జైలుకు తరలించారు. దీంతో ఇప్పుడు టిటిడిలో అక్రమార్కుల యవ్వారంపై పెద్ద చర్చ మొదలైంది. దీన్ని బలపరుస్తూ జనసేన పార్టీ తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ చేసిన వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. గత ప్రభుత్వంలో టిటిడి మాజీ ఛైర్మన్, వైసిపి నేత భూమన



కరుణాకర్‌రెడ్డికి నయానాభయానా సేవ చేస్తూ కోట్లల్లో అక్రమాస్తులు సంపాదించిన వారి వివరాలు తన దగ్గర ఉన్నాయని, ఆ 50మంది అక్రమార్కుల పేర్ల చిట్టా తన దగ్గర ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. టిటిడి ఇఒను కలిసి ఆ పేర్లను అందజేస్తానని,

మిగిలిన వారిపైన త్వరలో ఎసిబి దాడులు జరగడం ఖాయమని కీలకంగా వెల్లడించారు. ఇప్పుడు ఆయన వ్యాఖ్యలు టిటిడిలో పెద్ద దుమారం రేపుతోంది.అదేగాక వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి ఎసిబి సోదాల్లో అక్రమాస్తులు కలిగిఉండిన టిటిడి డిప్యూటీ ఇఒ లోకనాథంకు మద్దతు పలకడం విడ్డూరమని అన్నారు. లోకనాథం అక్రమాస్తుల్లో భూమనకు వాటాలు వెళ్ళాయని,ఆయనకు భూమన వత్తాసు పలకడమేంటని ప్రశ్నించారు.తిరుపతిలో కుల చిచ్చు పెట్టడానికి భూమన ప్రయత్నిస్తున్నాడని కిరణ్‌రాయల్ విమర్శలు చేశారు.దేవుని చెంత నిజాయితీ,నీతిగా అంకితభావసేవలందిస్తున్న టిటిడి ఉద్యోగస్తులు భూమన ట్రాప్ లో పడకండని కూడా కిరణ్ హితవు చేశారు.టిటిడి ఉద్యోగస్తులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే టిటిడిలో పలువురు అక్రమార్కులపై ఎసిబికి ఫిర్యాదులు వెళ్ళాయనేది సమాచారం. ఇంకా టిటిడిలో ఇద్దరు డిప్యూటీ ఇఒ అధికారులు, ఏడుమందివరకు సూపరింటెండెంట్లు, ఆరేడు మంది ఎఇఒల జాబితా ఎసిబి వద్ద ఉందనేది కథనం. మరీ ఇదే నిజమైతే వీరందరిపై ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై టిటిడి ఛైర్మన్, ఇఒ విచారణకు ఆదేశిస్తారా, సహకరిస్తారా అనే అనుమానాలు ఉద్యోగవర్గాల్లో గుప్పుమంటున్నాయి. ఎసిబి వద్ద ఎవరి పేర్లు ఉన్నాయి,ఎవరు ఎవరిపై ఫిర్యాదులు చేశారనేది అంతర్గతంగా ఆరా తీస్తు న్నట్లు సమాచారం.మరీ అక్రమ సంపాదనపై టిటిడిలో కీలకమైన ఒక్క డిప్యూటీ ఇఒ అధికారి అరెస్ట్‌తో వ్యవహారం చక్కబెట్టేస్తారా? లేక అవినీతి మూలాలను వెలికి తీసే పెద్ద దర్యాప్తుకు ఇది ఆరంభమనే సంకేతాలు ఇచ్చారా అనేది కిరణ్‌రాయల్ 50మంది పేర్ల చిట్టా విప్పితే స్పష్టం కానుంది.

## స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించేలా ప్రణాళికలు

**తిరుపతి,సెప్టెంబరు 5 ప్రభాతవార్తప్రతినిధి:** స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించే సహాయకులు అంశంపై సదస్సు జరిగింది. శనివారం తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యా లయం ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కమ్యూనికేషన్ జర్నలిజం విభాగం, బయోసైన్సెస్ సెరికల్చర్ విభాగాల సహకారంతో ప్యానెల్ డిస్కషన్ విత్ రీజినల్/నేషనల్ స్టార్టప్ ఎకోసిస్టమ్ ఎనేబ్లర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఒక కొత్త వ్యాపా రం (స్టార్టప్) పుట్టి, పెరిగి, విజయం సాధించడానికి అవసరమైన మద్దతు, వనరులు వాతావరణాన్ని కల్పించే వ్యవస్థలను నిర్మించుకోవాల్సిన అవసరంపై చర్చించారు. ప్రాంతీయ స్థాయిలో ఒక విజయవంతమైన స్టార్టప్ ఎకోసిస్టమ్ ఏర్పడటానికి అవసరమైన ముఖ్యమైన అంశాలపై ప్యానెలిస్టులు తమ అనుభవాలను పంచుకున్నారు. నిధులు మాత్రమే స్టార్టప్‌ల విజయానికి కీలకమా మెంటార్‌షిప్, మార్కెట్ యాక్సెస్, ప్రతిభావంతులైన మానవ వనరులు కూడా సమానంగా ముఖ్యమా అనే అంశాలపై చర్చ సాగింది. ఒక ప్రాంతంలో విజయవంతమైన



స్థానిక పారిశ్రామికవేత్తలు ఉండటం వల్ల కొత్త తరం స్టార్టప్‌లకు కలిగే ప్రయోజనాలను కూడా వివరించారు. నగరాల్లో స్టార్టప్‌లు ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా చర్చలో ప్రధానంగా నిలిచాయి. మెట్రో నగరాల్లోనే స్టార్టప్ వనరులు ఎక్కువగా కేంద్రీకృతమవుతున్న నేపథ్యంలో ప్రాంతీయ స్టార్టప్‌లకు అవసరమైన మౌళిక సదుపాయాలు, ఇంక్యుబేటర్ల బలోపేతం, జాతీయ మార్కెట్లకు చేరుకునే అవకాశాలు వంటి అంశాలపై ప్యానెలిస్టులు అభిప్రాయాలను వెల్లడించారు. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, వర్చువల్ మెంటార్‌షిప్, ఆన్‌లైన్ ఇంక్యుబేషన్ వంటి మార్గాల ద్వారా భౌగోళిక పరిమితులను తగ్గించవచ్చని చర్చించారు. విశ్వవిద్యాలయాలు ప్రాంతీయ స్టార్టప్ ఎకోసిస్టమ్ అభివృద్ధిలో పోషించాల్సిన పాత్రపై కూడా ప్రత్యేకంగా చర్చ జరిగింది. విద్యార్థుల్లోని సృజనాత్మక ఆలోచనలను స్టార్టప్‌లుగా మలచేందుకు ఇంక్యుబేషన్, మెంటార్‌షిప్, పరిశ్రమలతో అనుసంధానం, మార్కెట్ అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని ప్యానెలిస్టులు సూచించారు. ఈ కార్యక్రమానికి వనరుల వ్యక్తులుగా డాక్టర్ కె. శ్వేతా కుమారి, మిస్టర్ మన్సూర్ అలీపాల్గొనగా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ చీఫ్ ప్యాట్రన్‌గా, రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష ప్యాట్రన్‌గా వ్యవహరించారు.

## నంద్యాల ఎంపి ఆదేశంతో కెసికి నీరు విడుదల

**పగిడ్యాల, సెప్టెంబరు 5,ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం, మల్యాల ఎత్తిపోతల పథకం నుండి కర్నూలు - కడప (కేసికెనాల్) కు నంద్యాల ఎంపి, టిడిపి లోక్‌సభ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ఆదేశాలమేరకు నీటిని విడుదల చేసినట్లు ముచ్చుమర్రి టిడిపి సీనియర్ నాయకులు కాటం వెంకట రామిరెడ్డి తెలిపారు. శనివారం ఎంపి బైరెడ్డి శబరి అనుచరులు ముచ్చుమర్రి టిడిపి సీనియర్ నాయకులు కాటం వెంకటరామిరెడ్డి, ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్రఉపాధ్యక్షుడు కుమ్మరి నాగరాజు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసి నాగభూషణం, సుబ్బారావు, బాలనారాయణ, ఆంజనేయనగర్ రవి ఆధ్వర్యంలో వందమంది రైతులు తరలివచ్చారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం వద్ద కృష్ణమ్మకు కుంకుమ, పసుపు,గాజులు, డిబియ్యం, కొత్త చాటతో పెట్టి సారె సమర్పించి కృష్ణమ్మ జలహారతిఇచ్చి కేసి కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. కేసి కెనాల్ డీఈ ప్రసాద్, ఏఈఈలు వీరమ్మ, శ్రీనివాసనాయక్‌లు మాట్లాడుతూ



కృష్ణమ్మకు జలహారతి ఇస్తున్న ఎంపి బైరెడ్డి శబరి అనుచరగణం

శనివారం ఉదయం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల కు ఉన్నతాధికారుల అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి రెండు పైపుల నుండి 480 క్యూసెక్కులు,మల్యాల ఎత్తిపోతల పథకం ఒక పైపు నుండి 325 క్యూసెక్కుల నీరు మొత్తం 805 క్యూసెక్కుల నీరు కర్నూలు - కడప (కేసికెనాల్)విడుదల చేయడం జరిగిందన్నారు. కేసికెనాల్‌కు వదిలిన నీరు కేవలం తాగునీటి అవసారలే అన్నది మరువద్దని, నీటిపారుదల అధికారులు కూడా తాగునీటి అవసరాలకే కేసికెనాల్‌కు నీటిని విడుదలకు అదేశించినట్లు కేసి కెనాల్ డీఈ ప్రసాద్ స్పష్టం చేశారు.

## విజయవాడలో యంగ్ లీడర్స్ ఫర్ సోషల్ ఛేంజ్ శాఖ

### ప్రారంభించిన ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు

**విజయవాడ, సెప్టెంబరు 5,ప్రభాతవార్త:** డెమోక్రటిక్ సంఘ తన ప్రధాన కార్యక్రమమైన యంగ్ లీడర్స్ ఫర్ సోషల్ ఛేంజ్ (వైఎల్ఎస్‌సి) యొక్క విజయవాడ శాఖను శనివారం,విజయవాడలో ప్రత్యేక అతిథిగా హాజరైన లోక్ సభ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు అధికారికంగా ప్రారంభించారు. డెమోక్రటిక్ సంఘ వ్యవస్థాపకురాలు రెజీనా కాసాండ్రా, డెమోక్రటిక్ సంఘం వ్యవస్థాపకులు చైతన్య ఎంఆర్ఎస్‌కె, వైఎల్ఎస్‌సి విజయవాడ బ్యాచ్ మెంటార్ యశస్విని పెద్ది ప్రసంగించారు. యంగ్ లీడర్స్ ఫర్ సోషల్ ఛేంజ్ అనేది 8 నుండి 12 తరగతుల వరకు చదివే విద్యార్థుల కోసం రూపొందించబడిన నాలుగు నెలల పౌర మరియు సామాజిక నాయకత్వ కార్యక్రమం. ఇది యువకులు ప్రజాస్వామ్యం, నాయకత్వం మరియు ప్రభుత్వ సంస్థలను అర్థం చేసుకోవడానికి, అలాగే వారి సమాజాల్లోని సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన ఆత్మవిశ్వాసం మరియు నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి సహాయపడుతుంది.

ఈ ప్రారంభోత్సవంతో డెమోక్రటిక్ సంఘం వైఎల్ఎస్‌సిని నాలుగు నగరాలకు విస్తరించింది.



ఇందులో రెండు హైదరాబాద్ మరియు ఒక బెంగళూరులో మూడు విజయవంతమైన బ్యాచ్లు ఉన్నాయి. విజయవాడ ప్రారంభోత్సవం ఆంధ్ర ప్రదేశ్‌లో కార్యక్రమం విస్తరణను సూచిస్తుంది, అలాగే సమాచారం కలిగిన బాధ్యతాయుతమైన మరియు సామాజిక స్పృహ కలిగిన యువ నాయకుల విస్తృత నెట్వర్క్‌ను పెంపొందించే డెమోక్రటిక్ సంఘం ప్రయత్నాల తదుపరి దశను గుర్తిస్తుంది. ఈ పాఠ్యాంశాలు విద్యార్థులకు ప్రజాస్వామ్యం మరియు రాజ్యాంగం, నాయకత్వం, మానవ హక్కులు, వాతావరణ చర్య, ప్రజా విధానం మరియు పరిపాలన గురించి పరిచయం చేస్తాయి. పాల్గొనేవారు ఇంటరాక్టివ్ సెషన్లలో పాల్గొంటారు, ప్రజా నాయకులు మరియు సామాజిక ప్రభావ నిపుణుల నుండి నేరుగా నేర్చుకుంటారు, మరియు వాస్తవ సామాజిక మరియు సమాజ సవాళ్లను పరిష్కరించే ప్రాజెక్టులను అభివృద్ధి చేయడానికి కలిసి పనిచేస్తారు.

వైఎల్ఎస్‌సి యొక్క నిర్వచించే అంశం భారత పార్లమెంటు న్యూఢిల్లీకి అనుభవపూర్వక సందర్శన. ఈ సందర్శన విద్యార్థులు భారతదేశపు అత్యంత ముఖ్యమైన ప్రజాస్వామ్య సంస్థలలో ఒకదాన్ని ప్రత్యక్షంగా అనుభవించడానికి మరియు వారి అభ్యాసాన్ని పార్లమెంటరీ ప్రజాస్వామ్య పనితీరుతో అనుసంధానించడానికి వీలు కల్పిస్తుంది.

విజయవాడ బ్యాచ్ అక్టోబర్ 2026 నుండి జనవరి 2027 వరకు నడుస్తుంది మరియు మూలస్థాయి ఆవిష్కరణ, వ్యవస్థాపకత, సుస్థిరత మరియు సమాజ అభివృద్ధి రంగాలలో పనిచేస్తున్న సామాజిక ప్రభావ మరియు యువత అభివృద్ధి నిపుణురాలు యశస్విని పెద్ది ద్వారా మార్గదర్శకత్వం వహించబడుతుంది.

ఈ ప్రారంభోత్సవంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పౌర నాయకులు తదితరులు హాజరయ్యారు.

## భూ ఆక్రమణలపై టిడిపి గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన మహమ్మద్ రుఖియా శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. 2004 జనవరి 19న కంతేరు గ్రామ పరిధిలోని డోర్ నెం. 152 లో గల 200 గజాల నివాస స్థలాన్ని కొనుగోలు చేశాను. ఈ స్థలం తాడికొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు నెం. 67/2004 ద్వారా చట్టబద్ధంగా రిజిస్టర్ అయింది. ఇటీవల తమ స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లగా, పక్క స్థలం వారు ఆ 200 గజాలను అక్రమంగా ఆక్రమించారు. స్థలంలోకి అడుగుపెట్టకుండా అడ్డుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్య బాబుకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.

అనకాపల్లి జిల్లా కశింకోట మండలం గోకివానిపాలెం గ్రామానికి చెందిన సోమునాయుడు, ఎన్టీఆర్ జిల్లా పెనమలూరు మండలం కానూరు గ్రామానికి చెందిన కాజా రామాదేవి, అనకాపల్లి జిల్లా మారేడుపూడి గ్రామానికి చెందిన పి. కృష్ణమూర్తి, అనంతపురం జిల్లా శింగనమల మండలం గురుగుంట్ల గ్రామానికి చెందిన కె. సుగుణ, అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన అడపా నారాయణరావు గ్రీవెన్స్‌లో అర్జీలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.



సిఎం చంద్రబాబును సన్మానిస్తున్న దృశ్యం

## సిఎం ప్రకటనపై అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జెపిసి చైర్మన్ భూపతిరాజు రవీంద్ర రాజు హర్షం

**విజయవాడ, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** శనివారం ఉండవల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చలలో సీఎం చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి ఉద్యోగుల హామీలపై సీఎం ప్రకటన పై ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్ర రాజు హర్షం వ్యక్తం చేశారు. 12వ పిఆర్సీ నియామకం, 2026 అక్టోబర్ 1 నుంచి 2 రెండు డిఎలు చెల్లింపు, 17-2024, 11-2025 డీఏలు విడుదల, 2022 సంవత్సరానికి సంబంధించి సరెండర్ లీవ్స్ వచ్చే సంక్రాంతికి అకౌంట్ లో వేయడానికి అంగీకారం, పోలీసులకు 1 అడిషనల్ సరెండర్ లీవ్ ఈ దసరాకి చెల్లింపు, అడి షనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ జనవరి 2027 నుంచి ఇచ్చేందుకు నిర్ణయం, 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిని వారికి 15 శాతం మేర అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ వర్తింపు, ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను స్ట్రీమ్ లైన్. వచ్చే నెల నుంచే ఏ నెలకు ఆ నెల ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కు చెల్లింపునకు అంగీకారం తదితర ప్రయోజనాలను అందించడానికి సిఎం చంద్రబాబు నాయుడు అంగీకరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సీఎం క్యాంప్ ఆఫీసులో కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవిన్యూ ఎంప్లాయిస్ జేఏసీ తరఫున మెమెంట్ ఇచ్చి సాలువతో భూపతిరాజు సన్మానం చేశారు. ఉద్యోగుల న్యా యమైన సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయడానికి కృషి చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అమరావతి రెవిన్యూ ఎంప్లాయిస్ జేఏసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సూరిపల్లి రాజశేఖర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవె న్యూ అధికారుల సంఘం. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, రాటకొండ శ్రీని వాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు. మిరియాల లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

## ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరించిన సిఎం

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆక్వా రైతుల ఎన్నో ఏళ్ల సమస్యలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిష్క రించారు. ఈ మేరకు మత్స్యశాఖ జీవో నంబర్1756ను విడుదల చేసింది. ఆక్వా రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తీసుకెళ్లారు. ఈ సమస్యలపై సీఎం సానుకూలంగా స్పం దించి వెంటనే చర్యలు చేపట్టారు. మత్స్యశాఖ విడుదల చేసిన జీవోపై ఆక్వా రైతు సంఘం నాయకులు హర్షంవ్యక్తం చేశారు. గుడివాడ ప్రజా వేదికలో ఎమ్మెల్యే రామును ఆక్వా రైతులు శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జీవోలోని నిబంధనలను రైతులుసద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాము సూచించారు.గత ప్రభుత్వంలో పట్టించుకోని తమ సమస్యలకు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం లభించిందని ఆక్వా రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు.



## దుర్గమ్మకు రు.5 లక్షల విలువైన బంగారు హారం

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారికి శనివారం పశ్చిమ గోదావరి జిల్లా, పాలకోలు మండలం భాగ్యేశ్వరం గ్రామానికి చెందిన దొంగ వెంకట త్రిమూర్తి సత్యనారాయణ బంగారు ఆభరణాన్ని దుర్గమ్మవారికి కానుకగా డిప్యూటీ ఈఓ కిశోర్ కుమార్‌కు అందించారు. దాదాపు రు5 లక్షల విలువైన, 32 గ్రాముల బరువుగల బంగారు లక్ష్మీ తాడును సమర్పించారు. ఈ ఆభరణంలో తెలుపు, ఎరుపు మరియు పచ్చ రాళ్లు పొదగబడి ఉన్నాయి.కానుక సమర్పించిన భక్తునికి ఆలయ మర్యాదలతో ప్రత్యేక దర్శనం కల్పించి, వేదపండితులచే ఆశీర్వచనం చేయించి అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను డిప్యూటీ ఈఓ శ్రీ కిషోర్ కుమార్ అందజేశారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** ఇంద్రకీలాద్రి, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథక విభాగమునకు విజయవాడ ఎనికేపాడు కెవిఆర్ కాలనీ వాస్తవ్యులు పి.రవి శంకర్ రూ.1,00,116లు మరియు హైదరాబాద్‌కు చెందిన చుండూరి శ్రీనివాసరావు రూ.1,00,000లు విరాళమును ఆలయ అధికారులకు అందచేయగా, అధికారులు దాతలకు అమ్మవారి చిత్రపటమును అందచేసి దర్శన ఏర్పాట్లు గావించారు. దర్శనానంతరం దాతలకు ఆలయ వేద పండితులు వేదాశీర్వచనం, ప్రసాదం అందజేశారు.

## 12 వ పీఆర్సీకి పచ్చజెండా: సిఎంకు కృతజ్ఞతలు

### ఆల్‌ఎన్జిజీవో జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం

**శ్రీకాకుళం, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** 12వ పీఆర్సీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు నిర్ణయం పట్ల ఏపీ ఎన్జీవో కార్యాలయం వద్ద శనివారం బాణాసంచా కాల్చి ఏపీ ఎన్జీవో ప్రతిని ధులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లా డుతూ 2026 అక్టోబర్ ఒకటో తేదీ నుంచి రెండు డీఏల చెల్లింపునకు అంగీకరించినట్లు తెలిపారు. అలాగే సరెండర్ లీవ్స్ (పోలీసులకు అదనంగా సరెండర్ లీవ్) వేసేందుకు ఆమోదించారని చెప్పారు. రిటైర్ అయిన ఉద్యోగులకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను 2027 జనవరి నుంచి ఇచ్చేందుకు ఆమోదం అప్పట్లో ఆనందం వ్యక్తం చేశారు. మరోవైపు అక్టోబర్ ఒకటి నుంచి రెండు డీఏలు చెల్లించాలని నిర్ణయించిన ఏపీ ప్రభుత్వం.. 172024, 112025 డీఏలు విడుదల చేనుందని వివరించారు. ఏపీ ఎన్జీ జీవో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయి వేణుగోపాల్ మాట్లాడుతూ 2022కు సంబంధించిన సరెండర్ లీవ్స్‌ను 2027 సంక్రాంతికి అకౌంట్‌లో వేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించిందని వివరించారు. పోలీస్ సిబ్బందికి ఒక అడిషనల్ సరెండర్ లీవ్ ఈ విజయదశమికి చెల్లించనున్నారు. రిటైర్ అయిన వారికి జనవరి 2027 నుంచి అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ ఇవ్వనుండగా.. 70 సంవత్సరాలు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం చొప్పున అందించనున్నారని చెప్పారు. మరోవైపు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) బకాయిలను వచ్చే నెల నుంచి ఏ నెలకు ఆ నెల చొప్పున ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కి చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు గొప్ప విషయం అన్నారు. మరోవైపు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారులుగా చేర్చాలని ముఖ్యమంత్రిని విద్యాసాగర్ కోరడం హర్షనీయమన్నారు. అలాగే స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల సిబ్బందికి నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరిందని చేశారు. సీఎం చంద్రమనాయుడు తీసుకునే నిర్ణయం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు హర్షత రేఖలు వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నిర్ణయాలు ఉద్యోగ సంఘ నాయకుల విజయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జి జీవో సంఘ ప్రతినిధులు జిల్లా కార్యదర్శి చల్లా శ్రీనివాస్, కంట జయరావు పాల్గొన్నారు.

6-9Pg7exHMNWJQE:6-9Pg7exHMNWJQE.qxd 9/6/2026 12:05 AM Page 1



# ఎస్సీ, ఎస్టీల కోసం నాలుగు అంచెల కార్యాచరణ

## హైపవర్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి విచారణ వేగంగా జరిపి నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా కోర్టుల్లో పరిష్కరించేలా చూడాలని, ప్రత్యేక సెషన్ కోర్టులు, స్పెషల్ కోర్టుల్లో కేసులను రేషనలైజ్ చేసి పరిష్కరించాలని సీఎం సూచించారు. చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా, తప్పు చేసిన వారికి శిక్షపడేలా వ్యవస్థ పనిచేయాలని స్పష్టం చేశారు. సీఎం క్యాంప్ కార్యాల యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలు, సంక్షేమంపై రాష్ట్ర స్థాయి అత్యున్నత కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీల రక్షణ, సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారత, వైద్యారోగ్యం తదితర అంశాలపై సీఎం కీలక సూచనలు చేశారు. గుంటూరు, అనంతపురం, తూర్పుగోదావరి, ప్రకాశం జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలకు సంబంధించి ఎక్కువ కేసులు నమోదైన అంశంపై ప్రత్యేకంగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. జిల్లా స్థాయిలో నిర్వహించాల్సిన సమావేశాలు ఇంకా 131 పెండింగ్‌లో ఉండటంపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై జిల్లా కలెక్టర్లు తప్పనిసరిగా ఈ సమావేశాలను నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని విద్యాసంస్థల నుంచి కనీసం 5 నుంచి 10 శాతం మంది విద్యార్థులు ఉన్నత స్థాయి విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందేలా నాణ్యమైన విద్య అందించడంపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇటువంటి మంచి అంశంపైనా కొన్ని పార్టీలు వివాదం సృష్టిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకుని ప్రగతి సాధించకూడదన్న ఉద్దేశంతోనే వారు ఈ అంశాన్ని వివాదం చేస్తున్నారని ముఖ్యమంత్రి విమర్శించారు.



ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోందని సంక్షేమ పథకాలలో లీకేజీలు లేకుండా చూస్తూ ఆయా నియోజకవర్గాన్ని ఓ మోడల్‌గా అభివృద్ధి చేసేలా అంతా సమిష్టిగా పనిచేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. పీ4, ఎంబీకే 1020 వంటి కార్యక్రమాలను సమర్థంగా వినియోగించుకుంటే ఎస్సీ, ఎస్టీల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయన్నారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతిపై ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎస్సీ, ఎస్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు.

**న్యాయ విచారణకై రక్షణ సెల్ ఏర్పాటు**

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై దాడుల నిరోధక చట్టం అమలు తీరుతో పాటు రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. ఎస్సీ, ఎస్టీ రక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం నాలుగు అంచెల కార్యాచరణ అమలు చేయాలని నిర్ణయించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు 14 స్పెషల్ సెషన్ కోర్టులు, ఒక ప్రత్యేక కోర్టు నిరంతరం పని చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలోనే 2026లో ఇప్పటివరకు నమోదైన 810 కేసులను విజయవంతంగా పరిష్కరించినట్లు పేర్కొన్నారు. 2023 నుంచి 2026 ఆగస్టు వరకు మొత్తం 1,478 కేసుల్లో రూ.15.43 కోట్ల పరిహారాన్ని అందించినట్లు అధికారులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో వేధింపులకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక ప్రొటెక్షన్ సెల్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిలలో పటిష్టమైన విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు సీఎం చంద్రబాబుకు వివరించారు.

ఎస్సీ,ఎస్టీ హాస్టళ్లలో టీచర్లు నివాసం ఉండేలా చూడాలని ఎమ్మెల్యే కొండ్రు మురళి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన సీఎం తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వివిధ గ్రామాలు, రహదారులపై హరిజన వాడ అనే పేర్లను మార్చాలంటూ పూతలపట్టు శాసనసభ్యుడు మురళీమోహన్ ముఖ్యమంత్రికి తెలిపారు. దీనిపై తక్షణమే చర్యలు చేపడతామని సీఎం స్పష్టం చేశారు. గిరిజనులు ట్రైకార్ రుణాలను పెంచాలని వచ్చిన అభ్యర్థనపైనా సీఎం సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశానికి మంత్రులు డీబీవీ స్వామి, వి.అనిత, జి. సంధ్యారాణి, ఎంపీలు కృష్ణప్రసాద్, దగ్గుమళ్ల ప్రసాద్ సహా రాష్ట్ర వ్యాప్త ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల శాసనసభ్యులు, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పీకాక్స్ భూగర్భ అణుకేంద్రంపై దాడి చేస్తాం

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్, సెప్టెంబరు 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌లోని పికాక్స్ పర్వతం కింద ఉన్న భూగర్భ అణుకేంద్రంపై త్వరలోనే దాడి చేస్తామని స్పష్టం చేశారు. ఓవల్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడుతూ, పికాక్స్‌లో ఏదైనా అనుమానాస్పద కార్యకలాపం జరిగితే, మేము దానిపై చాలా త్వరగా దాడి చేయవచ్చని వ్యాఖ్యానించారు. పికాక్స్ అణు కేంద్రంలో ప్రతీ కదలికను అమెరికా నిశితంగా గమనిస్తోందని ట్రంప్ తెలిపారు. పికాక్స్‌లో ఎవరు కదులుతున్నారో, ఇరాన్ వ్యాప్తంగా ఎవరు ఎక్కడ తిరుగుతున్నారో మాకు తెలుసు. ఏదైనా తప్పు జరిగితే, మేము వారిని గట్టిగా దెబ్బతీస్తామని అన్నారు.



గత ఐదు నెలలుగా అమెరికా చేపడుతున్న సైనిక చర్యల వల్లే ఇరాన్ అణ్వాయుధాన్ని పొందకుండా నిరోధించగలిగామని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌లోని నటాంజ్ యురేనియం శుద్ధి కేంద్రానికి సమీ పంలో ఒక పర్వతాన్ని తొలిచి భూమికి 80 నుంచి 100 మీటర్ల లోతులో ఈ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. అమెరికా ప్రయోగించే శక్తిమంతమైన బంకర్‌బస్టర్ బాంబులు కూడా దీనిని ఛేదించడం కష్టమని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2020 నుంచి దీని నిర్మాణం జరుగుతుండగా, ఇక్కడ సెంట్రి ఫ్యూజ్‌లను అసెంబుల్ చేస్తామని ఇరాన్ అంతర్జాతీయ అణు ఇంధన సంస్థకు గతంలో వెల్లడించింది. ట్రంప్ ఈ స్థావరంపై హెచ్చరికలు చేయడం ఇదే మొదటిసారి కాదు. ఈ ఏడాది జులై నుంచే ఆయన పికాక్స్ గురించి పదేపదే ప్రస్తావిస్తున్నారు.

# విద్యుత్ రంగంలో సేవల విస్తరణకు ప్రాధాన్యం:మంత్రులు

**రాయచోటి సెప్టెంబరు 5 ప్రభాతవార్త:** విద్యుత్ రంగంలో ప్రభుత్వ పథకాల అమలు మౌలిక వసతుల అభివృద్ధి వినియోగదారులకు మెరుగైన సేవలు వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. రాయచోటి స్థానిక గెస్ట్ హౌస్ నందు మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గుట్టివీటి రవికుమార్ జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులకు పలు కీలక ఆదేశాలు సూచనలు జారీ చేశారు పథకం కింద ఎస్సీ ఎస్టీ వర్గాలకు ఇప్పటికే ఆరు లక్షల విద్యుత్ కనెక్షన్లు అందించామన్నారు రాబోయే రోజుల్లో బీసీ వర్గాలకు కూడా సౌర విద్యుత్ కనెక్షన్లను అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు వ్యవసాయ రంగానికి పగటిపూట నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్షణం అన్నారు రాష్ట్రంలో ఎక్కడ లో వోల్టేజ్ సమస్యలు తలెత్తకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు వేసవికాలంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగే అవకాశం ఉన్నందున విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు శాఖలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు ఏఈ నియామక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని ఇటీవల పరీక్షలు కూడా నిర్వహించినట్లు మంత్రి తెలిపారు.

స్థానిక ఎమ్మెల్యేలు జిల్లా ఇన్చార్జ్ మంత్రులతో సమన్వయం చేసుకుంటూ విద్యుత్ శాఖ పనులపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి పురోగతిని వెల్లడించాలని అధికారులను ఆదేశించారు.



**మదనపల్లి జిల్లా కేంద్రంలో ఇండోర్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు :** భవిష్యత్తులో జిల్లాలో విద్యుత్ డిమాండ్ పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి రాబోయే ఐదేళ్ల అవసరాలకు అనుగుణంగా సబ్స్టేషన్ల నిర్మాణానికి అవసరమైన భూమిని ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు విద్యుత్ రంగంలో చేపడుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాలను కాలపరిమితిలో పూర్తిచేసి ప్రజలకు మెరుగైన నాణ్యమైన నిరంతర విద్యుత్ సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధానులక్షమన్నారు.

**రహదారుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి మంత్రి జనార్ధన్ రెడ్డి :** జిల్లాలో రోడ్లు భవనాల శాఖ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు రహదారుల నిర్వహణ జాతీయ రహదారుల పనుల పురోగతిపై మంత్రి జనార్ధన్ రెడ్డి అధికారులతో సమీక్షి ంచారు ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన వివిధ రహదారి, వంతెన లా అభివృద్ధి పనులపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని పలు ఆదేశాలు జారీ చేశారు మదనపల్లె తంబళ్లపల్లె పీలేరు రాయచోటి పుంగనూరు నియోజకవర్గాల్లో చేపట్టిన వివిధ రహదారి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించాలని మంత్రి అన్నారు ప్రస్తుతం కొనసాగుతున్న పనుల్లో తరిగొండ సర్వమడుగు రహదారి అనంతపురం పలమనేరు రహదారి నుంచి బొమ్మనచెరువు వరకు రహదారి అభివృద్ధి పనులు ఉన్నట్లు సమీక్షలో తెలిపారు పూర్తయిన రహదారులు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి వర్షాలు భారీ వాహనాల రాకపోకల వల్ల రహదారులు దెబ్బతినకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు అధికారులు కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి పనిని నాణ్యతతో నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి జనార్ధన్ రెడ్డి ఆదేశించారు

**రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు మంత్రి మండిపల్లి:** జిల్లాలో రవాణా శాఖ పనితీరు ఆదాయ వసూళ్లు ప్రజలకు అందుతున్న డిజిటల్ సేవలు రోడ్డు భద్రత ఆటో డ్రైవర్ల సంక్షేమం తదితర అంశాలపై మంత్రి మండిపల్లి అధికారులతో సమీక్ష నిర్వహించారు ప్రజలకు రవాణా శాఖ సేవలు మరింత సులభంగా వేగంగా పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు డ్రైవింగ్ లైసెన్సులు వాహన రిజిస్ట్రేషన్లు పర్మిట్లు, పన్నులు, ఫిట్నెస్ తదితర సేవలను డిజిటల్ విధానంలో సమర్థవంతంగా అందించాలన్నారు వాహన్ సారథి హోటల్ సేవలను మరింత విస్తృతంగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాల న్నారు కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ కు 24 గంటల డీమ్డ్ అప్రూవల్ విధానం సమర్థవంతంగా అమలయేల పర్యవేక్షి ం చాలన్నారు జిల్లాలో వాహన యజమానులకు ఫిట్నెస్ పరీక్షల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ సౌకర్యాన్ని మెరుగుపరిచే అంశాన్ని పరిశీలించాలన్నారు ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అన్నమయ్య జిల్లాలో ఆటో డ్రైవర్ల సేవ పథకం కింద 7184 మంది లబ్ధిదారులకు 10.77 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించినట్లు అధికారులకు వివరించారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ ఆర్ అండ్ బి ట్రాన్స్పోర్ట్ శాఖలకు సంబంధించి ఆయా అంశాలలో మంత్రులు జారీ చేసిన సూచనలను దృష్టిలో ఉంచుకొని ప్రాధా న్యత పరంగా పనులను పటిష్టంగా చేపట్టి నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలన్నారు పనుల అమలులో ఇట్టి జాప్యం చేయరాదని ఏదైనా పనులకు ఉన్నత స్థాయిలో అనుమతులు అవసరమైనప్పుడు ప్రతిపా దనను సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు ఈ సమా వేశంలో విద్యుత్ ఆర్ అండ్ బి ట్రాన్స్పోర్ట్ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ట్రైన్ (ఫైల్)

# 10న పలు రైళ్లు రద్దు

## కాజీపేట-బలార్షా మార్గంలో రైళ్లకు బ్రేక్

**హైదరాబాద్ (తార్నాక), సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** మరమ్మతుల కారణంగా 10న పలు రైళ్ల రద్దు. కాజీపేట - బల్లార్ష మార్గంలో జమ్మికుంట పోత్కపల్లి మధ్య 17 కి.మీ. దూరానికి ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం కోసం చేపట్టిన నాన్‌ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ఈ నెల 10న కొన్ని రైళ్లను పూర్తిగా, మరి కొన్నింటిని పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే 17003/04 రామగిరి మెమూ ఎక్స్‌ప్రెస్ రైలును 10న పూర్తిగా రద్దు చేశారు. భద్రాచలం రోడ్డు, బల్లార్ష మధ్య నడిచే 17033/34 సింగరేణి ఎక్స్ ప్రెస్ వరంగల్‌భద్రాచలం మధ్య మాత్రమే నడుస్తుంది. 17011/12 హైదరాబాద్ నుంచి సిర్పూర్‌కాగజ్‌నగర్ మధ్య నడిచే ఇంటర్‌సిటీ రైలు కాజీపేట సికిందరాబాద్ మధ్య మాత్రమే తిరుగుతుంది. 10న సికిందరాబాద్ నుంచి భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ (17233) గంట ఆలస్యంగా బయలుదేరుతుంది. 9న దానాపూర్ నుంచి ఎస్ఎంవీటీ బెంగళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22365), ఎస్ఎంవీటీ బెంగళూరు నుంచి దానాపూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22366), 10న చెన్నై సెంట్రల్ నుంచి శ్రీమాత వైష్ణోదేవి కాట్రా అండ మాన్ ట్రైవీక్లీ ఎక్స్‌ప్రెస్ (16033), 9న దిల్లీ నుంచి చెన్నై సెంట్రల్ తమిళ నాడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12622) రైళ్లు ఆలస్యంగా నడుస్తాయి.

# పన్నుదారులపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిఘా

## బడా వ్యాపారుల చెల్లింపునకు చెక్

## పన్నుల ఎగవేత కాకుండా వాణిజ్య పన్నుల వ్యూహాత్మకం

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** తెలంగాణలో పన్ను చెల్లింపుల్లో అక్రమాలు, లొసుగులు, లోపాల నేపథ్యంలో అటువంటి వాటికి చెక్‌పెట్టే దిశగా వాణిజ్య పన్నుల శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పన్ను సక్రమంగా చెల్లించకుండా అడ్డదారుల్లో ఎగవేతలకు పాల్పడుతున్న బడా పన్ను దారులపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో నిఘా పెట్టాలని నిర్ణ యిం చింది. వాణిజ్య పన్నుల శాఖ అధికారవర్గాల సమాచారం మేరకు పన్ను చెల్లింపుదారులపై నిశితంగా నిఘా ఉంచడంతోపాటు, వ్యాపారాలకు నిబంధనల పాటింపును సులభతరం చేయడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), ప్రత్యేక పన్ను బృందాలను ఆశ్రయిస్తోంది. ఇందుకు కేంద్రంగా స్టేట్ లార్జ్ టాక్స్‌పేయర్ యూనిట్ (ఎల్‌టియు) ఉంది. ఇది 4 స్ట్రాటజిక్ టాక్స్ పేయర్ యూనిట్ల (ఎస్‌టియు) ద్వారా ఒక్కో యూనిట్‌కు 100 మంది చొప్పున 400 మంది అధికవిలువ గత పన్ను చెల్లింపుదారులను పర్యవేక్షి స్తాయి. పతీ నెలా రూ.15 కోట్లు, అంతకంటే ఎక్కువ జీఎస్టీ చెల్లించినా, లేదా రూ. 30 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను క్లెమ్‌చేసినా, పన్ను చెల్లింపదారులను ఎల్‌టియు పరిధిలోకి తీసుకురానున్నారు.

# ప్రజాసమస్యలు విస్మరించిన ప్రతిపక్ష నేత కెసిఆర్ రాజీనామా చేయాలి

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** మాజీ ముఖ్య మంత్రి కెసిఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద తెలంగాణ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిం చనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇంచార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. మహా ధర్నా ఏర్పాట్లపై హైదరాబాద్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, అసెంబ్లీకిహాజరు కాకపోవడాన్ని ప్రజలదృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

# శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మూడు ప్రతిష్టాత్మక గ్లోబల్ గుర్తింపులు

**హైదరాబాద్ (శంషాబాద్) సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** శంషాబాద్ జీఎంఆర్ అంతర్జాతీయ విమా నాశ్రయానికి ఎయిర్‌పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ) వరల్డ్ నుంచి మూడు ప్రతిష్ఠాత్మక గుర్తింపులు లభించాయి.



ప్రతిష్టాత్మక గ్లోబల్ గుర్తింపులను అందజేస్తున్న పలువురు

అసాధారణమైన ప్రయా ణికుల అనుభవాలను అందించడం, యాక్సెసి బిలిటీ మరియు ఇన్‌క్లూజన్‌ను ప్రోత్స హించడం, అలాగే ప్రపంచ స్థాయి సేవా ప్రమాణాలను కొనసాగించడంలో విమా నాశ్రయం చూపుతున్న నిబద్ధతను ఈ గుర్తిం పులు స్పష్టం చేస్తు న్నాయి. ప్రయా ణికుల ప్రయాణం లోని ప్రతి దశను మెరుగుపరిచే ఇన్నోవేషన్, ఆపరేషనల్ ఎక్సలెన్స్ మరియు కస్టమర్ సెంట్రిక్ కార్య క్రమాలపై విమా నాశ్రయం నిరంతరం దృష్టి సారిం చడాన్ని ఈ విజయాలు ప్రతిబిం బిస్తున్నాయి.

**కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ ఎక్సలెన్స్**

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ ఏసీఐ ఎయిర్‌పోర్ట్ కస్ట మర్ ఎక్స్‌పీరియన్స్ అక్రె డిటేషన్ స్థాయి 5ను సాధించింది. ఇది ఏసీఐ వరల్డ్ కస్టమర్ ఎక్స్ పీరియన్స్ ఫ్రేమ్‌వర్క్ కింద అత్యున్నత స్థాయి. తమ స్ట్రాటజీ, కల్చర్, ఆపరేషన్స్, ఇన్నోవేషన్ మరియు స్టేక్‌హోల్డర్ ఎంగేజ్‌మెంట్‌లో కస్టమర్ ఎక్స్‌పీరియన్స్‌ను విజయవంతంగా అంతర్భాగంగా చేర్చిన విమానాశ్రయాలను ఇది గుర్తిస్తుంది. యాక్సెసిబిలిటీ, ఇన్‌క్లూజివ్ ట్రావెల్: తగ్గిన చలన సామర్థ్యం కలిగిన ప్రయాణికులు మరియు విభిన్న యాక్సెసిబిలిటీ అవసరాలు కలిగిన ప్రయాణికుల కోసం సీమ్‌లెస్, గౌరవ ప్రదమైన, ఇన్‌క్లూజివ్ ట్రావెల్ ఎక్స్‌పీరియన్స్‌ను సృష్టించేందుకు విమానాశ్రయం కొనసాగిస్తున్న ప్రయత్నాలను గుర్తిస్తూ, ఏసీఐ యాక్సెసిబిలిటీ ఎన్‌హాన్స్‌మెంట్ అక్రెడిటేషన్ స్థాయి 2ను అందుకుంది.

**అరైవల్స్ ఎక్స్‌పీరియన్స్‌కు గ్లోబల్ గుర్తింపు**

ఏసీఐ ఎయిర్‌పోర్ట్ సర్వీస్ క్వాలిటీ (ఏఎస్‌క్యూ) ప్రోగ్రామ్ ద్వారా ప్రయాణికుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా, స్మూత్, వెల్‌కమింగ్, హైక్వాలిటీ అరైవల్స్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించ డంలో ఎక్సలెన్స్‌ను గుర్తిస్తూ, హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ ఏసీఐ ఏఎస్‌క్యూ కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ అవార్డు 2025-బెస్ట్ ఎయిర్‌పోర్ట్స్ ఎట్ అరైవల్స్ గ్లోబల్లీ'ను అందుకుంది.

# నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో రెండున్నరేళ్ల బాలుడి కిడ్నాప్

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం ఉదయం వేదాన్ష్ అనే రెండున్నరేళ్ల బాలుడిని చాక్లెట్ ఆశచూపి ఇద్దరు వ్యక్తులు అపహరించారు. తన భార్యను కాన్పు కోసం ఓ వ్యక్తి ఇదే ఆసుపత్రిలో రెండు రోజుల క్రితం చేర్పించాడు. ఆమెకు కు మార్తె జన్మించింది. తల్లి బిడ్డ ఆరోగ్యంగా వుండగా వారిని చూసేందుకు ఆ వ్యక్తి రెండున్నరేళ్ల తన కుమారుడితో కలిసి శనివారం ఉదయం ఆ సుపత్రికి వచ్చాడు. భార్యను చూసేందుకు వార్డులో వెళ్లగా అతని కుమారుడు బయట ఆడుకుంటున్నాడు. భార్యను చూసి వచ్చేసరికి కుమారు డు కనిపించలేదు. దీంతో కంగారు పడ్డ ఆ వ్యక్తి తన కుమారుడి కోసం ఎంత గాలించినా ప్రయోజనం లేకపోవడంతో వెంటనే నిజామాబాద్ ప ట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు వెంటనే రంగంలో దిగిన పోలీసులు సిసి కెమెరాలను పరిశీలించగా ఒక ఆడ, మరో మగ వ్యక్తి ఆ బాలుడిని అప హరించినట్లు తేలింది. సిసి కెమెరాల ఆధారంగా గాలింపు ముమ్మరం చేశారు. బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ఆటో స్టాండ్లలో గాలింపు చేబట్టా రు. కిడ్నాప్ అయిన బాలుడిని ఇద్దరు వ్యక్తులు హైదరాబాద్‌కు రైల్లో తరలించి వుంటారని భావించిన పోలీసులు కా చిగూడ, సికింద్రాబాద్, నాం పల్లి రైల్వే పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో పాటు మహారాష్ట్ర లోని నాందెడ్, ధర్మాబాద్ స్టేషన్ల పోలీసుల ను కూడా అప్రమత్తం చేశారు. దుండగుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలో దించారు.

# ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్యానికి పునాది: తెలంగాణ సిఎం రేవంత్

**కొడంగల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని పేర్కొంటూ అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా అప్రమత్తంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నేపథ్యంలో శనివారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని నివాసంలో కార్యకర్తలు, స్థానిక నాయకులతో నిర్వహించిన సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి చేసిన వాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించు కున్నాయి. సిఎం సొంత నియోజకవర్గం కొడంగల్ నుంచే దేశ రాజకీ యాలకు కీలక సందేశం ఇచ్చారు. ఓటర్ల జాబితా సవరణను కేవలం రాజకీయ అంశంగా కాకుండా ప్రజల ఓటు హక్కుతో ముడిపడిన అంశగా చూడాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను పరిశీ లించాలని, అర్హులైన వారి పేర్లు జాబితాలో ఉన్నాయా లేదా అన్నది క్షేత్రస్థాయిలో నిర్ధారించుకోవాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కొడంగల్ ప్రజలు నన్ను గుండెల్లో పెట్టుకోవడం వల్లే జాతీయ స్థాయిలో కొడంగల్ నియోజకవర్గానికి ఈ గుర్తింపు, గౌరవం వచ్చిందన్నారు. ఎస్ఐఆర్‌ను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించే ప్రయత్నాలు జరుగుతు న్నాయని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఎస్ఐఆర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఓట్లను తొలగించే కుట్ర చేస్తుందని ఆరోపించారు.

# ఎక్స్‌పోర్ట్ హబ్‌గా తెలంగాణ

## 31 జిల్లాల్లో డిస్ట్రిక్ట్ హబ్‌లు

## స్థానిక ఉత్పత్తులకు గ్లోబల్ గుర్తింపు

## వరల్డ్ మార్కెట్లకు ఉత్పత్తుల అనుసంధానం

## హన్మకొండ, భువనగిరి మినహా అన్ని జిల్లాలు ఎంపిక

## రాష్ట్ర ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ఎక్స్‌పోర్ట్ హబ్‌గా తెలంగాణ ఉత్పత్తులు గ్లోబల్ గుర్తింపు పొందనున్నాయి. తెలంగాణ జిల్లాలను అంతర్జాతీయ ఎగుమతి కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 31 జిల్లాలను డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ హబ్ కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. హనుమకొండ, భువనగిరి మినహా అన్ని జిల్లాలు ఈ గ్లోబల్ మార్కెట్ల అనుసంధానికి ఎంపికయ్యాయి. ఈ మేరకు కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించింది. స్థానికంగా ప్రపంచ స్థాయి సామర్థ్యం ఉన్న ఉత్పత్తులు, సేవలను గుర్తించి గ్లోబల్ మార్కెట్లకు అనుసంధానించే సమ్మిళిత ఎగుమతి వృద్ధి కార్యక్రమం ఈ పథకం ప్రధాన లక్ష్యం. గతంలోని ఒక జిల్లా ఒక ఉత్పత్తి కార్యక్రమం అమలవు తుండగా, దాన్ని విస్తరించి కొత్తగా డిస్ట్రిక్ ఎక్స్‌పోర్ట్ హబ్ కార్యక్రమాన్ని అమలు చేయ నున్నారు. రాష్ట్రస్థాయిలో సీఎస్ అధ్యక్షతన, జిల్లాల్లో కలెక్టర్ల అధ్యక్షతన ఎగుమతి ప్రోత్సాహక కమిటీలు ఏర్పడి స్థానిక ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్, ఎగుమతి అవకాశాలు కల్పించనున్నాయి. ఇందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం జిల్లాల వారీగా ఎగుమతులకు అనువైన ఉత్పత్తుల జాబితాను కేంద్రానికి పంపింది.

రాష్ట్రం నుంచి పంపిన ప్రతిపాదనలను పరిశీలించిన కేంద్రం హనుమకొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలు మినహా మిగిలిన 31 జిల్లాలను డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ హబ్ కార్యక్రమం కింద ఎంపిక చేసింది. ప్రతి జిల్లాలో స్థానికంగా ప్రధానంగా ప్రత్యేకత కలిగిన ఉత్పత్తులు, సేవలను గుర్తించి వాటికి బ్రాండింగ్, మార్కెటింగ్, నాణ్యత ప్రమాణాలు, ఎగుమతి అవకాశాలను కల్పించనున్నారు.

జిల్లాల వారీగా ఎంపిక చేసిన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సంబంధిత సంస్థలు, పరిశ్రమలు, ఎగుమతిదారులను ఒకే వేదికపైకి తీసుకురానున్నారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసేందుకు రాష్ట్రస్థాయిలో ఎగుమతి ప్రోత్సాహక కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఈ కమిటీ పనిచేస్తుంది. జిల్లాల స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఎగుమతి ప్రోత్సాహక కమిటీలను ఏర్పాటు చేస్తారు. జిల్లాల్లో ఎగుమతులకు అనువైన ఉత్పత్తులకు గాను ఎంపికైనా స్థానిక ఉత్పత్తులకు సంబంధించిన జాబితాలో కొత్తగూడెం జిల్లాలో స్పాంజ్ ఐరన్, అటవీ ఉత్పత్తులు, మిర్చి, ఆదిలాబాద్‌లో డ్వాక్రా కళోత్పత్తులు, సోయాబీన్, ఫర్నిచర్, పత్తి, హైదరాబాద్‌లో రత్నాలు, ఆభరణాలు, ముత్యాలు, భూపాలపల్లిలో మిరప, చెక్క కళాకృతులు, గద్వాలలో చేనేత చీరలు, కామారెడ్డిలో కోడి మాంసం, ఆయిల్‌పామ్, కోడిగుడ్లు, జగిత్యాలలో మామిడి, బియ్యం, పసుపు, బంగారు ఆభ రణాలు, జనగామలో బియ్యం, ఇత్తడి కళాఖండాలు, పెంబర్తి లోహకళ, కరీంనగర్‌లో బియ్యం, వెండి ఫిలిగ్రీ, గ్రానైట్, ఖమ్మంలో మామిడి, మిరప, గ్రానైట్, బొగ్గు, ఆసిఫాబాద్‌లో పత్తి, చిరుధాన్యాలు, మహబూబాబాద్‌లో మామిడి, పసుపు, మిరప, మంచిర్యాలలో మామిడి, పత్తి, మహబూబ్ నగర్‌లో మామిడి, జొన్న, జనరల్ ఇంజినీరింగ్, ఫ్యాబ్రికేషన్, ఖనిజాలు, మెదక్ జిల్లాలో టెక్స్‌టైల్స్‌కు సంబంధించిన ఉత్పత్తులు వరల్డ్ గ్లోబల్ మార్కెట్లకు అనుసంధానం కానున్నాయి.

6-9pg10:6-9pg10.qxd 9/5/2026 11:46 PM Page 1





# మహిళల హాకీ ఆసియా కప్: భారత్ విజయంతో ప్రారంభం

## దక్షిణ కొరియాపై 4-1 తేడాతో గెలుపు

**మోకి:** మహిళల జూనియర్ ఆసియా కప్‌ను దక్షిణ కొరియాపై భారత్ ఘన విజయంతో ప్రారంభించింది. శనివారం మోకిలో జరిగిన తమ ప్రారంభ మ్యాచ్‌లో దక్షిణ కొరియాపై 4-1 తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ తరఫున సానికా చంద్రకాంత్ మానే, పూర్ణిమా యాదవ్, పూజా సాహూ, మధు సిదర్ గోల్స్ చేశారు. భారత్ బలంగా ప్రారంభించి, తొలి పావుగంటలో అనేక అవకాశాలను సృష్టించుకోవడంతో 8వ నిమిషంలో ఫలించింది. సానికా చంద్రకాంత్ మానే గోల్ చేసి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించింది. తదుపరి తొలి పావుగంటలో భారత్ రెండు పెనాల్టీ కార్నర్‌లను సంపాదించగా ఆ రెండు అవకాశాలను కూడా గోల్స్‌గా మలచలేకపోయింది. రెండవ క్వార్టర్ మొదటి ఐదు నిమిషాల్లోనే మరో పెనాల్టీ కార్నర్‌ను సంపాదించినా, దక్షిణ కొరియా రక్షణ పటిష్టంగా నిలిచింది. క్వార్టర్ చివరి క్షణాల్లో 30వ నిమిషంలో పూర్ణిమా యాదవ్ గోల్ చేసి భారత్ ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. దీంతో డిఫెండింగ్ ఛాంపియన్లు 2-0 ఆధిక్యంతో హాఫ్ టైంకు వెళ్లారు. మూడవ క్వార్టర్‌లో మరో పెనాల్టీ కార్నర్ లభించగా, పూజా సాహూ గోల్ చేసి స్కోరును 3-0కి చేర్చింది. ఆఖరి క్వార్టర్‌లో కూడా భారత్ మరో పెనాల్టీ కార్నర్ లభించినా దక్షిణ కొరియా ఆ ప్రయత్నాన్ని విజయవంతంగా అడ్డుకుంది. 51వ నిమిషంలో మధు సిద్ధర్ గోల్ చేసి ఆధిక్యాన్ని 4-0కి పెంచడంతో, భారత ఒత్తిడి చివరికి ఫలించింది. దక్షిణ కొరియా ఆఖరి విజిల్ వరకు పోరాడి, 57వ నిమిషంలో ఒక గోల్‌ను తిరిగి సాధించింది. చివరకు భారత్ పట్టుదలతో పోరాడి 4-1 తేడాతో విజయం



# వాలీబాల్ ఛాంపియన్‌షిప్: తొలి మ్యాచ్‌లో చైనా చేతిలో భారత్ ఓటమి

**జపాన్:** పురుషుల వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో హోరాహోరీగా జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్, చైనా చేతిలో స్ట్రెయిట్ సెట్స్‌లో ఓటమి పాలైంది. శనివారం చైనాతో జరిగిన ఈ వాలీబాల్ కాంటినెంటల్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ 0-3 తేడాతో ఓటమిని చవిచూసింది. అయితే, జపాన్‌లోని కితాక్యూషు సిటీ జనరల్ జిమ్నాసియంలో జరిగిన పూల్ బి పోటీలో, తమ కంటే ఉన్నత ర్యాంకులో ఉన్న ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చింది. చివరి దశలలో చైనా సంయమనం పాటించడంతో, రెండవ, మూడవ సెట్లు నిర్ణీత పాయింట్లను దాటి సాగడంతో భారత్ 21-25, 26-28, 25-27 తేడాతో ఓడిపోయింది. ఈ ఫలితంతో, పూల్ బిలో ఇరాన్, న్యూజిలాండ్‌లతో జరగనున్న మిగిలిన మ్యాచ్‌లలో భారత్ గట్టిగా పుంజుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అయితే, జూన్‌లో అహ్మదాబాద్‌లో జరిగిన ఏవీసీ పురుషుల వాలీబాల్ కప్‌లో కాంస్యం గెలుచుకోవడంతో భారత్ ఈ టోర్నమెంట్‌లోకి ఆత్మవిశ్వాసంతో అడుగుపెట్టింది. ఆ టోర్నమెంట్ పూల్ దశలో భారత్ 5-0 రికార్డుతో అజేయంగా నిలిచి, కాంస్య పతకం కోసం జరిగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ బ్రహ్రెయిన్‌ను 3-1 తేడాతో ఓడించింది. అంతకుముందు ఇండోనేషియాతో జరిగిన ఉత్కంఠభరితమైన సెమీఫైనల్‌లో వారు 2-3 తేడాతో ఓడిపోయారు. ఈ పరిస్థితుల్లో భారత్ కీలకమైన ఇరాన్ పరీక్షను ఎదుర్కొంటోంది. ఇందులో గెలిచిన వారు 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్ క్రీడలలో జరిగే పురుషుల వాలీబాల్ పోటీకి నేరుగా అర్హత సాధిస్తారు. భారత్, చైనా, ఇరాన్, న్యూజిలాండ్‌లతో పాటు కఠినమైన పూల్ బిలో ఉంది.

# దులీప్ ట్రోఫీ: నేడే ఫైనల్ సమరం

## ఈస్ట్, సౌత్ మధ్య హోరాహోరీ పోరు

**చెన్నై:** దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ సమరంలో భాగంగా సౌత్ జోన్, ఈస్ట్ జోన్ జట్లు ఢీకొట్టబోతున్నాయి. ఈ నెల 6న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియం (చెపాక్) వేదికగా రెండ్‌బాల్ మ్యాచ్ జరగనుంది. టైటిల్ కైవసం చేసుకునేందుకు రెండు జట్లు దూకుడు




కనపరుస్తున్నాయి. ఈ ఫైనల్ పోరుకు ముందు సౌత్ జోన్ జట్టుకు భారీ ఊరట లభించింది. మరోపక్క 14 సంవత్సరాల క్రితం ఇదే వేదికపై చివరి టైటిల్ గెలుచుకున్న ఈస్ట్ జోన్ దులీప్ ట్రోఫీ ఫైనల్ కోసం చెన్నైకి తిరిగి వస్తోంది చరిత్ర అడుగుజాడలను తిరగరాయాలని చూస్తుంది. ఇటీవల శ్రీలంకతో టెస్టు సిరీస్ ఆడి వచ్చిన స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్, బ్యాటర్ దేవదత్ పడిక్కల్ తిరిగి సౌత్ జోన్ జట్టులోకి వచ్చారు. మరో ఇద్దరు స్టార్లతో పాటు సూర్యవంశీ ప్రాతినిధ్యంపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ ఫైనల్ మ్యాచ్ కోసం సౌత్ జోన్ స్క్వాడ్‌ను మరింత బలోపేతం చేశారు. శ్రీలంకతో ముగిసిన రెండు టెస్టుల సిరీస్‌లో పాల్గొన్న హైదరాబాదీ పేసర్ మహమ్మద్ సిరాజ్, యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ సౌత్ జోన్ జట్టులో చేరారు. వీరిద్దరి చేరికతో సౌత్ జోన్ బౌలింగ్, బ్యాటింగ్ విభాగాలు మరింత బలంగా మారాయి. కేఎల్ రాహుల్ కూడా ఈ ఫైనల్లో ఆడతాడని ప్రచారం జరిగినప్పటికీ, అతడి పాల్గొనడంపై ఇంకా ఎలాంటి అధికారిక సమాచారం వెలువడలేదు. సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ, ఈస్ట్ జోన్ సారథి ఇషాన్ కిషన్ ఫైనల్ మ్యాచ్ ఆడటంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ ఇరువురు ఆటగాళ్లు ఈ నెల 13 నుంచి అఫ్గానిస్థాన్‌తో జరిగే మూడు టీ20ల సిరీస్‌కు ఎంపికయ్యారు. కాగా డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్ను సెమీఫైనల్లో ఓడించి ఫైనల్కు దూసుకొచ్చిన ఇషాన్ కిషన్ నేతృత్వంలోని ఈస్ట్ జోన్ జట్టులో అనుభవజ్ఞులైన స్టార్లతో పాటు ఉత్సాహవంతులైన యువ ఆటగాళ్లు ప్రధాన బలంగా నిలిచారు.

కెప్టెన్ ఇషాన్ కిషన్ మిడిలార్డర్‌లో జట్టుకు వెన్నెముకగా నిలుస్తున్నాడు. మహ్మద్ షమీ, ముకేష్ కుమార్ ఈస్ట్ జోన్ బౌలింగ్ విభాగానికి ప్రధాన బలాలు. సెమీఫైనల్‌లో ముకేష్ కుమార్ (మొత్తం మ్యాచ్‌లో 7 వికెట్లు) ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలవగా, షమీ అనుభవం జట్టుకు అదనపు బలాన్ని ఇస్తోంది. టాప్ ఆర్డర్ విషయానికి వస్తే అభిమన్యు ఈశ్వరన్ లాంటి నమ్మకమైన ఓపెనర్లు బ్యాటింగ్ విభాగానికి పటిష్టమైన పునాదిని అందిస్తున్నారు.




# వరల్డ్ టెన్నిస్ టోర్నమెంట్.. శ్రీనితికి డబుల్ స్వర్ణాలు

**బెంగళూరు:** భారత్‌కు చెందిన శ్రీనితి వరల్డ్ టెన్నిస్ జూనియర్ జే30 బెంగళూరు టోర్నమెంట్‌లో బాలికల సింగిల్స్, డబుల్స్ టైటిల్స్ రెండింటినీ గెలుచుకుని స్వర్ణ డబుల్ సాధించింది. బెంగుళూరులోని ఎస్ఎం కృష్ణ టెన్నిస్ స్టేడియంలో శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో 15 ఏళ్ల నాలుగో సీడ్ క్రీడాకారిణి బాలికల సింగిల్స్ ఫైనల్‌లో అహిదా సింగ్‌ను 6-4, 6-2 తేడాతో ఓడించి, ఆ తర్వాత రిద్ధి షిండేతో జతకట్టి డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. బాలికల సింగిల్స్ ఫైనల్‌లో ఆహిదా బలమైన ఆరంభాన్ని కనబరిచింది. మొదటి, మూడవ గేమ్‌లలో శ్రీనితి సర్వ్‌ను బ్రేక్ చేసి 3-0 ఆధిక్యాన్ని సాధించింది. దీనికి ప్రతిస్పందనగా శ్రీనితి దూకుడుగా రిటర్న్‌లు చేస్తూ, నెట్ వద్ద తరచుగా దాడులు చేసింది. 4-4తో స్కోరును సమం చేసిన తర్వాత, తర్వాతి రెండు గేమ్‌లను గెలుచుకుని తొలి సెట్‌ను కైవసం చేసుకుంది. ఆమె ఆ ఊపును రెండవ సెట్‌లోకి కొనసాగించి, ఆరంభంలోనే అహిదా సర్వీస్‌ను బ్రేక్ చేసి, మ్యాచ్‌పై పట్టు సాధించింది. అహిదా తిరిగి పుంజుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, శ్రీనితి సంయమనం కోల్పోకుండా మ్యాచ్‌ను 6-2 తేడాతో ముగించింది. అలాగే హోరాహోరీగా సాగిన డబుల్స్ ఫైనల్‌లో శ్రీనితి-షిండే జోహా జోడీ తమ ప్రత్యర్థి జోడీ ఖురేషీ-దీప్తి వెంకటేశన్‌పై 4-6,6-2, 13-11తో విజయంసాధించింది. ఇకబాలుర సింగిల్స్ ఫైనల్‌లో, ఆరోసీడ్ ఫజల్ అలీమీర్,అమెరికాకు చెందిన మూడోసీడ్ నియంత్ బద్రీనారాయణన్‌ను 6-4,4-6,2-0 తేడాతో ఓడించాడు. నిర్ణయాత్మక సెట్‌లో నియంత్ తొందరగా వైదొలగడంతో ఈ విజయం సాధ్యమైంది.


# యుఎస్ ఓపెన్.. రౌండ్ 2కు శ్రీరామ్

**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్‌లో జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో, ఎన్ శ్రీరామ్ బాలాజీ-అతని అమెరికన్ భాగస్వామి ఇవాన్ కింగ్, డచ్ జంట సాండర్ అరెండ్స్-డేవిడ్ పెల్‌పై 3-6, 7-6(7), 7-6(10) తేడాతో విజయం సాధించే క్రమంలో ఆరు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని అద్భుతంగా తప్పించుకున్నారు. శనివారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో తొలుత ఆరెండ్స్-పెల్, మొదటి సెట్‌ను 6-3తో గెలుచుకుని విజయం దిశగా సాగుతున్నట్లు కనిపించారు. కానీ బాలాజీ, కింగ్ మ్యాచ్‌ను చేజార్చుకోని



వ్వలేదు. వారు రెండవ సెట్ టైబ్రేక్‌లో రెండు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని, నిర్ణయాత్మక సూపర్ టైబ్రేక్‌కు దారితీశారు. మూడవ సెట్‌లో 6-5 ఆధిక్యంలో ఉన్నప్పుడు మూడు మ్యాచ్ పాయింట్లతో సహా, డచ్ జంట మళ్లీ విజయానికి చేరువైనప్పటికీ, బాలాజీ-కింగ్ నెగ్గుకొచ్చారు. నిర్ణయాత్మక టైబ్రేక్‌లో ఇండోఅమెరికన్ ద్వయం చివరికి తమ సంయమనాన్ని కోల్పోకుండా 12-10 తేడాతో గెలిచి, రెండో రౌండ్‌లో స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఆగస్టులో కెరీర్‌లో అత్యుత్తమ డబుల్స్ ర్యాంక్ అయిన 54వ స్థానానికి చేరుకున్న ఈ 36 ఏళ్ల భారత ఆటగాడు, ఈ ఏడాది ఇప్పటికే ఫ్రెంచ్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. రౌండ్ ఆఫ్ 32లో బాలాజీ మరియు కింగ్ తదుపరి మొనాకోకు చెందిన 12వ సీడ్ హ్యూగో నైస్-ఫ్రాన్స్‌కు చెందిన ఎడ్వర్డ్ రోజర్‌వాసెలిన్‌లను ఎదుర్కొంటారు. ఈ సీడెడ్ జంట ఇప్పటికే తమ తొలి మ్యాచ్‌లో విజయం సాధించింది.

# రూ.980 కోట్ల రుణాల వ్యవహారంలో సుభాష్ చంద్రపై సిబిఐ కేసు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్‌నుంచి సుమారు రూ.980 కోట్ల రుణాలు పొందిన వ్యవహారంలో జీగ్రూప్‌ఛైర్మన్ సుభాష్ చంద్రపై సిబిఐ కేసు నమోదుచేసింది. ఈ రుణాల కారణంగా తమకు మొత్తం సుమారు రూ.1,322 కోట్ల నష్టం వాటిల్లిందని ఎల్ఐసి హెచ్ఎఫ్ఎల్ సిబిఐకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.నేరపూరిత కుట్ర, మోసం, నమ్మకద్రోహం, అనుచిత ప్రయోజనాలు కల్పించడంవంటి ఆరోపణలపై సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఎల్ఐసిహెచ్ఎఫ్ఎల్ ప్రధాన కార్యాలయం నుంచి అందిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైంది.రెండు రుణ సదుపాయాలు.. రూ.980 కోట్లు వివిధ రుణగ్రహీత సంస్థలకు ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ మంజూరు చేసిన రెండు రుణ సదుపాయాలకు సంబంధించినదని వెల్లడించింది. మొదటి రుణం సుమారు రూ.500 కోట్లు. వసంత్ సాగర్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, దాని సహ రుణగ్రహీత పాన్ ఇండియా ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు వ్యాపార విస్తరణ కోసం టేకోవర్ అండ్ టాప్‌అప్ ఫెసిలిటీ కింద మంజూరు చేశారు. అనంతరం ఈ రుణం నిరర్థక ఆస్తిగా (ఎన్‌పీఏ) మారింది. బకాయి మొత్తం సుమారు రూ.570.50 కోట్లకు చేరింది.రెండో రుణ సదుపాయం సుమారు రూ.480 కోట్లు. డిజిటల్ సబ్‌స్క్రైబర్ మేనేజ్‌మెంట్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, దాని సహ రుణగ్రహీత స్పిరిట్ ఇన్‌ఫ్రా పవర్ అండ్ మల్టీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అద్దె ఆదాయాన్ని ఆధారంగా చేసుకుని ఈ రుణాన్ని మంజూరు చేశారు. ఈ రుణం కూడా అనంతరం ఎన్‌పిఏగా మారింది. బకాయి మొత్తం సుమారు రూ.507.25 కోట్లుగా ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎల్ఐసి హెచ్ఎఫ్ఎల్ ఫిర్యాదు ప్రకారం, రూ.500 కోట్ల రుణానికి సుభాష్ చంద్ర 2018 మార్చి 28న వ్యక్తిగత హామీ ఇచ్చారు. రుణం మంజూరు ప్రక్రియలో భాగంగా తన నికర ఆస్తుల విలువకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని కూడా సమర్పించారు.2018 మార్చి 28న డిఐఎం అండ్ కో జారీ చేసిన ఆ ధ్రువీకరణ పత్రంలో 2017 మార్చి 31 నాటికి సుభాష్ చంద్ర నికర ఆస్తుల విలువ 6,197.62 మిలియన్ డాలర్లు, అంటే సుమారు రూ.59,113 కోట్లుగా పేర్కొన్నారు.రెండో రుణానికి సంబంధించి ఎల్ఐసి హెచ్ఎఫ్ఎల్‌కు సమర్పించిన మరో నికర ఆస్తుల ధ్రువీకరణ పత్రంలో చంద్ర ఆస్తుల విలువ సుమారు రూ.40,562 కోట్లుగా పేర్కొన్నారు. చార్టర్డ్ అకౌంటెంట్లు ఎంపిజె అండ్ కో ఈ పత్రాన్ని 2018 జూలై 6న జారీ చేశారు. రుణాలు పొందేందుకు ఈ నికర ఆస్తుల విలువలను భారీగా పెంచి చూపించిన ధ్రువీకరణ పత్రాలను ఉపయోగించారని ఎల్ఐసి హెచ్ఎఫ్ఎల్ ఆరోపించింది. దివాలా మరియు దివాళా చట్టం (ఐబిసి) కింద సుభాష్ చంద్రపై వ్యక్తిగత దివాలా ప్రక్రియ ప్రారంభమైందని ఎల్ఐసి హెచ్ఎఫ్ఎల్ ఫిర్యాదులో పేర్కొంది.



# సావరిన్ గోల్డ్‌బాండ్లకు భారీ రిటర్నులు

**ముంబయి, సెప్టెంబరు 5:** సావరిన్ గోల్డ్ బాండ్లలో పెట్టుబడి పెట్టిన వారికి భారీ లాభం వచ్చింది. 2021-22 సిరీస్ ఆరోసిరీస్ బాండ్ల ముందస్తు రిడెంప్షన్ ధరను రిజర్వుబ్యాంకు రూ.15,334గా నిర్ణయించింది. ఈ బాండ్లను 2026 సెప్టెంబర్ 7నుంచి ముందుగానే వెనక్కి తీసుకునే అవకాశం ఉంది. 2021 సెప్టెంబర్‌లో జారీచేసిన ఈ ఎస్‌జిబిసిరీస్ ఆన్‌లైన్ కొనుగోలు దారులకు గ్రాము రూ.4,682 ధరకు లభించింది. ప్రస్తుతరిడెంప్షన్ ధరతోపోలిస్తే గ్రాముకు రూ.10,652 లాభం వస్తుంది. అంటే దాదాపు 228శాతం రాబడి. వడ్డీని ఇందులో లెక్కించలేదు. 2021లో ఈ సిరీస్‌లో రూ.1 లక్ష పెట్టుబడి పెట్టినట్లయితే బాండ్ విలువ ఇప్పుడు దాదాపు రూ.3.28 లక్షలకు చేరుతుంది. ఇది 228 శాతం మూలధన రాబడిని సూచిస్తుంది. దీనికి అదనంగా ఎస్‌జిబిపై యేడాదికి 2.50 శాతం వడ్డీ కూడా లభిస్తుంది. వడ్డీని ఆరు నెలలకు ఒకసారి చెల్లిస్తారు. ఐదేళ్లు పూర్తైన తర్వాత వడ్డీ చెల్లించేతేదీన మాత్రమే ఎస్‌జిబి ముందస్తు రిడెంప్షన్ చేయవచ్చు. రిడెంప్షన్ ధరను నిర్ణయించేందుకు ముందు మూడు పనిదినాల్లో 999 స్వచ్ఛత బంగారం ముగింపు ధరల సగటును తీసుకుంటారు. సెప్టెంబర్ 7న జరగనున్న రిడెంప్షన్‌కు సెప్టెంబర్ 2,3, 4 ధరలను పరిగణనలోకి తీసుకున్నారు.

# ఎఐ బూమ్‌తో 15.1 లక్షలకోట్ల డాలర్లకు బిలియనీర్ల సంపద




**ముంబయి, సెప్టెంబరు 5:** కార్పొరేట్‌రంగంలో వెల్లువలా వచ్చిన కృత్రిమమేధ బూమ్‌తో బిలియనీర్ల సంపద 15.1 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది. అలాగే బిలియనీర్ల సంఖ్య 2025లో రికార్డు స్థాయికి చేరుకుంది. వెల్త్ ఇంటెలిజెన్స్ సంస్థ ఆల్ట్రాటా విడుదల చేసిన నివేదిక ప్రకారం 2025లో ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల సంఖ్య 3,795కు చేరుకోగా, వారి మొత్తం సంపద 15.1 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది. 2025లో బిలియనీర్ల సంపద 12.8 శాతం పెరిగింది. అదే సమయంలో బిలియనీర్ల సంఖ్య 8.2 శాతం పెరిగింది. ఎఐ రంగంలో వృద్ధి, టెక్నాలజీ షేర్ల మెరుగైన పనితీరు బిలియనీర్ల సంపద పెరుగుదలకు దోహదపడ్డాయి.బిలియనీర్ల సంపద పెరుగుదలకు గణనీయంగా దోహదపడిన 150 లిస్టెడ్ కంపెనీలను ఆల్ట్రాటా గుర్తించింది. గత ఐదేళ్లలో కనీసం 30 మిలియన్ డాలర్లను ఎఐలో పెట్టుబడి పెట్టిన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ 2024-25 మధ్యకాలంలో ఎఐలో ఇలాంటి పెట్టుబడులు చేయని కంపెనీలతో పోలిస్తే 23 శాతం అధికంగా పెరిగినట్లు నివేదిక వెల్లడించింది. ఎఐతో అనుసంధానమైన టెక్నాలజీ షేర్ల అద్భుతమైన పనితీరు భారీ సంపదలను సృష్టించింది. 50 బిలియన్ డాలర్లకు పైగా సంపద కలిగిన 29 మందిని ఆల్ట్రాటా సూపర్ బిలియనీర్లుగా పేర్కొంది. వీరి మొత్తం సంపద 4.1 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ప్రపంచంలోని బిలియనీర్ల మొత్తం సంపదలో ఇది దాదాపు 27 శాతానికి సమానం. 2017లో 50 బిలియన్ డాలర్లకు పైగా సంపద కలిగిన వారు కేవలం 10 మంది మాత్రమే ఉండగా, వారి వద్ద ప్రపంచ బిలియనీర్ల సంపదలో 7.2 శాతం మాత్రమే ఉండేది. ఎఐ రంగంపై మార్కెట్ అంచనాలు, ఆల్ట్రాటా థాట్ లీడర్‌షిప్ అండ్ అనలిటిక్స్ విభాగం అధిపతి మాయా ఇంబర్గ్ మాట్లాడుతూ మార్కెట్‌లో సంపద ఒకే రంగంలో కేంద్రీకృతం కావడం తప్పనిసరిగా బబుల్‌కు సంకేతం కాదని అన్నారు. టెక్నాలజీ రంగం పైనే, అందులోనూ ఎఐపై అధికంగా ఆధారపడటం వల్ల ముప్పు ఉంటుందని పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యధిక మంది బిలియనీర్లు ఉన్న ప్రాంతంగా ఉత్తర అమెరికా కొనసాగింది. ఈ ప్రాంతంలో బిలియనీర్ల సంఖ్య 11.6 శాతం పెరిగి 1,337కు చేరుకుంది. అమెరికా ప్రైవేట్, పబ్లిక్ టెక్నాలజీ మార్కెట్లలో బలమైన స్థానాన్ని కలిగి ఉండటంకూడా ఈవృద్ధికి కారణమని ఆల్ట్రాటా తెలిపింది. యూరప్‌లో బిలియనీర్ల సంఖ్య 7.9శాతం పెరిగి 1,081కు చేరుకుంది. ఆసియాలో 6.5 శాతం వృద్ధితో బిలియనీర్ల సంఖ్య 881గా నమోదైంది. ప్రపంచ బిలియనీర్లలో మహిళల వాటా 13 శాతంగా ఉంది.అత్యధిక మంది బిలియనీర్లు స్వయంగా తమ సంపదను నిర్మించుకున్నవారే. పూర్తిగా వారసత్వంగా సంపదను పొందిన బిలియనీర్లు కేవలం 8 శాతం మాత్రమే ఉన్నట్లు ఆల్ట్రాటా నివేదిక వెల్లడించింది.

# బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.10.5 లక్షలకోట్ల మిగులు

**ముంబయి, సెప్టెంబరు 5:** దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు నగదు రికార్డు స్థాయికి చేరింది. దీంతో దీన్ని నియంత్రించేందుకు భారతీయ రిజర్వు బ్యాంకు తక్షణచర్యకు సిద్ధమైంది. సోమవారం రూ.ఏడు లక్షల కోట్లను 30 రోజుల పాటు బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి వెనక్కి తీసుకునేందుకు వేరియబుల్ రేట్ రివర్స్ రెపో వేలం నిర్వహించనున్నట్లు ఆర్‌బిఐ ప్రకటించింది. ఇటీవల నిర్వహించిన లిక్విడిటీ ఆపరేషన్లతో పోలిస్తే ఇది ఎక్కువ కాలం ఉండే చర్య. గతంలో గరిష్ఠంగా 15 రోజుల వరకు మిగులు నగదును తీసుకునేలా వేలం నిర్వహించారు. ఇప్పుడు 30 రోజుల పాటు నిధులను ఆర్‌బీఐ వద్ద ఉంచే అవకాశం ఉంది. దీంతో స్వల్పకాలిక మనీ మార్కెట్‌పై కేంద్ర బ్యాంకుకు మరింత నియంత్రణ లభించనుంది. ప్రస్తుతం దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో దాదాపు




రూ.10.5 లక్షల కోట్ల మిగులు నగదు ఉన్నట్లు అంచనా. విదేశాల్లో ఉన్న భారతీయులు బ్యాంకుల్లో భారీగా డాలర్ డిపాజిట్లు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

ఆ విదేశీ కరెన్సీని ఆర్‌బిఐ రూపాయల్లోకి మార్చడంతో బ్యాంకింగ్ వ్యవస్థలోకి పెద్ద మొత్తంలో నగదు వచ్చింది. విదేశాల్లో ఉన్న భారతీయుల నుంచి డాలర్ డిపాజిట్లను ఆకర్షించేందుకు ఆర్‌బిఐ తీసుకొచ్చిన పథకం భారీగా విజయవంతమైంది. ఆగస్టులో పథకం ముగిసే సమయానికి రికార్డు స్థాయిలో 127 బిలియన్ డాలర్లు సమీకరించారు.

నిర్ణీత గడువు కంటే నెల ముందుగానే ఈ పథకాన్ని ముగించారు. బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థలకు కల్పించిన ఇతర రుణ సదుపాయాలతో కలిపి ఆర్థిక వ్యవస్థలోకి దాదాపు 136.4 బిలియన్ డాలర్లు వచ్చాయి. భారీగా నగదు రావడం వల్ల బ్యాంకుల మధ్య రాత్రికి రాత్రి జరిగే రుణాల వడ్డీ రేట్లు కూడా తగ్గుతున్నాయి. ప్రస్తుతం వెయిటెడ్ యావరేజ్ కాల్ రేట్ ఆర్‌బిఐ పాలసీ రేటు కంటే దిగువకు చేరింది. మిగులు నగదును క్రమంగా వెనక్కి తీసుకుంటూ మార్కెట్లపై ప్రభావం పడకుండా చూడటం ఇప్పుడు ఆర్‌బీఐ ముందున్న ప్రధాన సవాలుగా మారింది.

# మార్కెట్‌లోకి 12 కొత్త ఫండ్ ఆఫర్లు




**ముంబయి, సెప్టెంబరు 5:** మ్యూచువల్ ఫండ్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి, పోర్ట్ ఫోలియోను వైవిధ్యపరుచుకోవాలనుకునే ఇన్వెస్టర్లకు అసలైన సమయం వచ్చింది. ప్రస్తుతం మార్కెట్లో వివిధ ఫండ్ హౌస్‌లు ప్రారంభించిన 12 కొత్త ఫండ్ ఆఫర్లు సబ్‌స్క్రిప్షన్ కోసం అందుబాటులోకి వచ్చాయి. వివిధ కేటగిరీలకు చెందిన ఈ ఎన్ఎఫ్ఒలలో ఇండెక్స్ ఫండ్లు, థిమాటిక్ ఫండ్లు, స్థిరమైన రాబడులు ఇచ్చే డెట్ ఫండ్లు అందుబాటులో ఉన్నాయి. తక్కువ ధరలో అంటే యూనిట్ విలువ రూ.10ల ప్రాథమిక ధరతో కూడా వచ్చే న్యూఫండ్ ఆఫర్లు ఉన్నాయి. మార్కెట్ సూచీలైన నిఫ్టీ, సెన్సెక్స్ ట్రాకింగ్ ఆధారంగా తక్కువ నిర్వహణ వ్యయంతో పని చేసే అనేక ప్యాసివ్ ఇండెక్స్ ఫండ్లు ఈ లిస్టులో ఉన్నాయి. డిజిటల్ ఇండియా, ఇన్నోవేషన్, కన్జంప్షన్ రంగాలను లక్ష్యంగా చేసుకుని పనిచేసే ప్రత్యేక థిమాటిక్ ఫండ్లు సైతం ఇందులో ఉన్నాయి. మార్కెట్ హెచ్చుతగ్గుల నుంచి రక్షణ కోరుకునే ఇన్వెస్టర్ల కోసం తక్కువ రిస్క్ కలిగిన ఫిక్స్‌డ్ ఇన్‌కమ్, హైబ్రిడ్ ఆప్షన్లు సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. సాధారణంగా వీటిల్లో కనీస పెట్టుబడి రూ.100 నుంచి రూ.5000 మధ్య ఉంటుంది. లైఫ్ సైకిల్ ఫండ్స్ కేటగిరీలో ఐసిఐసిఐ ప్రూ లైఫ్ సైకిల్ ఫండ్ 2031 ఐసిఐసిఐ ప్రూ లైఫ్ సైకిల్ ఫండ్ 2036, ఐసిఐసిఐ ప్రూ లైఫ్ సైకిల్ ఫండ్ 2041, జెరోధా లైఫ్ సైకిల్ ఫండ్ 2031,న్యూ ఫండ్ ఆఫర్స్ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభించాయి. ఈ మూడు పథకాలు సెప్టెంబర్ 9, 10 తేదీల్లో సబ్‌స్క్రిప్షన్ ముగించనున్నాయి. ఇండెక్స్ ఫండ్స్ కేటగిరీలో యుటిఐ బిఎస్ఇ ఇండియా సెక్టార్ లీడర్స్ ఇండెక్స్ ఫండ్, నావీ నిఫ్టీ ఆర్ఇటిఎస్ అండ్ రియాల్టీ ఇండెక్స్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభించాయి. ఈరెండు ఫండ్లు ఈనెల 10, 11 తేదీల్లో సబ్‌స్క్రిప్షన్ ముగించనున్నాయి. పాసివ్ ఫండ్స్ కేటగిరీలో యుటిఐ బిఎస్ఇ ఇండియా లీటర్స్ ఇటిఎఫ్, ఐసిఐసిఐ ప్రూడెన్షియల్ డైనమిక్ అసెట్ అలకేషన్ పాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఇప్పటికే ప్రారంభం కాగా ఈ 2 ఫండ్లు ఈనెల 9, 11 తేదీల్లో సబ్‌స్క్రిప్షన్ ముగించనున్నాయి. మల్టీ క్యాప్ కేటగిరీ నుంచి ద వెల్త్ కంపెనీ మల్టీ క్యాప్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ కోసం వచ్చింది. సెప్టెంబరు 10వ తేదీ వరకు కొనసాగనుంది. మోనార్క్ ఓవర్‌నైట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 7వ తేదీతో ముగుస్తుంది. థిమాటిక్ ఫండ్ కేటగిరీ నుంచి మోతీలాల్ ఓస్వాల్ క్వాలిటీ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ కోసం వచ్చింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# నోరూరించే పచ్చళ్లు

దోర వెక్కాయకి కాసింత జీలకర్ర ఇన్ని పచ్చి మిరపకాయలు చేర్చి రోట్లో దంచితే.. నోరూరకుండా ఉంటుందా? పైనాపిల్‌ని ముక్కలుగా కోసి ఎవరైనా తింటారు. అదే ఎండుమిర్చి వేసి పచ్చడి చేసి చూడండి. ఇన్ని రోజులూ ఇకఎందుకు తినలేదా అనిపిస్తుంది. ఇవే కాదు పండ్లతో చేసే పచ్చళ్లు ఇంకా బోలెడు ఉన్నాయి. అందులో ఇకొ కొన్ని ..

## వెలక్కాయ రోటి పచ్చడి



పచ్చి వెలక్కాయ-ఒకటి, జీలకర్ర-అరచెంచా, మినపప్పు-చెంచా, మెంతి గింజలు-నాలుగు, పచ్చిమిర్చి-రెండు, ఎండు మిరపకాయలు-నాలుగు, ఇంగువ-పావుచెంచా, ఉప్పు-తగినంత, బెల్లం-కొద్దిగా (నచ్చితే), పసుపు-పావుచెంచా, నూనె-రెండు చెంచాలు, కరివేపాకు-రెబ్బ.

**తయారీ :** వెలక్కాయ గుజ్జు తీసుకుని పక్కన పెట్టుకోవాలి. స్టౌ వెలిగించి పాన్‌లో నూనెపోసి అందులో ఎండు మిర్చి, మెంతి గింజలు, ఇంగువ, జీలకర్ర, మిన పప్పు, కరివేపాకు వేసి వేయించుకోవాలి. నూనె తప్పించి తక్కిన తిరగమోత గింజలని ఒక పాత్రలోకి తీసుకోవాలి. ఇప్పుడు ఆ మిగిలిన నూనెలో వెలక్కాయ గుజ్జు వేసి మూతపెట్టి మగ్గపెట్టుకోవాలి. పచ్చిగా ఉంటే కొద్దిగా నీళ్లు, ఉప్పు వేస్తే త్వరగా మగ్గిపోతుంది. మిక్సీ లేదా రోట్లో ముందుగా తిరగమోత గింజలని దంచి ఆ తర్వాత వెలక్కాయ గుజ్జు వేసి రుబ్బుకోవాలి. నెయ్యి వేసుకుని తింటే అన్నంలోకి చాలా బాగుంటుంది.

## పచ్చి బొప్పాయితో..



పచ్చిబొప్పాయి-ఒకటి, నిమ్మరసం-అరకప్పు, కారం-అరకప్పు, ఉప్పు-పావు కప్పు, ఆవపిండి-పావుకప్పు, తాలింపుకోసం, ఆవాలు, జీలకర్ర, వెల్లుల్లి రెబ్బలు-ఐదారు, కరివేపాకు-రెబ్బ, నూనె-అరకప్పు, మెంతులు-చెంచా.

**తయారీ :** పచ్చి బొప్పాయిని చెక్కుతీసి తడిలేకుండా తుడిచి చిన్నముక్కలుగా కోసి ఎండలో పదినిమిషాలపాటు పెట్టుకోవాలి. తర్వాత స్టౌ వెలిగించి కడాయిలో మెంతులు, జీలకర్ర వేసి దోరగా వేయించి మిక్సీలో మెత్తగా పొడి చేసుకోవాలి. ఒక పాత్రలో తరిగిన బొప్పాయి ముక్కలు, నిమ్మరసం, కారం, ఆవపిండి, ఉప్పు వేసి కలపాలి. ఇప్పుడు స్టౌ వెలిగించి కడాయి పెట్టి, మొత్తం నూనె వేసి అందులో ఆవాలు, జీలకర్ర, ఎండు మిరపకాయలు, కరివేపాకు, పసుపు వేసి వేగనివ్వాలి. ఇందులోనే.. వెల్లుల్లి రెబ్బల్ని కచ్చాపచ్చాగా దంచి వాటినఇ కూడా ఇదే నూనెలో వేసి బాగా వేగనివ్వాలి. ఆ తర్వాత స్టౌ కట్టేసి పోపుని చల్లారనివ్వాలి. దీన్ని మనం ముందుగా కలిపి పెట్టుకున్న మిశ్రమంలో వేసుకుని బాగా కలపాలి. ఇది వెంటనే కన్నా.. రెండు రోజులు ఊరితే బాగుం టుంది.

## జామకాయతో...



దోర జామకాయలు-మూడు, పచ్చిమిర్చి-ఆరు, చింతపండు గుజ్జు-చెంచాన్నర, ఎండు మిరపకాయలు-నాలులు, ఉప్పు-తగినంత, ధనియాలు-పావుచెంచా, ఆవాలు, జీలకర్ర, మినపప్పు, ఇంగువ-పావుచెంచా చొప్పున, ఉప్పు తగినంత, ధనియాలు-పావుచెంచా, ఆవాలు జీలకర్ర, మినపప్పు, ఇంగువ పావుచెంచా చొప్పున, నూనె-రెండు చెంచాలు, వెల్లుల్లి రెబ్బలు - నాలుగు : ముందుగా జామకాయల్ని శుభ్రం చేసి సన్నని ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. ఒక కడాయిలో నూనె పోసుకుని వేడెక్కాక అందులో నిలువుగా చీల్చిన పచినచమిర్చి వేసి వేయించుకోవాలి. ఇందులోనే జీలకర్ర మినపప్పు, ధనియాలు కూడా వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు పాన్‌లో రెండు చెంచాల నూనె వేసి అందులో జామ ముక్కలు వేసి మగ్గనివ్వాలి. ఇందులోనే చింతపండు గుజ్జు కూడా వేసి మగ్గనివ్వాలి. ఇప్పుడు రోట్లో ముందుగా వేయించి పెట్టుకున్న జీలకర్ర పచ్చిమర్చి, ధనియాలు, మినపప్పు మిశ్రమాన్ని రుబ్బుకోవాలి. అవి నలిగాక మగ్గిన జామకాయ ముక్కల్ని వేసి రుబ్బుకోవాలి. అప్పుడు స్టౌపైన కడాయి పెట్టి అందులో ఎండు మిర్చి,ఆవాలు, ఇంగువ, వెల్లుల్లిరెబ్బలు వేసి తాలింపు పెట్టుకుంటే సరిపోతుంది. అన్నంలోకి బాగుంటుంది.

## దానిమ్మ ఊరగాయ ..

దానిమ్మ గింజలు-కప్పు, వెల్లుల్లి రెబ్బలు-నాలుగు, జీలకర్ర-అరచెంచా, కారం-అరచెంచా, నూనె-రెండు చెంచాలు, ఆవాలు-అరచెంచా, కరివేపాకు-రెబ్బ, ఉప్పు-తగినంత. **తయారీ :** ముందుగా కడాయిలో జీలకర్రని పొడిగా వేయించుకోవాలి. రోట్లో లేదా మిక్సీలో వెల్లుల్లి రెబ్బలు, జీలకర్రని పొడి చేసుకుని పక్కన పెట్టుకోవాలి. ఒక పానరతలో దానిమ్మ గింజలు, జలకర్ర-వెల్లుల్లిపొడి, ఉప్పు, కారం వేసి కలపాలి. స్టౌ వెలిగించి.. ఒక పాన్ నూనె పోసి వేడయ్యాక ఆవాలు, కరివేపాకు వేసి వేయించుకోవాలి.



తాలింపు చల్లారాక సిద్ధం చేసుకున్న దానిమ్మ గింజలపై వేసుకుంటే పచ్చడి సిద్ధం. దోసెల్లోకి బాగుంటుంది.

## పైనాపిల్‌తో..



పైనాపిల్-ఒకటి, ఉప్పు, కారం, మిరయాలపొడి-తగినంత, వేయించిన చిల్లీఫ్లేక్స్ -చెంచా, కాల్చిన వెల్లుల్లి రెబ్బలు-ఐదు, ఆవనూనె-చెంచా, కొత్తిమీర తరుగు-రెండు చెంచాలు, సన్నగా తరిగిన పచ్చిమిర్చి-రెండు చెంచాలు, పంచదార-చెంచా (పైనాపిల్ మరీ పుల్లగా ఉంటే అవసరం అవుతుంది), చాట్‌మసాలా చెంచా (నచ్చితే), దానిమ్మ గింజలు - చెంచా. పైనాఫిల్ పచ్చగా ఉంటే ఒకటిరెండు రోజుల ఎండలో పెడితే పండిపోతుంది. దాని చెక్కుతీసి ముక్కలుగా కోసి పక్కన పెట్టుకోవాలి. వెల్లుల్లి రెబ్బలపై నుండే పొట్టు తీసేసి గ్యాస్‌పొయ్యిమీద కాని గ్రిల్‌మీద కాల్చుకోవాలి. దీనివల్ల పచ్చడికి చక్కని స్మోకీ రుచి అబ్బుఉంది.ఇప్పుడొక పాత్రలో అనాస ముక్కలు, ఉప్పు, మిరియాలపొడి, కారంచ చిల్లీఫ్లేక్స్ సన్నగా తరిగిన పచ్చిమిర్చి, కొత్తిమీర, చల్లార్చిన వెల్లుల్లి రెబ్బలు, చాట్‌మసాలా, దానిమ్మ గింజలు, చివరిగా ఆవనూనె వేసికలపాలి. వీటనినన్నంటినీ చెంచాతోకానీ, చేత్తోకానీ మెదిపి ఓ పదినిమిషాల తర్వాత తింటే అద్భుంతంగా ఉంటుంది. □

# మీ గుండె పదిలమేనా !

**మహిళల గుండె పనితీరుపై రుతుచక్రం ప్రభావం అధ్యయనంలో వెల్లడి. రుతుచక్ర దశలో తెలుకోదగినవి!**



మహిళల నెలసరి సమయంలో శరీరంలో జరిగే హార్మోన్ల మార్పులు గుండె స్పందన నియంత్రణ వ్యవస్థలో మార్పులకు కారణమవుతాయి. అయితే ఈ మార్పులు కండరాల బలం, మాసికస్థితి లేదా పనులు చేయాలనే ఉత్సాహంపై గణనీయమైన ప్రభావం చూపవని అధ్యయనం స్పష్టం చేసింది. ఈ పరిశోధన మహిళల శరీరం సహజ హార్మోన్ల మార్పులపై ఎలా స్పందిస్తుదో చెప్పే అధ్యయనమిది. ముఖ్యంగా మహిళలు, క్రీడాకారిణులు, వైద్య నిపుణులు గుండె ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షల ఫలితాలను అర్థం చేసుకునేటప్పుడు రుతుచక్ర దశలను కూడా సమాంతరంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని పరిశోధకులు సూచిస్తున్నారు. హార్ట్ రేట్ వెరియబిలిటీ అంటే గుండె కొట్టుకునే ప్రతి రెండు స్పందనల మధ్య ఉండే సమయ వ్యవధిలో కనిపించే చిన్నచిన్న తేడాలను సూచిస్తుంది. గుండె ఒకే రీతిలో కొట్టుకుంటున్నట్లు కనిపించి నప్పటికీ, ప్రతి స్పందన మధ్య విరామం స్వల్పంగా మారుతూ ఉంటుంది. ఈ మార్పులను స్వయంచాలక నాడీ వ్యవస్థ నియంత్రిస్తుంది. ఇందులో ఫైట్ ఆర్ ఫ్లైట్ వ్యవస్థ, రెస్ట్ అండ్ డైజెస్ట్ వ్యవస్థ అనే రెండు భాగాలు ఉంటాయి. సాధారణం 'హెచ్‌ఆర్‌వి' ఎక్కువగా ఉంటే శరీరం ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటోం దని భావిస్తారు. హెచ్‌ఆర్‌వి తక్కువగా ఉంటే శారీరక లేదా మాసిక ఒత్తిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ అధ్యయనంలో సహజంగా రుతుచక్రం ఉన్న ఆరోగ్యవంతమైన మహిళలను ఎంపిక చేసి, వారి రుతు చక్రంలోని వివిధ దశల్లో గుండె పనితీరు. కండరాల బలం, మానసిక స్థితి, పనులు చేయాలనే ఉత్సాహాన్ని పరిశీలించారు.

**రుతు సమయంలో వచ్చే మార్పులివే..**

రుతుచక్రమంలోని ప్రతి దశలో హెచ్‌ఆర్‌విలో స్పష్టమైన మార్పు కనిపించాయి. హార్మోన్ల స్థాయిలు మారేకొద్దీ గుండెను నియంత్రించే స్వయంచాలక నాడీ వ్యవస్థ పనితీరులో కూడా మార్పులు నమోదయ్యాయి. ముఖ్యంగా ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరోన్ హార్మోన్ల హెచ్చుతుగ్గులు గుండె స్పందన నియంత్రణపై ప్రభావం చూపుతున్నట్లు మానసిక స్థితి, పనులు చేయాలనే ఉత్సాహం కూడా రుతుచక్రంలోని వివిధ దశల్లో పెద్దగా మారలేదని అధ్యయనం తెలిపింది. అంటే హార్మోన్ల మార్పు గుండె నియంత్రణ వ్యవస్థపై ప్రభావం చూపినా, శారీరక పనితీరు మాత్రం చాలా వరకు స్థిరంగానే ఉంటుం దని పరిశోధకులు పేర్కొన్నారు. మహిళలు నెలసరి సమయంలో సహజంగానే కొన్ని మార్పులను చూడవచ్చు. అలాంటి మార్పులు కనపించిన ప్రతిసారీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పరిశోధకులు సూచిస్తున్నారు. □

# పాంచజన్యం

దుష్టశిక్షణ, శిష్టరక్షణ ధ్యేయంగా తన భక్తులని కాపాడే భగవానుడు శ్రీకృష్ణభగవానుడు ఉపయోగించే శంఖం పేరు పాంచజన్యం. మహాభారత యుద్ధంలో ఈ శంఖం పాండవులకు విజయాన్ని తెచ్చి పెట్టంది. కౌరవులకు ఘోర పరాజయం చవి చూసాయి. పాంచజన్యం అనే శంఖం పూరిస్తేచాలు ముల్లోకాలు దద్దరిల్లుతాయి. ఈ పాంచజన్యం శంఖం శ్రీ కృష్ణుడికి ఎలా లభించిందో మనం తెలుసుకుందాం. తమ విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత బలరామకృష్ణులు తమ గురువు శాందీపని మహాముని వద్దకు వెళ్లారు. తమకి విద్యాబోధన గావించిన శాందీపని మునికి గురుదక్షిణ ఇవ్వాలనుకున్నారు. అది గ్రహించిన శాందీపని మునికి శ్రీకృష్ణుడు సాక్షాత్తు దేవ దేవుడు అని కూడా తెలుసు. అందుకే ఈ కోరిక కోరాడు. చాలకాలం క్రితం సముద్రంలో తన పుత్రుడుని తిరిగి తీసుకు రమ్మని కోరాడు గురుదక్షిణగా, అప్పుడు శ్రీ కృష్ణ, బలరాములు నేరుగా సముద్రుడి వద్దకు వెళ్లి ఈ విషయం వివరాంచారు.కొంత కాలం క్రితం మా గురుపుత్రుడు ఈ సముద్రంలో పడి మరణించాడు అతన్ని వెంటనే వెనక్కి తీసుకురా! అని అడిగారు. దానికి బదులుగా సముద్రుడు మీ గురుపుత్రున్ని నేను తీసుకుపోలేదు. పంచజునుడు అనే రాక్షసుడు ఆ పిల్లవాడిని పట్టుకెళ్లాడు. వాడు శంఖం రూపంలో సముద్రం నీటి అడుగున ఉండవచ్చును. అని సమాధానం ఇచ్చాడు. శ్రీకృష్ణుడు వెంటనే సముద్రంలోకి వెళ్లి అక్కడ దాగున్న పంచజనుడు అనే రాక్షసున్ని పట్టుకున్నాడు. వాడి కడుపులో గురుపుత్రుడు కనిపించలేదు. అప్పుడు రాక్షసుడి శరీరం నుండి పుట్టిన 'పాంచజన్యం' అనే శంఖాన్ని తీసుకుని యమపురికి చేరుకున్నారు. అక్కడ ఈ శంఖం శ్రీకృష్ణుడు పూరించగా ఆ శబ్దానికి యమలోకం తలకిందులైంది. అది విని యమధర్మరాజు వెంటనే బయటకు వచ్చి శ్రీ కృష్ణుడికి అభివాదం చేసి, 'స్వామీ ఆజ్ఞాపించండి' అని అడిగాడు. అప్పుడు శ్రీ కృష్ణుడు యువరాజుతో నా గురుపుత్రున్ని వెంటనే తిరిగి ఇచ్చేయమని అడిగాడు వెంటనే ఆ గురుపుత్రున్ని వారికి తిరిగి సజీవునిగా అప్పజెప్పాడు యముడు. ఆ పిల్లవాన్ని సాందీపని మునికి అప్పగించి తన గురుదక్షిణ తీర్చుకున్నారు. బలరామకృష్ణులు. సకల లోక రక్షణ కోసం యుద్ధంలో విజయం కోసం శ్రీకృష్ణ భగవానుడు ఈ పాంచ జన్యం ఉపయోగించేవాడు. □


# తెర

## హీరో నాని సినీ ప్రయాణానికి 18 యేళ్లు



హీరో నాని సినీ ప్రయాణం 18 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అభిమానులు, ప్రేక్షకులకు అతడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపాడు. వారి ప్రేమను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోలేదని చెప్పారు. ఇకపై కూడా అలా చేయబోనని స్పష్టం చేశాడు.'18 ఏళ్లు.. అధికారికంగా సినిమాల్లో పెద్దవాడినయ్యా అంటూ నాని ఎక్స్‌లో పోస్టు చేశాడు. మీ ప్రేమను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోలేదు.. ఇకపై కూడా తీసుకోబోన్ను అని రాసు కొచ్చాడు.నాని హీరోగా పరిచయమైన తొలి చిత్రం అష్టా చమ్మా. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా 2008 సెప్టెంబర్ 5న విడుదలైంది. అప్పటి నుంచి నటుడిగా మొదలైన నాని ప్రస్థానం హీరోగా, నిర్మాతగా ఎదిగే స్థాయికి చేరింది.ప్రస్తుతం నాని శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న'ది ప్యారడైజ్‌లో నటిస్తున్నాడు. ఎస్‌ఎల్‌వీ సినిమాస్ నిర్మిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలుత మార్చి 26న విడుదల చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత ఆగస్టు 21కి మార్చారు. చివరగా సెప్టెంబర్ 24కు వాయిదా వేశారుఇటీవల విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. రక్తంతో తడిసిన లుక్‌లో నాని కనిపించడం అభిమానుల్లో ఆసక్తి పెంచింది. రెండు జడలతో కనిపిస్తూ.. చేతిలో బ్లేడ్‌లతో చేసిన గొలుసుతో నాని కనిపించే సన్నివేశాలు టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.అణచివేతకు గురైన ప్రజలు తిరుగుబాటు చేయడం చుట్టూ కథ సాగుతుందనే సంకేతాలు టీజర్ ఇచ్చింది. ఇందులో మోహన్‌బాబు ప్రతినాయకుడిగా కనిపించను న్నాడు. ఈ దేశం ఎవరిది? మనది అనే డైలాగ్‌లు టీజర్‌లో వినిపించాయి. ది ప్యారడైజ్ హిందీ, తెలుగు, తమిళం, ఇంగ్లిష్, స్పానిష్, బెంగాలీ, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల కానుంది.

## 'ఎపిక్' చిత్రం గొప్ప విజయం సాధించాలి: రష్మిక




థియేటర్లన్నీ వైబ్‌తో ఊగిపోవాలి. 'ఎపిక్' మంచి విజయం సాధించాలి ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో శివ నిర్వాణ.'ఎపిక్' అందమైన చిత్రం, అందరినీ సర్ ప్రైజ్ చేస్తుంది ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆనంద్ దేవరకొండ..ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా డెబ్యూ డైరెక్టర్ ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్న 'ఎపిక్' - ఫస్ట్ సెమిస్టర్ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ సినిమాని సెప్టెంబర్ 11న రిలీజ్ చేయబోతోన్నారు.'నా పేరు ఆనంద్.. సారీ సారీ.. ఆదిత్య.. నాకు డైరెక్టర్ అవ్వాలని ఉంది.. సినిమాలో ఓ మ్యాజిక్ ఉంది.. ఓ మంచి సినిమా, మన సినిమా తీయాలని ఉంద్ది అంటూ సాగే ఈ ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంది. ఈ సందర్భంగా నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి నేషనల్ క్రష్ రష్మిక మందన్నా, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ శివ నిర్వాణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. .రష్మిక మందన్నా మాట్లాడుతూ.. 'ఎపిక్' ట్రైలర్ నాకు నచ్చింది. ఆనంద్ ఎప్పుడూ సినిమా గురించే ఆలోచిస్తుంటాడు. సినిమా కోసమే కష్టపడుతుంటాడు. కడలి పాత్ర గొప్పగా ఉంటుందని చెప్పారు. ఈ చిత్రంతో వైష్ణవికి గొప్ప పేరు వస్తుంది. ఆదిత్యను చూస్తే గర్వంగా అనిపిస్తుంటుంది. 90స్ తర్వాత ఆయనపై బాధ్యత పెరిగిపోయింది. ..ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ.. ఎపిక్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా కోసం వచ్చిన మా వదినమ్మ రష్మికకు థాంక్స్. ఎప్పుడూ సపోర్ట్‌గా నిలిచే వదినమ్మ దొరకడం నా అదృష్టం. వైష్ణవి చైతన్య మాట్లాడుతూ.. మా 'ఎపిక్' కోసం వచ్చిన రష్మికకి, శివ నిర్వాణకి థాంక్స్. సితార బ్యానర్‌లో నేను సినిమాలు చేస్తూనే వస్తున్నాను. ఇప్పుడు ఈ బ్యానర్‌లో ఎపిక్‌ని చేయడం ఆనందంగా ఉంది. ..శివాజీ మాట్లాడుతూ.. .'ఎపిక్'లో మంచి పాత్రను ఇచ్చిన ఆదిత్యకి, నాగవంశీకి థాంక్స్.

## RKFI 'ధర్మన్' రెండవ షెడ్యూల్ పూర్తి



సూపర్ స్టార్ రజనీకాంత్ 'ధర్మన్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ కు అద్భుత న్నమైన రెస్పాన్స్ వచ్చింది. ది డెడ్లీ డాక్టర్థ్ అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో విడుదలైన ఈ పోస్టర్ ప్రేక్షకుల్లో చాలా ఆసక్తిని రేకెత్తి స్తోంది.తాజాగా మేకర్స్ రెండవ షెడ్యూల్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన వీడియోలో సూపర్ స్టార్ తనదైన చరిస్మా, ప్రజెన్స్ తో అదరగొట్టారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవు తోంది. కమల్ హాసన్, సూపర్ స్టార్ రజనీకాంత్ మధ్య ఉన్నంత స్నేహబంధం చాలా అరుదు. భారతీయ చలనచిత్ర రంగంలో ఐదు దశాబ్దాలకు పైగా అగ్రస్థానంలో కొనసాగుతున్న ఈ ఇద్దరు దిగ్గజాలు, 'ధర్మన్' చిత్రం ద్వారా నిర్మాత నటుడిగా మొదటిసారిగా కలిసి పనిచేస్తున్నారు.రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై కమల్ హాసన్,ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న ఈ చిత్రం, RKFI నిర్మాణంలో సూపర్ స్టార్ రజనీకాంత్ నటించే మొదటి సినిమా కావడం విశేషం. భారతీయ చలనచిత్ర రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుని, అత్యంత ఆసక్తికరమైన యువ దర్శకులలో ఒకరిగా పేరు తెచ్చుకున్న అశ్వత్ మారిముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్1 అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. భారతీయ చలనచిత్ర రంగంలో అత్యంత అద్భుతమైన ఖిఅన్బరివ్‌ఖి ద్వయం యాక్షన్ కొరియోగ్రఫీని నిర్వహిస్తున్నారు. Elejrri4j vi గా నికేత్ బొమ్మిరెడ్డి , కార్తీక్ రాజ్‌కుమార్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రదీప్ ఇ. రాఘవ్ ఎడిటర్‌గా వ్యవహరిస్తుండగా, అన్నదురై ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. అలాగే డిస్నీ సంస్థ దీనికి సహనిర్మాతగా వ్యవహరిస్తోంది.

## ఆ రెండు ప్యానెల్స్ చేయలేని పనులను నేను చేసి చూపిస్తా, లేకుంటే రాజీనామా చేస్తా: నట్టి కుమార్



తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సభ్యుల సంక్షేమం, శ్రేయస్సు కోసం ఎనలేని కృషి చేస్తానని సీనియర్ ప్రొడ్యూసర్ నట్టి కుమార్ స్పష్టం చేశారు. కౌన్సిల్ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఏ ప్యానెల్ తో సంబంధం లేకుండా ఇండిపెండెంట్లుగా నట్టి కుమార్ ట్రెజరర్ పోస్ట్ కు పోటీ చేస్తుండగా...ఆయన తనయుడు నట్టి క్రాంతి ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పోటీలో ఉన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ లోని తన సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో నట్టి కుమార్ మాట్లాడుతూ, కౌన్సిల్ ఎన్నికల్లో మన ప్యానెల్, ప్రోగ్రెసివ్ ప్యానెల్ పోటీకి నిలబడ్డాయని, అయితే ఆ రెండు ప్యానెల్స్ చేయలేని పనులను తాను చేసి చూపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. మెడిక్లెయిమ్ హెల్త్ పాలసీకి సంబంధించి మన ప్యానెల్ కు చెందిన చదలవాడ శ్రీనివాసరావు ఇదివరకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయారని, కోశాధికారి పోస్ట్ కు ఆయన తాజాగా పోటీ చేస్తుండటం విచిత్రంగా ఉందన్నారు. మన ప్యానెల్ వారికి భయంపట్టుకుని బండ్ల గణేష్ ని బతిమలాడుకున్నారు. గిల్డ్ వారిని బండ్ల గణేష్ నమ్మించి మోసం చేశాడు. అలాగే ప్రోగ్రెసివ్ ప్యానెల్ నుంచి స్రవంతి రవికిషోర్ పోటీలో ఉన్నారని, చార్టర్డ్ అకౌంటెంట్ గా ఆయన సమర్థుడే అయినా సభ్యుల సంక్షేమ కోసం చేసే పథకాలకు ఆయన సపోర్ట్ చేయకపోగా, అడ్డుపడతారని నట్టి కుమార్ ఆరోపించారు. తనతో పాటు తన కుమారుడు పోటీ చేస్తున్నామని చెప్పారు. సభ్యుల సంక్షేమమే తమ అజెండా అని, అందుకోసం చిరంజీవి, బాలయ్య బాబు, పవన్ కళ్యాణ్ వంటి పలువురు పెద్దల కాళ్ళు పట్టుకుని అయినా అమలు చేసి తీరుతామని ఆయన చెప్పారు. తమకు చిరంజీవి ఆశీస్సులు ఉన్నాయని అన్నారు.గెలిచినా, ఓడినా నిర్మాతల కోసం తాను ఎల్లప్పుడూ పోరాటం చేస్తూనే ఉంటానని, ఇటీవల జీవో లో ఇచ్చిన 25 పర్సెంట్ ఆక్యుపెన్సీ, 5వ షో ఘనత తనదేనని నట్టికుమార్ స్పష్టం చేశారు.


## 'టార్టాయిస్' 'నీ పరిచయం...' సాంగ్ లాంచ్

రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'టార్టాయిస్'. ఈ చిత్రంలో అమృత చౌదరి, అవసరాల శ్రీనివాస్, ధన్య బ్బాలకృష్ణ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. "టార్టాయిస్" సిని.ను



ఎస్ కే గోల్డెన్ ఆర్ట్స్, ప్రశ్వేత ఎంటర్టైన్మెంట్, ఎన్ వీ ఎల్ క్రియేషన్స్ బ్యానర్స్ పై విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. లిరిసిస్ట్ చంద్రబోస్ మాట్లాడుతూ ప్రేమ, ఆర్తి, అక్కెరతో కూడుకున్న పాట ఇది. ఈ పాటను అత్యద్భుతంగా కంపోజ్ చేసిన అనూప్ గారికి, అంతే అద్భుతంగా పాడిన చిన్మయి గారికి నా ధన్యవాదాలు ప్రొడ్యూసర్ విజయ్ చౌదరి మాట్లాడుతూ నీ పరిచయం సాంగ్ మా మూవీకి పిల్లర్ లాంటిది. ఎమోషనల్‌గా సాగే ఈ పాట మీ అందరినీ ఆకట్టుకుంటుంది. ఈ పాటను ఇంత బాగా వచ్చేలా చేసిన అనూప్‌కి, చిన్మయికి హార్ట్ ఫుల్ థ్యాంక్స్ ప్రొడ్యూసర్ శశిధర్ నల్ల మాట్లాడుతూ మా మూవీని అనుకున్న టైమ్ కు ప్లాన్ ప్రకారం కంప్లీట్ చేశాం. అందుకు మా టీమ్ అందరికీ థ్యాంక్స్ చెబుతున్నా. ఈ చిత్రానికి రాత్రిళ్లు, వర్షం పడుతున్నప్పుడు, చలిలో ఎప్పుడు షూటింగ్ ఉంటే అప్పుడు వచ్చిన మా హీరో రాజ్ తరుణ్‌కు థ్యాంక్స్. ప్రొడ్యూసర్ రామిశెట్టి రాంబాబు మాట్లాడుతూ మా సినిమాను ఎంతో కష్టపడి, ఇష్టపడి నిర్మించాం. ఈ పాట మంచి లవ్ ఫీల్ తో సాగుతూ మీరు రిపీటెడ్ గా వినేలా చేస్తుంది. యాక్టర్ అవసరాల శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్మయి గారి గాత్రం, అనూప్ గారి మ్యూజిక్ నాకు చాలా ఇష్టం. ఈ పాట వింటుంటే సినిమాలో ఈ సాంగ్ కు ఉండే ఇంపార్టెన్స్ తెలిసింది. ఇంతమంచి సాంగ్ రాసిన చంద్రబోస్‌కి థ్యాంక్స్. నటి ధన్య బాలకృష్ణ మాట్లాడుతూ ఇదే ప్లేస్ లో పూజా కార్యక్రమాలతో మా సినిమా ప్రారంభించాం. ఈ రోజు సక్సెస్ ఫుల్‌గా మా మూవీ కంప్లీట్ చేసి కాన్ఫిడెంట్‌గా మీ ముందుకు వస్తున్నాం

## 'ఈ పాట కోరినవారు నెమలిపాలెం' 18న విడుదల



ఆ నలుగురు, మధుమాసం, 'అందరి బంధువయా", 'ఇదీ సంగతి' 'ఆటగదరా శివా' తదితర చిత్రాలతో విలక్షణమైన దర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకున్నారు చంద్ర సిద్ధార్థ్. ఆయన తాజాగా రూపొందించిన చిత్రం ఈ పాట కోరినవారు నెమలి పాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగు వారు. దీనికి ఉప శీర్షిక 'ఎ ఫర్‌బిడెన్ రాగ ఫ్రమ్ ఎ ఫర్‌బిడెన్ సాగా. ఫిల్మోత్సవ్ బ్యానర్‌పై ఆయనే సొంతగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రముఖ దర్శక రచయిత మదన్ అందించిన కథతో ఈ సినిమా రూపొందింది. హర్ష హీరోగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో అమైరా గోస్వామి, సుజనా రెడ్డి, ఇనాయా సుల్తానా, రవివర్మ, అశోక్‌వర్ధన్, రేఖా నిరోషా తదితరులు కీలక పాత్రల్లో కనిపించ నున్నారు. సెప్టెంబర్ 18న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.'ఆ నలుగుర్హు చిత్రంతో మానవ సంబంధాలు, భావోద్వేగాలను బలంగా ఆవిష్కరించిన చంద్ర సిద్ధార్థ్, ఈసారి ఆధునిక థ్రిల్లర్ నేపథ్యంతో మరో భిన్నమైన చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నారు. ఇది మొట్ట మొదటి మిస్టరీ మ్యూజికల్ . సంగీతం, ధ్వని, మానవ మెదడు మధ్య ఉన్న సంబంధాన్ని కథలో కీలకంగా మలుస్తూ ఈ చిత్రం రూపొందింది.

6-9Pg8:6-9Pg8.qxd 9/6/2026 12:08 AM Page 1



## తప్పుడు డాటాతో ఎస్సీ రిజర్వేషన్ల అమలు ఈఅసెంబ్లీ సమావేశాల్లోనే వాటిని రద్దు చేయాలి

### మాలసంఘాల జెఎసి డిమాండ్




**హైదరాబాద్, సెప్టెంబరు 5,ప్రభాతవార్త:** తప్పుడు సమాచారం సిద్ధం చేసి అమలు చేస్తున్న ఎస్సీ రిజర్వేషన్లు రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం రద్దు చేయాలని మాల సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో "తప్పుడు గణాంకాలతో రాష్ట్ర ప్రభుత్వం మాలలకు చేస్తున్న అన్యాయం" అన్న అంశంపై రౌంటేబుల్ సమావేశం మాల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ అధ్యక్షతన నిర్వహించగా మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు మందాల భాస్కర్, మాల సంఘాల నాయకులు బీ. రాం నారాయణ, పాత శివ కుమార్ ప్రొఫెసర్ లింబాద్రి, బేర బాలకృష్ణ, రాహుల్, పిల్లి సుధాకర్, దార సత్యనారాయణ, మేడి అంజయ్య, భాను, చెట్లపల్లి అరుణ్ కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలుగు రాష్ట్రాల్లో మాలల అభివృద్ధిని జీర్ణించుకోలేని కేంద్ర ప్రభుత్వం చేసిన సూచనలకు రాష్ట్రం తానా అంటే తందానా అన్న చందంగా కేంద్రం ఆదేశాలను అమలు చేయడం సిగ్గుచేటన్నారు. దేశ వ్యాప్తంగా ఒకే చట్టం, ఒకే దేశం అంటు ప్రకటనలు గుప్పించే కేంద్ర నాయకులకు ఎస్సీ రిజర్వేషన్ విషయంలో ద్వంద నీతి ఎందుకని ప్రశ్నించారు. రిజర్వేషన్ వర్గీకరణ చేస్తే దేశవాప్తంగా అమలు చేయాలని, కేవలం తెలుగు రాష్ట్రాల మాలల పై కక్ష సాధించడం తగదన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ ప్రభుత్వానికి మాలలు సరైన రీతిలో బుద్ధి చెపుతారని హెచ్చరించారు.

## ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహనఉండాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




పోషణ మాహ్-2026 కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ముషీరాబాద్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** ఆరోగ్యకరమైన జీవన విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, లేనపక్షం రానున్న రోజుల్లో మనం అనేక ఆరోగ్య సంబంధిత సవాళ్లను ఎదుర్కొనవలసి వస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం దోమలగూడలోని ఏవి కళాశాలలో జరిగిన పోషణ మాహ్-2026 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ గత ఐదు రోజులుగా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న పోషణ మహోత్సవం కార్యక్రమాలు కేవలం ఒక స్థానిక కార్యక్రమం కాదని, ఇది దేశ వ్యాప్తంగా ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థులు, యువత, మహిళల్లో పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాలలో ఒక భాగమని తెలిపారు. ఒక కుటుంబంలో వ్యక్తి అనారోగ్యానికి గురైతే ఆకుటుంబం మొత్తం ప్రభావితం అవుతుందని, అదేవిధంగా సమాజంలో ఎక్కువ మంది ప్రజలు అనారోగ్యానికి గురైతే, దాని ప్రభావం నగరంపై, రాష్ట్రంపై, దేశంపై, చివరకు సమస్త మానవాళిపై పడుతుందని అన్నారు. మానవ జీవితం అత్యంత విలువైనదని, మన జీవితాన్ని ఆరోగ్యకరంగా, సార్థకంగా తీర్చిదిద్దుకోవల్సిన బాధ్యత మనపైనే ఉందని స్పష్టం చేశారు. ప్రపంచంలో అనేక దేశాలు అభివృద్ధిలో ముందుకు వెళ్లాయని, భారతదేశను కూడా అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలపాలనే లక్ష్యంతో 2047నాటికి వికసిత భారత్‌ను నిర్మించాలని మోదీ కృషి చేస్తున్నారని, ఆరోగ్యవంతమైన ప్రజలు లేకుండా ఆరోగ్యవంతమైన భారత్‌ను, అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించటం సాధ్యం కాదని అన్నారు. ప్రతి ఒక్కరూ తమకు తాము ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, వచ్చే సంవత్సరంలో నా ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరుచుకుంటానని, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లను తగ్గిస్తానని సంకల్పించుకుని ముందుకుసాగాలని. ఈ కార్యక్రమంలో పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ మేర కుల రాష్ట్ర కమిటీ ఎన్నిక

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 ( ప్రభాతవార్త ):** బాగ్‌లింగంపల్లి, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మేర కుల రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ మేర సంఘం రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత కొన్నేళ్లుగా ఎన్నో ఆటంకాలతో పరిష్కారం కాని ఎన్నికల సమస్యను సభ్యుల సహకార, సమన్వయంతో ఎన్నిక ప్రక్రియ సజావుగా జరిగింది. అధ్యక్షుడిగా కీర్తి రాజగోపాల్, ప్రధాన కార్యదర్శిగా శీలం కోటి రవి, గౌరవ అధ్యక్షులు గా కరాటే కృష్ణ, కోశాధికారిగా సింగు విష్ణు, జాయింట్ సెక్రెటరీ మరియు అధికార ప్రతినిధి గా మునగాల రాము గార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర మేర కార్పొరేషన్ చైర్మన్ సంఘు వెంకటరాజం , వైస్ చైర్మన్ మాడిశెట్టి లక్ష్మీనారాయణ గార్ల ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ప్రక్రియ జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలు, జోన్లు, పట్టణాల నుంచి మేర సంఘాల మాజీ, ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శులు, మేధావులు, పెద్దలు పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ సంఘు వెంకట రాజ్యం మాట్లాడుతూ సమన్వయంతో జాతిని ఏకం చేసేవాడే, వివాదాలకు దూరంగా ఉండేవాడే నిజమైన నాయకుడని అన్నారు. అనంతరం మేర సంగం లో పరిస్కారం కానీ అనేక సమస్యల పై చర్చించడం జరిగింది. ఉప్పల్ భగాయత్‌లో వివిధ కులాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్న నేపథ్యంలో మేర ఆత్మగౌరవ భవన నిర్మాణంపైనా, అలాగే వివిధ కుల కార్పొరేషన్లకు చైర్మన్లతో పాటు డైరెక్టర్ల నియామకంపైనా సమావేశంలో చర్చించారు.

## డైవింగ్ పర్యాటకంకోసం సముద్రజలాల్లోకి విమానం..!



**అంకారా, సెప్టెంబరు 5:** విమానం సాధారణంగా ఆకాశంలో ఎగురుతుంది. కానీ టర్కీలోని ఓ భారీ ఎయిర్‌బస్ మాత్రం సముద్రం అడుగునకు చేరింది. పర్యాటకులను ఆకర్షించడంతో పాటు సముద్ర జీవులకు కృత్రిమ ఆవాసంగా మార్చేందుకు అధికారులు ఈ విమానాన్ని ఉద్దేశపూర్వకంగా ఏజియన్ సముద్రంలో ముంచారు. ఇప్పుడు అదే విమానం డైవింగ్ చేసే వారికి ప్రత్యేక ఆకర్షణగా మారింది. టర్కీలోని ఐడిన్ ప్రావిన్స్‌లో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం కుషాదసి తీరానికి సమీపంలో ఈ ఎయిర్‌బస్ ఏ300ను 2016 జూన్‌లో సముద్రంలోకి దించారు. 54 మీటర్ల పొడవున్న విమానాన్ని సముద్రంలో సుమారు 22 మీటర్ల లోతులో ఇసుక నేలపై ఉంచారు. విమానం పూర్తిగా నీటిలోకి చేరేందుకు మూడు గంటలకు పైగా సమయం పట్టింది. ఈ ఎయిర్‌బస్ ఏ300కు సుదీర్ఘ చరిత్ర ఉంది. 1980లో ఫ్రాన్స్‌లోని టులూస్‌లో తయారైన ఈ విమానం అదే ఏడాది మార్చి 14న తొలిసారి గాల్లోకి ఎగిరింది. వేలాది విమాన ప్రయాణాలు పూర్తి చేసింది. దాదాపు రెండు దశాబ్దాల పాటు గ్రీస్‌కు చెందిన ఒలింపిక్ ఎయిర్‌వేస్‌లో ప్రయాణికుల విమానంగా సేవలు అందించింది. ఆ తర్వాత కార్గో విమానంగా మార్చారు. 2006 నుంచి టర్కీలో కార్గో రవాణాకు ఉపయోగించారు. తర్వాత నిర్వహణ, తనిఖీల ఖర్చులు పెరగడంతో విమానాన్ని సేవల నుంచి తప్పించారు. అయితే దాని ప్రయాణం అక్కడితో ముగియలేదు. ఐడిన్ మున్సిపాలిటీ ఓ ప్రైవేటు విమానయాన సంస్థ నుంచి ఈ 36 ఏళ్ల విమానాన్ని 2.70 లక్షల టర్కిష్ లిరాలకు కొనుగోలు చేసింది. అప్పట్లో దీని విలువ సుమారు 93 వేల డాలర్లుగా ఉంది. విమానాన్ని సముద్రంలోకి దించే ముందు ప్రత్యేకంగా సిద్ధం చేశారు.

# సిడిపి నిధులకు మంగళమేనా?

- ఎస్‌డీఎఫ్ పేరుతో అభివృద్ధికి కొత్త మెలిక
- నియోజకవర్గాల్లో పేరుకుపోతున్న సమస్యలు

**యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త:** ఎమ్మెల్యేలకు నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం అందే నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం (సీడీపీ) నిధులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రేకులు పడగా.. వాటి స్థానంలో ఎస్‌డీఎఫ్ నిధుల పేరుతో కొత్త విధానం తెరపైకి వచ్చింది. ప్రభుత్వం మారినా.. నియోజకవర్గాల అభివృద్ధికి నిధులకేటాయింపుల్లో మాత్రం స్పష్టతకొరవడిందన్న విమర్శలు విని పిస్తున్నాయి. ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు సిద్ధం చే సుకున్నా.. నిధుల విడుదల కోసం ఎదు రుచూపులు తప్పడం లేదు. దీంతో నియో జక వర్గాల్లో చిన్నచిన్న మౌలిక వసతుల సమస్యల నుంచి అత్యవసర అభివృద్ధి పనుల వరకు అనేక అంశాలు పేరుకుపోతున్నాయి. కాంగ్రెస్ ప్ర భుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీడీపీ నిధులను నేరుగా విడుదల చేయకుండా ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) పేరుతో ని యోజకవర్గాలకు నిధులు కేటాయించే విధానాన్ని అనుసరిస్తోంది. ఇందులో భాగంగా 2024 నవంబర్ 25న జారీ చేసిన జీవో ఆర్‌టీ నంబర్ 299 ద్వారా రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కొక్కదానికి రూ.10 కోట్ల చొప్పున మొత్తం రూ.1,190 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులను 2024-25 హెచ్‌డీఎఫ్ గ్రాంట్ కింద విడుదల చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.అయితే ఈ నిధుల వినియోగానికి ప్రభుత్వం నిర్దిష్ట మార్గదర్శకాలను విధించింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వస తుల కల్పనకు రూ.2 కోట్లు, తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.కోటి కేటాయించాల్సి ఉందిగా స్పష్టం చేసింది. దీంతో ఎమ్మెల్యేల ప్రాధాన్యతల మేరకు అన్ని రకాల స్థానిక అభివృద్ధి పనులకు నిధులను వినియోగించుకునే అవకాశం పరిమితమైందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇక రెండో విడతలో పరిస్థితి మరింత ఆసక్తికరంగా మారింది. 2025 నవంబర్ 1న జారీ చేసిన జీవో ఆర్‌టీ నంబర్ 251 ద్వారా రాష్ట్రంలోని కేవలం 76 అసెంబ్లీ నియో జకవర్గాలకు మాత్రమే ఒక్కొక్కదానికి రూ.5 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేశారు. అంటే రెండో విడతలో అన్ని నియోజకవర్గాలకు నిధులు అం దని పరిస్థితి నెలకొంది. ఈ నిధులను 20 25-26 హెచ్‌డీఎఫ్ గ్రాంట్ కింద విడుదల చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లా విషయానికి వస్తే సూర్యాపేటనియోజకవర్గం మినహా మిగిలిన 11 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కొక్కదానికి రూ.5 కోట్ల చొప్పున రెండో విడత ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరయ్యాయి. అయితే నియోజకవర్గాల పరిధిలో ఉన్న అవసరాలు, పెండింగ్ పనులు, ప్రజల నుంచి వస్తున్న వినతులతో పోలిస్తే ఈ ని ధులు సరిపోతాయా? అన్న ప్రశ్నలు తలె త్తుతున్నాయి. సీడీపీ నిధులు లేకపోవడంతో ఎమ్మెల్యేల వద్దకు వచ్చే స్థానిక అభివృద్ధి ప్రతిపాదనలకు పరిష్కారం చూపడం కష్టంగా మారిందనే వాదనలు వినిపిస్తున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో డ్రైనేజీలు, అంతర్గత రహదారులు, వీధిలైట్లు, కమ్యూనిటీ భవనాలు, తాగునీరు, పాఠశాలల మౌలిక వసతులు వంటి అనేక చిన్నస్థాయి పనులకు ఎమ్మెల్యేల సిఫారసులు కీలకంగా ఉంటాయి. సీడీపీ నిధులు అందు బాటులో లేకపోవడంతో ఇలాంటి పనులు ముందుకు సాగడంలో జాప్యం ఏర్పడుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఒక విడతలో 119 నియోజకవర్గాలకు రూ.10 కోట్లు.. మరో విడతలో కేవలం 76 నియోజకవర్గాలకు రూ.5 కోట్లు కేటాయించడం వెనుక ఉన్న ప్రాతిపదిక ఏమిటన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. రెండో విడతలో కొన్ని నియో జకవర్గాలను మాత్రమే ఎంపిక చేయడంపై రాజకీయ వర్గాల్లోనూ ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మూడేళ్ల పాలన కాలం దాటుతున్నా సీడీపీ నిధుల పరిస్థితిపై స్పష్టత లేకపోవడం.. ఎస్‌డీఎఫ్ పేరు తో విడతలవారీగా నిధులు కేటాయించడం.. వాటికీ నిర్దిష్ట మార్గదర్శకాలు విధించడం.. వెరసి ఎమ్మెల్యేల చేతుల్లో ఉన్న అభివృద్ధి నిధుల పరిధి కుదించుకుపోయిందన్న విమర్శలు వెల్లు వెత్తు తున్నాయి. నియోజకవర్గాలకు స్థిరమైన, నిరంతర నిధుల వ్యవస్థ అవసరమని పలువురు అభి ప్రాయపడుతున్నారు. సీడీపీకి ప్రత్యామ్నాయంగా ఎస్‌డీఎఫ్ కొన సాగుతుందా? లేక తిరిగి సీడీపీ నిధుల విడుదలకు ప్రభుత్వం మార్గం సుగమం చేస్తుందా? అన్నది ఇప్పుడు ప్రజల్లో ఆసక్తికర చర్చగా మారింది. అప్పటివరకు మాత్రం నియోజకవర్గాల్లో చిన్నచిన్న అభివృద్ధి పనులకు కూడా నిధుల కోసం ఎదురుచూపులే తప్పేలా కనిపించడం లేదు.

## తమిళనాడు, బెంగాల్ రాష్ట్రాలకు కాంగ్రెస్ కొత్త ఇన్‌ఛార్జిల నియామకం

**న్యూఢిల్లీ, జూలై 8:** కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ప్రక్షాళనలో భాగంగా కీలక మార్పులు చేపట్టింది. ఏఐసీసీ బుధవారం పలువురు సీనియర్ పార్టీ నేతలకు జనరల్ సెక్రటరీ, రాష్ట్రాల ఇన్‌చార్జ్‌లుగా కొత్త బాధ్యతలు అప్పగించింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రకటించింది. పార్టీ సంస్థాగత వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ నిర్ణయం తీసుకున్నారు.అధికారికంగా విడుదల చేసిన ప్రకటన ప్రకారం రెండు కీలక నియామకాలు జరిగాయి. గులాం అహ్మద్ మీర్‌ను తమిళనాడు, పుదుచ్చేరి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీగా, ప్రకాశ్ జోషిని పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా నియమించారు. దక్షిణ, తూర్పు రాష్ట్రాల్లో పార్టీ బలాన్ని పెంచుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్న సమయంలో ఈ నియామకాలు జరిగాయి. తమిళనాడు, పుదుచ్చేరిలో ప్రాంతీయ పార్టీలతో పొత్తుల ద్వారా తన రాజకీయ పునాదిని మరింత బలోపేతం చేసుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.అదేవిధంగా పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌తో పాటు భారతీయ జనతా పార్టీ నుంచి కూడా కాంగ్రెస్‌కు సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కోల్పోయిన రాజకీయ పట్టు తిరిగి సాధించేందుకు పార్టీ ప్రయత్నిస్తోంది. జమ్మూకశ్మీర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత గులాం అహ్మద్ మీర్‌కు రాజకీయ, పరిపాలనా రంగాల్లో విస్తృత అనుభవం ఉంది. తమిళనాడు, పుదుచ్చేరిలో పార్టీ కార్యకలాపాలకు ఆయన నియామకం కొత్త ఊపునిస్తుందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ



కాంగ్రెస్ హైకమాండ్ మల్లికార్జున ఖార్గే, రాహుల్ గాంధి

విస్తరణకు ఇది వ్యూహాత్మక నిర్ణయంగా భావిస్తున్నారు.సంస్థాగత వ్యవహారాల్లో అనుభవం ఉన్న సీనియర్ నేత ప్రకాశ్ జోషికి పశ్చిమ బెంగాల్ బాధ్యతలు అప్పగించారు. భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో పార్టీ ప్రాబల్యాన్ని పెంచుకోవడంలో ఆయన పాత్ర కీలకం కానుంది.ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని కాంగ్రెస్ అధికారిక ప్రకటనలో తెలిపింది.

## ఫస్ట్ మైల్, లాస్ట్ మైల్ కనెక్టివిటీపై రగడ

- ఆర్టీసీ భవన్‌లో ఆటో, క్యాబ్ సంఘాల ధర్నా.. సమావేశం బహిష్కరణ
- ఉపాధి దెబ్బతీసే యత్నాలను అడ్డుకుంటామని జేఏసీహెచ్చరిక



ఆర్టీసీ భవన్‌లో రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మీసేవ కమిషనర్ రవికిరణ్‌లతో ఆటో, క్యాబ్ సంఘాల జేఏసీ నాయకులు సమావేశమైన దృశ్యం

**హైదరాబాద్ సెప్టెంబర్ 5 ( ప్రభాతవార్త ) :** ఆర్టీసీ, మెట్రోలతో ఆటోలను అనుసంధానిస్తూ ప్రవేశపెట్టాలని భావిస్తున్న ఫస్ట్ మైల్, లాస్ట్ మైల్ కనెక్టివిటీ ప్రతిపాదనపై ఆటో, యాప్ ఆధారిత రవాణా సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. శనివారం ఆర్టీసీ భవన్‌లో రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మీసేవ కమి షనర్ రవికిరణ్‌లతో ఆటో, క్యాబ్ సంఘాల జేఏసీ నాయకులు జరిపిన చర్చలు తీవ్ర ఉద్రిక్తతకు, రసాభాసకు

**దారితీశాయి.మధ్యవర్తిత్వం అవసరం లేదు:** మీసేవ ద్వారా ఒకే టికెట్‌పై బస్సు, మెట్రో, ఆటో ప్రయాణం సాగించేలా రూపొందించిన విధానాన్ని అధికారులు వివరించగా, జేఏసీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆగస్టు 23న రవాణా శాఖ మంత్రి, కమిషనర్‌లతో జరిగిన చర్చల్లో ఆటో కనెక్టివిటీ ప్రతిపాదన లేదని రాతపూర్వకంగా ఇచ్చి, ఇప్పుడు మళ్ళీ ఈ అంశాన్ని ఎలా తెరపైకి తెస్తారని జేఏసీ నాయకుడు రవిశంకర్ ప్రశ్నించారు. ఆటో డ్రైవర్ల బతుకుతెరువుపై మూడో వ్యవస్థ మధ్యవర్తిత్వం తమకు అవసరం లేదని తేల్చి చెప్పారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటుకు జీవో విడుదల, మీటర్ ఛార్జీల పెంపుపై చర్చలు జరుపుతామని చెప్పిన ప్రభుత్వం.. దానికి విరుద్ధంగా ఆర్టీసీ అధికారులతో ఈ సమావేశం నిర్వహించడం సరికాదని జేఏసీ నేతలు మారయ్య, వెంకటేశం మండిపడ్డారు. ఓలా, ఊబర్, ర్యాపిడోల్లో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వైట్ ప్లేట్ బైక్‌లను తక్షణమే సీజ్ చేయాలని, మహిళల ఉచిత బస్సు ప్రయాణ విధానంపై పునరాలోచన చేయాలని మల్లేష్ గౌడ్, ప్రవీణ్ సలీం డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల గత రెండున్నరేళ్లలో 204 మంది డ్రైవర్లు మరణించినా స్పందించని ప్రభుత్వం, ఇప్పుడు కొత్త విధానాల పేరుతో తమ ఉపాధిని దెబ్బతీయాలని చూస్తోందని నాయకులు ఆర్ల సత్తిరెడ్డి, ముకేష్ గౌడ్ ఆరోపించారు.

**అధికారుల వివరణ.. నాయకుల నిరసన:** ఈ అంశంపై అభిప్రాయ సేకరణ మాత్రమే చేస్తున్నామని ర వాణా కమిషనర్ వివరించగా, అసలు ప్రతిపాదనలే లేవని గతంలో చెప్పి ఇప్పుడు అ భిప్రాయ సేకరణ ఏంటని నా యకులు నిలదీశారు. ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని నిరసిస్తూ బిఎంఎస్, బిఆర్టీయూ నాయ కులతో పాటు ఐఎన్ టి యు సి, ఏ ఐ టి యు సి, సి ఐ టి యు, టి యు సి ఐ, ఐ ఎఫ్ టి యు, టి ఆర్ ఎస్ అనుబంధ సంఘాల నేతలు సమావేశాన్ని బహిష్కరించి బయటకు వచ్చేశారు. కాగా, అంతకుముందు ఆటో, క్యాబ్ రవాణాతో సంబంధం లేని వ్యక్తులను చర్చలకు పిలిచి, అసలైన జేఏసీ నాయకులను బయట ఉంచారంటూ రవిశంకర్, వెంకటేశం, సలీం, మారయ్య, ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ భవన్ ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. వాతావరణం ఉద్రిక్తంగా మారడంతో అధికారులు జేఏసీ ప్రతినిధులను లోపలికి పిలిచి చర్చించారు.

**సమ్మె తప్పదు జేఏసీ హెచ్చరిక:** సమావేశం అనంతరం జేఏసీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం తన ద్వంద్వ వైఖరిని వీడి, ఇచ్చిన హామీల అమలుకు మరియు సంక్షేమ బోర్డు జీవో విడుదల కోసం తక్షణమే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికులందరితో సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు.

# దేశవ్యాప్తంగా సైబర్ నేరాలే అధికం

### ఎఐ సాంకేతికతతో విజృంభిస్తున్న నేరస్థులు

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సైబర్ నేరాల పెరుగుదల ప్రమాదకరంగా మారుతోంది. ఇతర నేరాలతో పోలిస్తే సై బర్ నేరాల పెరుగుదల వేగంగా వుండడం పోలీసులతో పాటు నిపుణును కూడా కలవర పరుస్తోంది. మొత్తం నేరాల్లో పావువంతు సైబర్ నేరా లే వుండడం గమనార్హం. రాష్ట్రం వరకు వస్తే గత ఏడాది అన్ని రకాల నేరాలకు సంబంధించి 86,177 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా ఇందులో 21,639 కేసులు కేవలం సైబర్ నేరాలకు సంబంధించినవి కావడం విశేషం. ఇదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా దొంగతనాలు, దోపిడీలలో బా ధితులు పోగొట్టుకున్న మొత్తం సొత్తు 207 కోట్ల రూపాయలు కాగా సైబర్ నేరాల్లో నేరగాళ్లు దోచుకున్నది 1524 కోట్ల రూపాయలు కావడం గ మనార్హం. ఈ లెక్కన ఇది ఏడు రెట్లు అధికంగా వుందని నిపుణులు చెబుతున్నారు. సైబర్ నేరగాళ్లు అమాయకులను ఎంతమేర దోచుకుంటునా న్న రనే దానికి ఇది ఒక ఉదాహరణగా నిలిచిందని వారంటున్నారు. ఇక సైబర్ నేరాలకు సంబంధించి బాధితులు పోగొట్టుకున్న సొత్తులో తిరిగి రాబడుతున్నది అంతంత మాత్రంగానే వుంటోంది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఇది కొంత ఎక్కువగా వున్నా మొత్తం మీద దేశంలో 18వ స్థానంలో వుంది. సై బర్ నేరాలపై వెంటనే ఫిర్యాదు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ కావడం విశేషం. జిరో ఎఫ్ఐఆర్‌లు ఎక్కువగా న మోదవుతున్నది తెలంగాణలోనే అని నేషనల్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ నివేదిక తేటతెల్లం చేసింది. గోల్డన్ ట్రయంగిల్ దేశాల నుంచి సైబర్ నేరాలు ఇక ప్రపంచ వ్యాప్తంగా సైబర్ నేరాలకు పాల్పడే ముఠాలకు అడ్డాలుగా వున్న ప్రాంతం గోల్డన్ ట్రయంగిల్ గా వున్న మయన్మార్, లావోస్‌థాయ్‌లాండ్ సరిహద్దులతో కూడిన ప్రాంతం. ఇందులో కాంబోడియా, థాయ్‌లాండ్ ప్రాంతాలు ఎక్కువగా వున్నాయి. ఇక్కడ వందల సంఖ్య లో సైబర్ నేరాల అడ్డాలు వున్నాయి. ఈ అడ్డాలపై ఆయా దేశాల పౌర, పోలీసు విభాగాలు పలుమార్లు దాడులు చేసినా సైబర్ నేరగాళ్లు వెం టనే తిరిగి కొత్తగా కార్యకలాపాలు సాగిస్తున్నారు. భారత్ సహా ఇతర దేశాలకు చెందిన వారిని ఉద్యోగాల పేరిట నమ్మించి తీసుకువస్తూ వారి చేత బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తున్నారు. డిజిటల్ అరెస్టు, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ వంటి మోసాలు ఇటీవల ఎక్కువయ్యాయని సైబర్ క్రై ం పోలీసుల పరిశీలనలో తేలింది. లక్షల రూపాయల నుంచి కోట్లాది రూపా యలను ఫోన్‌ల నుంచి బదిలీ చేయించుకుంటున్న నేరగాళ్లు భార త్‌ను ఎక్కువగా టార్గెట్ చేస్తున్నారు. ఇక దేశ వ్యాప్తంగా నమోదైన సైబర్ నేరాలకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లలో 44 శాతం తెలంగాణలోనే నమోదవడం గమనార్హం. ఇతర ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణలో సైబర్ నేరాలపై పోలీసులు ప్రజలను చైతన్య ం చేయడంలో సఫలమవడం తో నేరం జరిగిన వెంటనే ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ కారణంగా బాధి తులు పోగొట్టుకున్న నగదును పోలీసులు వెంటనే ఆయా బ్యాం కుల్లో జప్తు చేయించి, కోర్టు వాయిదాల తరువాత అందచేస్తున్నారు. 2024లో తెలంగాణ పోలీసులు సైబర్ నేరగాళ్ల కాజేసిన సొమ్ములో 255 కోట్ల రూపాయలు, 2025లో 279 కోట్ల రూపాయలను పోలీసులు బ్యాంకుల్లో వుండగా జప్తు చేయించా రు. అయితే మనీ రిఫండ్ విషయం లో రాష్ట్రం 18వ స్థానంలో వుండి వెనుకబడింది.

## 97 జీవోను రద్దు చేయాలి: మన్నెక్రిషాంక్



మారేడ్‌పల్లి పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనకు సంఘీభావం తెలుపుతున్న మన్నెక్రిషాంక్

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** జీవో నెం 97 శక్తి శాఖలో పాలిటెక్నిక్ కాలేజీల విలీనాన్ని రద్దు చేయాలని,పాలిటెక్నిక్ విద్యను కాపాడాలని బిఆర్ఎస్ అధికార ప్రతినిధి,సోషల్ మీడియా కన్వీనర్ మన్నెక్రిషాంక్ డిమాడ్ చేశారు. శనివారం సికింద్రాబాద్ మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల తలపెట్టిన ఆందోళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సాంకేతిక విద్యా భవిష్యత్తు,డిప్లమా విద్యా వ్యవస్థపై జీవో నెం 97 శక్తి ప్రభావం చూపుతుందన్నారు. పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థుల అభ్యంతరాలను స్వయంగా తెలుసుకొని విద్యార్థినీలతో కేటీఆర్‌కు నేరుగా ఫోన్‌లో మాట్లాడించారు. విద్యార్థులు చేస్తున్న పోరాటాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.పాలిటెక్నిక్ విద్యార్థులు చేపడుతున్న జీవో నెం 97 రద్దు చేసే వరకు మీతో కలిసి ఉద్యమిస్తామన్నారు.

## ఇరాన్ చమురు ట్యాంకర్లపై అమెరికా దాడులు

**వాషింగ్టన్, సెప్టెంబరు 5:** అమెరికా నౌకాదళానికి చెందిన రెండు యుద్ధనౌకలపై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) బాలిస్టిక్ క్షిపణులతో దాడులకు ప్రయత్నించిన నేపథ్యంలో అమెరికా దళాలు శనివారం మూడు ఇరాన్ క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లను ధ్వంసం చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.ప్రాంతీయ జలాల్లో గస్తీ నిర్వహిస్తున్న అమెరికా విమాన వాహక నౌక, గైడెడ్‌మిసైల్ డిస్ట్రాయర్‌పై ఇరాన్ ఎలాంటి ప్రేరేపణ లేకుండా పలుమార్లు దాడులకు ప్రయత్నించిందని సెంట్రల్ కమాండ్ సోషల్ మీడియాలో పేర్కొంది. అయితే ఈ దాడులను అమెరికా నౌకలు విజయవంతంగా తప్పించుకున్నాయని తెలిపింది. ఇరాన్ దాడుల ప్రయత్నాల అనంతరం ఖార్గ్ ద్వీపం తీరంలో, జాస్క్ సమీపంలో ఐఆర్‌జీసీకి చెందిన ఎం/టీ డౌనీ, ఎం/టీ స్టార్క్1 అనే రెండు క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లను అమెరికా దళాలు ధ్వంసం చేశాయి. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో మరో ఖాళీ ట్యాంకర్‌ను కూడా అమెరికా దళాలు నిర్వీర్యం చేశాయి. ఈ ఘటనల్లో అమెరికా సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.ఈ మూడు ట్యాంకర్లు ఐఆర్‌జీసీ, దాని అనుబంధ సంస్థలకు నిధులు సమకూర్చే బహుళ బిలియన్ డాలర్ల షాడో నెట్‌వర్క్‌లో భాగమని అమెరికా పేర్కొంది.సెంట్రల్ కమాండ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ మాట్లాడుతూ అమెరికా బలగాలపై దాడి జరిగితే తమను తాము రక్షించుకునేందుకు అమెరికా ఏమాత్రం వెనుకాడదని స్పష్టం చేశారు. అవసరమైతే ఇరాన్‌కు చెందిన చమురు నౌకాదళాన్ని ధ్వంసం చేస్తామని హెచ్చరించారు.

## భారత్‌పై ఉగ్రవ్యూహం మారుస్తున్న ఐఎస్ఐ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** భారత్‌పై ఉగ్రవాద వ్యూహాన్ని పాకిస్థాన్ మార్చుకుంటున్నట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి. నేరుగా పాక్ సంబంధాలు బయటపడకుండా కొత్త పద్ధతులను అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ తర్వాత ఉగ్రవాద వ్యూహాన్ని పాకిస్థాన్ పూర్తిగా మార్చినట్లు అధికారులు తెలిపారు. పాక్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి సంస్థల పాత ఉగ్ర మాన్యువల్స్‌ను వాడటం తగ్గించినట్లు సమాచారం. ఇవి భారత దర్యాప్తు సంస్థలకు బాగా పరిచయం కావడంతో దాడుల వెనుక పాక్ సంబంధాలను గుర్తించడం సులభమవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ పేరుతో ఉన్న మార్గదర్శకాలను విదేశాల్లోని హ్యాండ్లర్లు ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. గతంలో ఇస్లామాబాద్, కరాచీ, రావల్పిండి నుంచి ఆదేశాలు వచ్చేవని చెప్పారు. ప్రస్తుతం సిరియా, ఇరాక్ వంటి ప్రాంతాల నుంచి హ్యాండ్లర్లు పనిచేస్తున్నట్లు తెలిపారు. భారత్‌లోని యువతను నేరుగా సంప్రదించకుండా సోషల్ మీడియా ద్వారా లక్ష్యంగా చేసుకుంటున్నారని అధికారులు వివరించారు. ముందుగా వ్యక్తుల ప్రొఫైల్స్‌ను గుర్తిస్తారు. ఆ తర్వాత పరిచయం పెంచుకొని నియామకం, మత ఛాందసవాదం వైపు మళ్లించడం, దాడులకు ప్రణాళిక రూపొందించడం జరుగుతున్నట్లు తెలిపారు. ఇలాంటి నెట్‌వర్క్‌ల ద్వారా లోన్ వుల్ఫ్ దాడులను ప్రోత్సహించాలని పాక్ ప్రయత్నిస్తున్నట్లు అధికారులు చెప్పారు. వీటికి పెద్ద మొత్తంలో డబ్బు, భారీ మాడ్యూల్స్ అవసరం ఉండవు. ఆన్‌లైన్‌లో ప్రభావితమైన వ్యక్తులు సొంతంగా దాడులకు పాల్పడే అవకాశం ఉంటుంది. దీంతో దాడి వెనుక అసలు కుట్రదారులను గుర్తించడం దర్యాప్తు సంస్థలకు కష్టమవుతుంది. పాక్ ఇలా వ్యూహం మార్చుకోవడానికి ఆపరేషన్ సిందూర్ ప్రధాన కారణమని అధికారులు తెలిపారు. మరోసారి అలాంటి ఆపరేషన్‌ను ఎదుర్కొనే పరిస్థితి పాకిస్థాన్‌కు లేదని పేర్కొన్నారు.

## తిర్యానిలో గంజాయి సాగుపై ఉక్కుపాదం

### రూ.2.20 లక్షల విలువైన 22 గంజాయి మొక్కలు స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్

**తిర్యాని, సెప్టెంబర్ 5,ప్రభాతవార్త:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాని పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ సాగుపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వేర్వేరుగా నిర్వహించిన తనిఖీల్లో గంజాయి మొక్కలను సాగు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మొత్తం 22 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ సుమారు రూ.2.20 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మంగి తాళ్లపేట గూడకు చెందిన వెడ్మ జంగు గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడ తనిఖీలు నిర్వహించగా 15 గంజాయి మొక్కలు పట్టుబడ్డాయి. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలుగా అంచనా వేశారు. అదేవిధంగా చిన్న అరటిపెల్లి గ్రామానికి చెందిన మేసినేని చంద్రయ్య గంజాయి మొక్కలను అక్రమంగా సాగు చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అతడు సాగు చేస్తున్న 07 గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.70 వేలుగా పోలీసులు తెలిపారు.ఇద్దరు నిందితులపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

## కీవ్‌పై 72 గంటల పాటు రష్యా దాడులు నిలిపివేత

**మాస్కో, సెప్టెంబరు 5:** ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం కొనసాగుతున్న వేళ కీవ్ నగరంపై 72 గంటల పాటు ఎలాంటి దాడులు నిర్వహించరాదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆదేశించినట్లు క్రెమ్లిన్ శనివారం ప్రకటించింది. అమెరికా ప్రత్యేక రాయబారులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ మాస్కోకు చేరుకున్న నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. నిలిచిపోయిన శాంతి చర్చలను తిరిగి ప్రారంభించే ప్రయత్నాల్లో భాగంగా వారు రష్యాలో పర్యటిస్తున్నారు.క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ టాస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ శనివారం అర్ధరాత్రి నుంచి మూడు రోజుల పాటు కీవ్‌పై ఎలాంటి దాడులు జరపవద్దని పుతిన్ ఆదేశించినట్లు తెలిపారు. ఆదివారం అమెరికా ప్రతినిధులు ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు వెళ్లనున్నట్లు ఉక్రెయిన్ ప్రకటించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ కూడా శుక్రవారం ఇదే తరహా ప్రతిపాదన చేశారు. అమెరికా ప్రతినిధులు తమ దేశంలో పర్యటించే సమయంలో ఉక్రెయిన్ వైమానిక దాడులను నిలిపివేస్తుందని, రష్యా కూడా అదే విధంగా వ్యవహరించాలని ఆయన కోరారు. అమెరికా రాయబారులు విట్‌కాఫ్, కుష్నర్ శనివారం మాస్కో చేరుకున్నారు. రష్యా ప్రతినిధి కిరిల్ దిమిత్రియెవ్ విమానాశ్రయంలో వారికి స్వాగతం పలికారు. గతంలో జనవరిలో అమెరికా ప్రతినిధులు మాస్కోను సందర్శించి పుతిన్‌తో క్రెమ్లిన్‌లో సమావేశమయ్యారు. ఉక్రెయిన్‌రష్యా యుద్ధం ఐదో సంవత్సరంలోకి ప్రవేశించినప్పటికీ, గత ఆరు నెలల్లో అమెరికా శాంతి ప్రయత్నాలు మందగించాయి. శనివారం జెలెన్‌స్కీ మాట్లాడుతూ రష్యా రాత్రివేళ కీవ్, బోరిస్పిల్ విమానాశ్రయాలపై దాడులు చేసిందని తెలిపారు. అమెరికా ప్రతినిధుల పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లకు ప్రతిస్పందనగానే ఈ దాడులు జరిగాయని ఆయన అభిప్రాయపడ్డారు.అమెరికా ప్రతినిధులు విమానంలో ఉక్రెయిన్‌కు వెళ్లే అవకాశం ఉందన్న చర్చలకు ప్రతిస్పందనగానే రష్యా విమానాశ్రయాలపై దాడులు చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోందని జెలెన్‌స్కీ అన్నారు. దౌత్యానికి తమ వైపు నుంచి ఎలాంటి ముప్పు ఉండదని స్పష్టం చేశారు.